Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 297 మేడ్చల్ మల్కాజ్‌గిరి 15 నవంబర్ 2023 బుధవారం పేజీలు : 4

## అందుబాటులో టీటీడీ డైరీలు, క్యాలెండర్లు

చెన్నై : తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ముద్రించిన 2024 ఏడాది డైరీలు, క్యాలెండర్లు నగరంలో అందుబాటులోకి వచ్చాయి. తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల టీటీడీ సమాచారకేంద్రం సలహామండలి చైర్మన్ ఏజే శేఖర్ వీటిని ఆవిష్కరించారు. తొలిగా టి.నగర్, వెంకట నారాయణరోడ్డులో వున్న శ్రీవారి ఆలయంలో, అనంతరం జీఎన్ చెట్టి రోడ్డులో వున్న పద్మావతి అమ్మవారి ఆలయంలో డైరీలు, క్యాలెండర్లను ఆవిష్కరించి, విక్రయాలను ప్రారంభించారు. ఇదిలా వుండగా డైరీ రూ.150, 12 షీట్ల క్యాలెండర్ రూ.130, 12 షీట్ల తెలుగు పంచాంగం క్యాలెండర్ రూ.30గా నిర్ణయించినట్లు నిర్వాహకులు తెలిపారు. వాటిని బల్కుగా కూడా విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏజే శేఖర్‌తో పాటు సలహామండలి మాజీ సభ్యులు ఆనందకుమార్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, పీవీ కష్ణారావు, కార్తికేయన్, యువరాజ్, అనిల్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ వంద తప్పులు పూర్తయినయ్యై

# ఇక సాగనంపుడే...!

## పాపాల భైరవుడంటూ కేసీఆర్‌పై రేవంత్‌రెడ్డి నిప్పులు



జనగామ: బీఆర్ఎస్ నేతలు తాటికొండ రాజయ్య, కడియం శ్రీహరి గురించి తాను కొత్తగా చెప్పాల్సిన అవసరం ఏం లేదని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఎద్దేవ చేశారు. మంగళవారం నాడు స్టేషన్ ఘనపూర్ లో ఎన్నికల ప్రచారంలో రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.."ఒక ఆడబిడ్డ ఇక్కడ పోటీ చేస్తుంటే రాజయ్య, శ్రీహరి ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు. శ్రీహరి సంగతి రాజయ్య చెప్పిండు... రాజయ్య సంగతి శ్రీహరి చెప్పిండు..ఇద్దరూ ఉప ముఖ్యమంత్రిగా పని చేసి ఉద్యోగం ఊడగొట్టుకున్నోల్లే. ఇద్దరి జాతకాలు తెలుసు కాబట్టే ఉద్యోగం ఇచ్చి మధ్యలోనే కేసీఆర్ వీళ్లిద్దరి పదవులను ఊడగొట్టిండు. కేసీఆర్‌కే వీళ్లపై నమ్మకం లేదు.. అలాంటిది ప్రజలు ఎలా నమ్ముతారు. స్టేషన్ ఘనపూర్‌కు వందపడలకల ఆస్పత్రి, డిగ్రీ కాలేజీ తెచ్చే బాధ్యత నాది. పదేళ్లలో కేసీఆర్ ఇచ్చిన హామీలను ఒక్కటి కూడా నెరవేర్చలేదు. బీఆర్ఎస్ పార్టీలో ఆరుగురు మహిళలకు టికెట్లు ఇస్తే.. కాంగ్రెస్ పార్టీ 12 మంది మహిళలకు టికెట్లు ఇచ్చింది. పదేళ్లలో ప్రజలకు కేసీఆర్ చేసిందేం లేదు. తన కుటుంబ సభ్యులకు పదవులు ఇచ్చుకుండు.. దద్దమ్మ దయాకర్ రావును మంత్రిని చేసిండు. సర్పంచులు బిల్లులు రాక ఆత్మహత్య చేసుకుంటుంటే.. ఈ దద్దమ్మ దయాకర్‌రావు వాళ్లను ఖాళీ సీసాలు అమ్ముకోమంటారా? రాష్ట్రంలో ఆడబిడ్డలు ఇంటి నుంచి బయటకు రాలేని పరిస్థితి కేసీఆర్ పాలనలో దాపురించింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే నిరుద్యోగ యువతకు న్యాయం జరుగుతుంది. లేకపోతే 30లక్షల మంది నిరుద్యోగ యువకులు అడవి బాట పట్టే పరిస్థితి వస్తుంది. నిరుద్యోగ యువతి ప్రవళ్లిక ఆత్మహత్య చేసుకుంటే.. కేసీఆర్ ప్రభుత్వం ఆ కుటుంబం పరువును బజారుకీడ్చింది. శిశుపాలుడి వంద తప్పులు పూర్తయ్యాక శిరచ్ఛేదనం జరిగింది. పాపాల భైరవుడు కేసీఆర్ వంద తప్పులు పూర్తయ్యాయి. ఈ ఎన్నికల్లో శిరచ్ఛేదనం జరగాల్సిందే.. బీఆర్ఎస్ ప్రభుత్వం నేల కూలాల్సిందే. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మహిళలకు ప్రతీ నెలా రూ.2500 అందిస్తాం. రూ.500లకే వంటగ్యాస్ సిలిండర్ అందిస్తాం. రైతులకు, కౌలు రైతులకు ప్రతీ ఏటా ఎకరాకు రూ.15వేలు అందిస్తాం. రైతు కూలీలకు ప్రతీ ఏటా రూ.12వేలు అందిస్తాం. ఆనాడు కాంగ్రెస్ పార్టీ 9 గంటల ఉచిత కరెంట్ ఇచ్చింది. ఇప్పుడు 24గంటల నాణ్యమైన ఉచిత కరెంటు ఇచ్చే బాధ్యత కాంగ్రెస్‌ది. పేదలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తాం. చేయూత పథకం ద్వారా రూ.4వేలు పెన్షన్ అందిస్తాం. ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10లక్షల వరకు ఉచిత వైద్యం అందిచే బాధ్యత కాంగ్రెస్‌ది. స్టేషన్ ఘనపూర్‌లో ఇందిరమ్మను 25వేల మెజార్టీతో గెలిపించండి.. ఇక్కడ ఇందిరమ్మను గెలిపిస్తే అక్కడ సోనియమ్మను గెలిపించినట్లే" అని రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు.

## పోలింగ్ కేంద్రాలకు మావోయిస్టుల దెబ్బ?



హైదరాబాద్ : త్వరలో జరగబోయే తెలంగాణా అసెంబ్లీ ఎన్నికల్లో కొన్ని నియోజకవర్గాల్లో మావోయిస్టుల దెబ్బ తప్పదనే అనిపిస్తోంది. మామూలుగా అయితే కొన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థులు ప్రచారం చేసుకోవటానికి కూడా భయపడుతారు. ముఖ్యంగా అధికార పార్టీ అభ్యర్థుల్లో ఈ భయం చాలా ఎక్కువగా ఉంటుంది. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ప్రచారమైనా, పోలింగ్ అయినా సాయంత్రం 4 గంటలకే ముగించేయాలని పోలీసులు చెబుతున్నారు. కేంద్ర ఎన్నికల కమీషన్ కూడా సాయంత్రం 4 గంటలకే పోలింగ్ ముగించేందుకు ఏర్పాట్లు చేస్తుంది. చత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర సరిహద్దుల్లోని కొన్ని నియోజకవర్గాల్లో మావోయిస్టుల ప్రభావం బాగా ఎక్కువగా ఉంటుందనటంలో సందేహం అవసరంలేదు. అందుకనే అంతర్రాష్ట్ర పోలీసు చెక్ పోస్టులు ఏర్పాటుచేసి వచ్చిపోయే వాహనాలను రెగ్యులర్ గా తనిఖీలు చేస్తున్నారు. నియోజకవర్గాల్లోని అన్నీ గ్రామాల్లో ప్రత్యేక పోలీసులు దళాలతో పాటు కేంద్ర దళాలను ఎన్నికల కమీషన్ దింపేసింది. 24 గంటలూ పోలీసుల కాపల, కూంబింగ్ కారణంగా మావోయిస్టుల కదలికలపై నిఘా పెంచేసింది. కొత్తగూడెం, భూపాలపల్లి, ములుగు, అసిఫాబాద్, రామగుండం, ఆదిలాబాద్, ఇల్లెందు, నిర్మల్ తదితర ప్రాంతాల్లో సుమారు 600 పోలింగ్ కేంద్రాలున్నాయి. వీటిల్లో ఎక్కువగా అసిఫాబాద్, చెన్నూరు, ములుగు, మంథని, అశ్వారావుపేట, భద్రాచలం, పినపాక, బెల్లంపల్లి, చెన్నూరు, సిర్పూర్ కాగజ్ నగర్ నియోజకవర్గాల్లోనే ఉన్నాయి. నిజానికి మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడటం పోలీసు అధికారులకు కత్తిమీదసాము లాంటిదనే చెప్పాలి. ఉదయం లేచింది మొదలు రాత్రి పొద్దుపోయేంతవరకు ఎక్కడేమి జరుగుతుందో ? ఎక్కడా మావోయిస్టులు దాడిచేస్తారో అనే టెన్షన్ తోనే పోలీసు అధికారులకు నిద్రకూడా సరిగా పట్టదు. దీనికితోడు బీఆర్ఎస్, బీజేపీ పార్టీలను తరిమికొట్టాలని, ఈ రెండు పార్టీల అభ్యర్థులకు ఓట్లు వేయకుండా ఓడించాలని మావోయిస్టులు పిలుపిచ్చారు.

దాంతో ఈ రెండుపార్టీల అభ్యర్థుల్లో కంగారు పెరిగిపోతోంది. ఏ మూలనుండి మావోయిస్టులు దాడులు చేస్తారో తెలీక అభ్యర్థుల్లో టెన్షన్ పెరిగిపోతోంది. ఎన్నికల ప్రక్రియను భగ్నంచేయటంలో భాగంగా ఇప్పటికే మావోయిస్టు యాక్షన్ టీమ్ లు రంగంలోకి దిగేశాయన్న ఇంటెలిజెన్స్ నివేదికలతో పోలీసులంతా హై అలర్టులో ఉన్నారు. మరి చివరకు ఏమిజరుగుతుందో చూడాల్సిందే.

## వరంగల్ సలసల.. వేడెక్కిన రాజకీయం




జనగామ : తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పోరుగల్లుగా పేరున్న వరంగల్ జిల్లా వేడెక్కింది. నామినేషన్లకు ఇంకా గడువు ఉండగానే ప్రధాన పార్టీల అభ్యర్థులు జోరుగా ప్రచారాలు సాగిస్తున్నారు.. గ్రామాలను సైతం జల్లెడ పడుతున్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు సహా చిన్నాచితకా పార్టీల నాయకులు కూడా ప్రజలను మచ్చిక చేసుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి నియోజకవర్గాల్లో తెల్లారే సరికే అభ్యర్థులు గ్రామాల బాట పడుతున్నారు. కొన్ని కొన్ని ప్రాంతాల్లో అయితే.. అభ్యర్థులు ఏకంగా రాత్రిపూట ప్రచారం ముగించిన గ్రామంలోనే నిద్ర చేసి పొద్దున్నే తమ ప్రచారాలను కొనసాగిస్తున్నారు. నామినేషన్ల ఘట్టం ప్రారంభానికి ముందే వీలైనన్ని ఎక్కువ గ్రామాలను చుట్టేయాలనే ప్రయత్నాల్లో ఉన్నారు.

**అధికార పార్టీ దూకుడు! :** బీఆర్ఎస్ తరపున జనగామ నుంచి పల్లా రాజేశ్వర్‌రెడ్డి, స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి కడియం శ్రీహరి, పాలకుర్తి నుంచి ఎర్రబెల్లి దయాకర్‌రావు పేర్లు ఖరారు అయ్యాయి. కాంగ్రెస్ నుంచి తొలి విడతలో స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి సింగపురం ఇందిర పేరు మాత్రమే ప్రకటించగా రెండో జాబితాలో జనగామ నుంచి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, పాలకుర్తి నుంచి కాంగ్రెస్ నాయకురాలు, ఎన్నారై ఝాన్సీరెడ్డి కోడలు యశస్వినిరెడ్డిని ప్రకటించింది. బీజేపీ తరపున జనగామ నుంచి ఆరుట్ల దశమంత్‌రెడ్డి, స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి గుండె విజయరామారావు, పాలకుర్తి నుంచి లేగ రామ్మోహన్‌రెడ్డి పేర్లను బీజేపీ ఖరారు చేసింది. అయితే.. వీరందరిలోనూ బీఆర్ ఎస్ దూకుడు జోరుగా ఉంది. బీఆర్ ఎస్ నాయకులు.. ప్రజల్లోకి దూసుకుపోతున్నారు. కేసీఆర్ ఇమేజ్, తెలంగాణ సెంటిమెంటును పండిస్తున్నారు.

**వత్తిడి తగ్గించుకునే వ్యూహం! :** సహజంగానేఎన్నికలు అనగానే అభ్యర్థులపై వత్తిడి ఉంటుంది. ఈ క్రమంలో వత్తిడిని తగ్గించుకునేందుకు బీఆర్ ఎస్ నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారు. నామినేషన్లకు ముందు వీలైనన్ని ఎక్కువ గ్రామాలను పూర్తి చేస్తే ఆ తర్వాత ఒత్తిడి తగ్గుతుందని భావిస్తున్నారు. ఈ క్రమంలో అభ్యర్థులు రోజుకు ఐదు నుంచి ఆరు గ్రామాల వరకు చుట్టేస్తున్నారు. ఓ వైపు పగటిపూట గ్రామా ల్లో ప్రచారం చూస్తూ.. రాత్రిళ్లు వ్యూహాలు, ప్రణాళికలపై అర్ధరాత్రి వరకు కసరత్తుల్లో మునిగిపోతున్నారు. మొత్తంగా వరంగల్ జిల్లాలో ఎన్నికల రాజకీయంగా జోరుగా సాగుతోంది.

# బీఆర్ఎస్ గెలిస్తే రైతుబంధు రూ.16 వేలు అయితది..

# కాంగ్రెస్ గెలిస్తే ఉన్నది మాయమైతది



## ఆలోచించి ఓట్లేయండి - సీఎం కేసీఆర్

పాలకుర్తి: బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును పాలకుర్తి నియోజకవర్గంలో గెలిపిస్తే రైతుబంధు రూ.16 వేలు అయితదని, కాంగ్రెస్ పార్టీ గెలిస్తే ఉన్నది గూడా పోతదని ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా పాలకుర్తిలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో సీఎం మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ తీసుకొచ్చిన ప్రజాసంక్షేమ పథకాలన్నీ అక్కర్లేదని, తాము అధికారంలోకి రాగానే వాటిని తీసేస్తమని కాంగ్రెసోళ్లు చెబుతున్నరని, కాబట్టి ప్రజలు బాగా ఆలోచించి ఓటు వేయాలని సీఎం కేసీఆర్ కోరారు. 'మేం రైతులకు 24 గంటల కరెంటు ఇస్తున్నం. రైతుబంధు ఇస్తున్నం. రైతుబీమా ఇస్తున్నం. కాంగ్రెస్ నాయకులేమో నోటికొచ్చింది మాట్లాడుతున్నరు. పీసీసీ మాజీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్‌రెడ్డి కేసీఆర్‌కు ఏం పనిలేదు, ప్రజల సొమ్మును రైతుబంధు పేరుతోటి దుబారా చేస్తున్నడు అంటున్నడు. రైతుబంధు నిజంగా దుబారానేనా..? కాదు గదా..? రైతుబంధు ఉండాల్నంటే మరె ఏం జెయ్యాలె..? పాలకుర్తిల ఎర్రబెల్లి దయాకర్‌రావును గెలిపించాలి. ఇక్కడ దయాకర్‌రావు గెలిస్తే రైతుబంధు రూ.16 వేలు అయితది. కాంగ్రెస్ గెలిస్తే ఉన్నది గూడా మాయమైతది' అని సీఎం అన్నారు.

**10 హెచ్‌పీ మోటార్లు వీని అయ్యకొంటడా..?** 'పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి కేసీఆర్‌కు ఏం పనిలేదు. 24 గంటల కరెంటు ఇచ్చి వృథా చేస్తున్నడు. మూడు గంటల కరెంటు చాలు అంటున్నడు. రైతులు 10 హెచ్‌పీ మోటర్ పెట్టుకుంటే చాలు గంటకు ఎకరం పారుతది అంటున్నడు.

మూడు గంటలు ఇస్తే మూడెకరాలు పారుతది అని చెప్తున్నడు. మరె రైతుల దగ్గర 10 హెచ్‌పీ మోటార్లు ఉంటయా..? ఉండేది 3 హెచ్‌పీ, 5 హెచ్‌పీ మోటార్లు. రాష్ట్రంల మొత్తం 33 లక్షల మోటార్లు ఉన్నయ్. మరె 33 లక్షల 10 హెచ్‌పీ మోటార్లు ఎవడు కొనాలె..? వీని అయ్య కొంటడా..? 10 హెచ్‌పీ మోటార్లు గుంజుడు వెడితే బోరు పొక్కలల్ల నీళ్లుంటయా..? అందుకే ఎన్నికలు వచ్చినప్పుడు ఆగమాగమై ఓట్లేయొద్దు. మంది మాటలు పట్టుకుని మార్మానం బోతే మళ్లొచ్చేసరికి ఇళ్లు గాల్తది. మేం ఆరు చందమామలు తెస్తం, మేం ఏడు సూర్యుళ్లను తెస్తం అని తియ్యమాటలు చెప్పేటోళ్లను నమ్మి ఓటెయ్యొద్దు' అని సీఎం సూచించారు.

**ప్రలోభాలకు గురై ఓటు వేయొద్దు.. ఐదేండ్లు శిక్ష అనుభవించాల్సి వస్తది :** ప్రజాస్వామ్యంలో ఒకే ఒక్క ఆయుధం ఓటు.. అది మీ తలరాతను మారుస్తది అని ముఖ్యమంత్రి కేసీఆర్ తెలిపారు. మంచి అభ్యర్థులకు ఓటు వేయకపోతే వచ్చే ఐదేండ్లు శిక్ష అనుభవించాల్సి వస్తది. మనం వేసే ఓటు మన రాష్ట్రం, నియోజకవర్గం, కుటుంబం యొక్క భవిష్యత్‌ను నిర్ణయిస్తుంది. ఆలవోకగా, నాలుగు డబ్బులు, రెండు సీసాలు ఇచ్చిండని ప్రలోభాలకు గురై ఓటు వేయొద్దు. గ్రామాల్లో, పట్టణాల్లో ప్రజలు కూర్చుని చర్చించి ఓట్లు వేసినప్పుడే ప్రజలు గెలుస్తారు. అప్పుడే నిజమైన ప్రజాస్వామ్యం వచ్చినట్లు అని కేసీఆర్ పేర్కొన్నారు. పాలకుర్తి నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ పాల్గొని ప్రసంగించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏండ్లు గడుస్తుంది. కానీ ఈ దేశంలో ప్రజాస్వామ్య ప్రక్రియలో రావాల్సినంత పరిణితి రాలేదు. ఎలక్షన్లు అనగానే సీటీలు, డప్పులు, అబద్ధాలు, అభాండాలు, ఆరోపణలు, గోల్ మాల్, పిచ్చి పిచ్చి కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఎలక్షన్లు చాలాసార్లు వచ్చాయి.

చాల మందిని గెలిపించారు. ఇక ఈ 30న ఓట్లు పడుతాయి. 3న లెక్కిస్తారు. అక్కడికి కథ అయిపోతది. ఎన్నికలు వచ్చినప్పుడు పార్టీకి ఒకరు నిలబడుతారు. తప్పకుండా మీరు నిలబడ్డ వ్యక్తుల మంచి చెడ్డా, వాళ్ల ఆలోచన, ఏం పనులు చేస్తారు అని ఆలోచించాలి. అభ్యర్థుల గుణగణాలు చూడాలి. వీటన్నింటి కంటే ముఖ్యమైంది ఒకటి ఉంటది. ఓట్ల కౌంటింగ్ కాగానే అయిపోదు. ఇక్కడ గెలిచే అభ్యర్థి యొక్క రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడుతుంది. ఆ ప్రభుత్వం మంచిదైతే వచ్చే ఐదేండ్లు మంచి జరుగుతది. మంచి ప్రభుత్వం ఏర్పడకపోతే.. ఆగమైపోతం అని కేసీఆర్ అన్నారు.

**పార్టీల నడవడిక గురించి ఆలోచించాలి..** అభ్యర్థుల గురించి మాత్రమే కాదు.. వారి వెనుకున్న పార్టీల గురించి ఆలోచించాలి. నడవడిక చూడాలి. వారికి అధికారం ఇస్తే ఏం చేశారు..? ఏం చేస్తారు..? అనేది చూడాలి. బీఆర్ఎస్ మీ కండ్ల ముందరనే పుట్టిన పార్టీ. తెలంగాణ హక్కులు, ప్రజలను కాపాడడం కోసం పుట్టింది. కాంగ్రెస్, బీజేపీ చరిత్ర మీకు తెలుసు. ఈ పదేండ్లు బీఆర్ఎస్ ఏం చేసింది. గతంలో అధికారంలో ఉండి 50 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ ఏం చేసిందనేది విచారించాలి అని కేసీఆర్ సూచించారు.

# సంపాదకీయం

## అమెరికాలో వరదొస్తే...
## ఆఫ్రికాకు ఎంత కలిసొస్తుందో తెలుసా?

వానొచ్చెనంటే వరదొస్తది.. వరదొచ్చెనంటే బురదొస్తది.. బురదలో దొర్లితే దురదొస్తది.. అనేది పాత మాట.! అమెరికాలో వానొచ్చెనంటే వరదొస్తది.. అక్కడ వరదొచ్చెనంటే ఆఫ్రికాకు బాగా కలిసొస్తది అనేది కొత్త మాట.! ఇదేదో ప్రాస కోసం వాడుతున్న మాట.. యతికోసం రాస్తున్న మాటో కాదు సుమా... ఇది అక్షరాలా నిజం.. అమెరికా కార్ల మీద ఒట్టు! అవును... అమెరికాలో వరదలొస్తే ఆఫ్రికాకు బాగా కలిసి వస్తుంది. దానికి కారణం కార్ల వ్యాపారం. సెకండ్ హ్యాండ్ కార్ల వ్యాపారం. బెంజ్, బీ.ఎం. డబ్ల్యూ, ఆడీ, జాగ్వార్, ఫోర్డ్, హ్యూండాయ్, లూంబెర్గనీ... కంపెనీతో సంబంధం లేదు, మోడల్ తో అసలు సంబంధం లేదు... వరదలో తడిసిందా, ఆఫ్రికాకు తరలించాల్సిందే..! ఇలా చూపించీ చూపించనట్లు, వినిపించీ వినిపించనట్లు, కనిపించీ కనిపించనట్లు చెప్పుకోవడం ఎందుకు కానీ... డైరెక్ట్ గా మేటర్ లోకి వెళ్లిపోదాం! ప్రస్తుతం ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు అమెరికాలోని ఈశాన్య రాష్ట్రాలు వరదలో నిండిపోతున్న సంగతి తెలిసిందే. ఇక అగ్రరాజ్యం ఆర్థిక రాజధాని న్యూయార్క్ సిటీ రోడ్లయితే నదీపాయలను తలపిస్తున్నాయి. దీంతో నగర వాసులు ఇళ్లల్లోంచి మరీ అవసరమైతే తప్ప బయటకు రావొద్దని ప్రభుత్వం హెచ్చరికలు జారీచేసింది. ఆ సంగతి అలా ఉంటే... ఈ వరద నీటిలో వీదుల్లో ఉన్న కార్లు, పార్కిం స్థలాల్లో ఉన్న వాహనాలు అన్నీ నీట మునిగిన సంగతి తెలిసిందే. ఇలా నీటిలో మునిగి, ఇంజిన్ తడిచిన వాహనాలను అమెరికన్లు తిరిగి వాడరు! అవును... ఒకసారి వరద నీళ్లలో ఇంజిన్ తడిస్తే.. ఆ కారును అమెరికాలో ఎవరూ ముట్టుకోరట. సాధారణంగా లక్షన్నర డాలర్ల నుంచి 2 లక్షల డాలర్ల వరకు ఉండే లగ్జరీ కార్లను సైతం వారు లైట్ తీసుకుంటారంట. ఇదే సమయంలో ఎంత ఖరీదైన కారైనా... దాని ఇంజిన్ ఒక్కసారి వరద నీటిలో తడిస్తే... దాని ధర అమాంత పడిపోతుందంట. అది కూడా అత్యంత దారుణంగా... ఉదాహరణకు లక్షన్నర డాలర్లు ఉన్న లగ్జరీ కారు ఇంజిన్ వరదనీటిలో మునిగి నానిపోతే దాని ధర 5వేల డాలర్లకు పడిపోతుందంట. దీంతో... ఇలాంటి కార్లన్నింటిని ఓనర్లు ఇన్సూరెన్స్ వాళ్లకు అప్పగించేసి కొత్త కార్లను తీసుకుంటారట. ఈ క్రమంలో అది ఎంత ఖరీదైన కారైనా చాలా తక్కువ ధరకు జంక్ యార్డ్ లు లేదా వెహికల్ రీబిల్డర్ లకు వేలంలో విక్రయిస్తారట. ఈ క్రమంలో ఇలాంటి వాటిని కొనుగోలు చేసిన రీసెల్లర్ కంపెనీలు.. ఆ కార్లను.. కెన్యా, జింబాంబ్వే, నైజీరియా వంటి దేశాలకు ఎగుమతి చేస్తారు. వరదలో నానడం వల్ల డ్యామేజ్ అయిన ఇంటీరియర్, సీట్ కవర్స్, మేట్ లను చైనా మెటీరియల్ తో కవర్ చేస్తారంట. అలా ఆల్ మోస్ట్ ఎఫ్.ఆర్. వెహికల్స్ గా కలరింగ్ ఇచ్చి ఆఫ్రికా దేశాలకు తరలించి సుమారు 40వేల డాలర్ల నుంచి 50 వేల డాలర్లకు విక్రయిస్తారని తెలుస్తోంది. ఇలా సుమారు లక్షన్నర నుంచి రెండున్నర లక్షల డాలర్లు విలువ చేసే కార్లను సుమారు 45 నుంచి 50 వేళ డాలర్లకు దొరికే సరికే ఆయా దేశాల్లోని కార్ల ప్రియులు ఎగబడి కోంటారట. ఇలాంటి కార్లు ఎన్ని రోజులు పనిచేస్తాయనే సంగతి కాసేపు పక్కనపెడితే... తక్కువ ధరలో కోరుకున్న కారు కావాలనుకునే వారికి మాత్రం ఇది సువర్ణావకాశమే! ఇలా అమెరికాలో వరద వస్తే ఆఫ్రికా దేశాల్లో... ముఖ్యంగా కెన్యా, నైగర్, జింబాబ్వే, నైజిరియా లాంటి దేశాలు పెద్ద ఎత్తున ఈ కార్లను దిగుమతి చేసుకుంటున్నాయని అంటున్నారు. కాసింత ఖర్చు పెట్టి కొత్తగా తీర్చిదిద్దుతున్నాయుట. దీంతో... ఆర్థికంగా వెనుకబడిన ఆదేశాల్లోని వ్యక్తులు 40వేళ డాలర్లకే లోంబెర్గనీలో తిరుగుతారన్నమాట. ఈ బంపరాఫర్ ఏదో బాగానే ఉంది కదా.. మరి మనకు ఆ ఛాన్స్ లేదా అని అంటారా? ఇలాంటి కార్యక్రమాలకు భారత్ అంగీకరించడం లేదని తెలుస్తుంది. అయినా... నేరుగా టెస్లా కార్ల తయారీ యూనిట్ వంటివి ఇండియాలో ఉంటుంటే ఇలాంటి వరద, బురద కార్లు మనకెందుకబ్బా... అని సరిపెట్టుకోవడమే!!

# శామీర్ పేట మండలంలో వజ్రేష్ యాదవ్ భారి రోడ్ షో

### కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయం...
### మంత్రి మల్లారెడ్డి అక్రమాలను బట్టబయలు చేస్తాం...
### మేడ్చల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి తోటకూర వజ్రేష్ యాదవ్





శామీర్ పేట (గరుడ వార్త) : పేద బడుగు బలహీన వర్గాలకు ఆశాజ్యోతి కాంగ్రెస్ పార్టీనేనని మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రాష్ యాదవ్ అన్నారు. మేడ్చల్ నియోజకవర్గం శామీర్‌పేట్ మండలంలోని పొన్నాల, బొమ్మరాసిపేట , బాబాగూడ, అలియాబాద్, లాల్గడి మలక్‌పేట్ , మురహరిపల్లి, , తుర్కపల్లి, యాడారం, మజీద్‌పూర్ శామీర్‌పేట గ్రామాల్లో మంగళవారం కాంగ్రెస్ మండల కమిటీ ఆధ్వర్యంలో గడప గడపకి కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి , రాష్ట్ర సీనియర్ నాయకులు నక్కా ప్రభాకర్ గౌడ్ తో కలిసి మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి తోటకూర వజ్రేష్ యాదవ్ ప్రచారం చేశారు. కాగా బారి ఎత్తున మహిళలు యువకులు తరలివచ్చి జై కాంగ్రెస్ జై వజ్రేష్ యాదవ్ అంటూ నినాదాలు చేయడంతో నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా ముందుకు సాగారు. ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ... అసమర్థ నాయకులు మల్లారెడ్డి మేడ్చల్ కు చేసింది ఏమి లేదని మేడ్చల్ లో ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. తాను వార్డు సభ్యుని స్థాయి నుండి ప్రజా సేవలో ఉన్నానని స్థానిక సమస్యలపై నాకు పూర్తి అవగాహన ఉందని మేడ్చల్ నుండి రెండుసార్లు ఎమ్మెల్యే గా పోటీ చేసి ఓడిపోయానని మూడో సారి ఎమ్మెల్యేగా బరిలో ఉన్నానని నన్ను ఆశీర్వదించి చెయ్యి గుర్తుకు ఓటేసి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గ ఏ బ్లాక్ అధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి, బి బ్లాక్ అధ్యక్షుడు మహేష్ గౌడ్, శామీర్ పేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు యాష్కి శంకర్ గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కంఠం కృష్ణారెడ్డి, శామీర్ పేట ఎంపీటీ సీల ఫోరం అధ్యక్షుడు సరసం అ శోక్ రెడ్డి, మేకల మహేందర్ యాదవ్, రాజుదొర జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు ముజీబ్, బొమ్మరాసిపేట ఎంపీటీసీ ఇందిరా, సుధాకర్ రెడ్డి అన్ని గ్రామాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనారు.

# శాంతి బద్రతలకు విగాతం వాటిల్లకుకండా చర్యలు తీసుకోవాలి...


### స్వేచ్ఛయూత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలి : సైబరాబాద్ పోలీస్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర




జిల్లా బ్యూరో గరుడ వార్త: శాసనసభ ఎన్నికల్లో శాంతి బద్రతలకు విగాతం వాటిల్లకుకండా, స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేశారు. శాసనసభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో శేర్లింగంపల్లి పటాన్చెరువు నియోజకవర్గంలోని సంబంధిత డీసీపీలతో శాంతిభద్రతలకు విఘాతం వాటిల్లకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన చర్యలపై మంగళవారం సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ లో, కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశానికి మాదాపూర్ డిసిపి జి సందీప్, బాల్నగర్ డిసిపి శ్రీనివాస్, మాదాపూర్ జోన్ అడిషనల్ డీసీపీ ఎం నరసింహారెడ్డితో పాటుగా మాదాపూర్, మియాపూర్, కూకట్పల్లి, బాలానగర్, పటాన్చెరువు డివిజన్లకు సంబంధించిన ఏసీపీలు, స్టేషన్ హౌస్ ఆఫీసర్లు తోపాటుగా ఎన్నికల సిబ్బంది హాజరయ్యారు.

# కార్తీక మాసంలో పంచ పుణ్యక్షేత్రాల దర్శన సదుపాయాన్ని భక్తులకు కల్పిస్తూ ఆర్టీసీ ప్రత్యేక బస్సులు...

– హకీంపేట్ డిపో మేనేజర్ భవభూతి



శామీర్ పేట( గరుడ వార్త):కార్తీక మాసం పురస్కరించుకొని భక్తులకు పంచ పుణ్యక్షేత్రాల దైవదర్శన సౌకర్యం కల్పిస్తూ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తున్నామని హకీంపేట్ బస్ డిపో మేనేజర్ భవభూతి ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 18 నుండి, డిసెంబర్ 10 వరకు ప్రతి శని ఆదివారాల్లో ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడుపుతామని తెలిపారు. ముఖ్యంగా సికింద్రాబాద్ స్టేషన్ గురుద్వారా పాయింట్ నుండి ఉదయం ఏడు గంటలకు సదరు బస్సు బయలుదేరి, ఇందులో రత్నాలయం అలియాబాద్,సరస్వతి మాత ఆలయం వర్గల్,మల్లన్న టెంపుల్ కొమురవెల్లి, రామలింగేశ్వరాలయం కీసర గుట్ట, లక్ష్మీ నరసింహ ఆలయం చీర్యాల, ఐదు పుణ్యక్షేత్రాల దర్శనం తరువాత సాయంత్రం ఏడు గంటలకు సికింద్రాబాద్ స్టేషన్ పాయింటుకు చేరడంతో యాత్ర బస్సు ప్రయాణం పరిసమాప్తి అవుతుందన్నారు.టిక్కెట్ ధర పెద్దలకు ఒక్కరికి 500/-రూపాయలు, పిల్లలకు 300/-నిర్ణయించారని,ఆన్లైన్లో కూడా టికెట్లు బుక్ చేసుకోవాడానికి, కార్తీక మాసం దర్శనం ప్యాకేజీ 1 టైప్ చేసి బుకింగ్ చేసుకోవచ్చని తెలిపారు.

# సిహెచ్ మల్లా రెడ్డి నామినేషన్ ఆమోదించబడింది

గరుడ వార్త మేడ్చల్ జిల్లా బ్యూరో : సిహెచ్ మల్లా రెడ్డి దాఖలు చేసిన నామినేషన్ ప్రక్రియ గురించి కొన్ని మీడియా నివేదికలలో కొన్ని ప్రశ్నలు లేవనెత్తబడ్డాయిని, మల్లా రెడ్డి ఈ క్రింది తేదీలలో నామినేషన్లు తోపాటుగా అఫిడవిట్లను దాఖలు చేశారన్నారు. తేదీ 08.11.2023 న (2) సెట్లు దాఖలు చేయబడ్డాయి. 09.11.2023 న (2) సెట్లు దాఖలు చేయబడ్డాయి. మల్లా రెడ్డి దాఖలు చేసి ననామినేషన్లు మరియు అఫిడవిట్లను, ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం, రిటర్నింగ్ ఆఫీస్ నోటీసు బోర్డులో ప్రదర్శించబడింది ఎన్నికల కమిషన్ అధికారిక వెబ్సైట్- %ENCORE% సాఫ్ట్వేర్లో కూడా నవీకరించబడింది. రిటర్నింగ్ ఆఫీసర్స్ మాన్యువల్లోని పేరా 5.20 ప్రకారం మల్లారెడ్డి దాఖలు చేసిన అన్ని అఫిడవిట్లు మరియు నామినేషన్లు నోటీసు బోర్డులో ప్రదర్శించబడింది (24) గంటల్లో ఎన్నికల కమిషన్ అధికారిక వెబ్సైట్లో అప్లోడ్ చేయబడ్డాయి. ౖ షెడ్యూల్ ప్రకారం, నామినేషన్ల పరిశీలన 13.11.2023న చేయబడింది. పరిశీలన ప్రక్రియ మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గపు సాధారణ పరిశీలకుని ముందు నిర్వహించబడింది. ౖ పరిశీలనలో, %BRS% పార్టీ సిహెచ్ మల్లా రెడ్డి చేసిన నామినేషన్ మార్గదర్శకాల ప్రకారం పరిశీలించబడింది మరియు అతని నామినేషన్ ఆమోదించబడింది.సిహెచ్.మల్లా రెడ్డి చేసిన నామినేషన్ ను స్క్రూట్ని పూర్తయిన తర్వాత, సిహెచ్. మల్లా రెడ్డి విద్యార్హతల తప్పుడు ప్రకటనకు సంబంధించి దాఖలు చేసిన అఫిడవిట్పై ,శ్రీ కందాడి అంజిరెడ్డి సుమారు మధ్యాహ్నం 12:15 సమయము లో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేశారు. Ch. మల్లారెడ్డిగారి విద్యార్హతలుమరియు ఇతర అంశాలను చూపి, మల్లారెడ్డి దాఖలు చేసిన అఫిడవిట్తో పాటు నాలుగు సెట్ల నామినేషన్ పత్రాలను తిరస్కరించాలని అభ్యర్థించారు. రిటర్నింగ్ అధికారి మాన్యువల్లోని పారా5.20.4 ప్రకారం, దాఖలు చేసిన ఏదైనా కౌంటర్ అఫిడవిట్లు నోటీసు బోర్డులో కూడా ప్రదర్శించబడతాయి మరియు ఎన్నికల కమిషన్ అధికారిక వెబ్సైట్లో ENCORE సాఫ్ట్వేర్ లో కూడా అప్లోడ్ చేయబడతాయి. ఈ ప్రక్రియలో,కందాడి అంజిరెడ్డి దాఖలు చేసిన కౌంటర్ అఫిడవిట్ కూడా రిటర్నింగ్ ఆఫీసర్ మాన్యువల్లోని పేరా 5.20.4ప్రకారం రిటర్నింగ్ అధికారి కార్యాలయంనోటీసు బోర్డులో ప్రదర్శించబడింది మరియు ఎన్నికల కమిషన్ అధికారిక వెబ్సైట్లో అప్లోడ్ చేయబడింది.రిటర్నింగ్ అధికారి మాన్యువల్లోని పారా 6.10.1(IV) ప్రకారం, నిర్దేశించిన అఫిడవిట్ పూర్తిగనింపబడి ఉన్నప్పటికీ, ఆరోపించబడినా లేదా తప్పుడు సమాచారాన్ని కలిగి ఉన్నట్లు గుర్తించబడినా, ఈ కారణంగా నామినేషన్ను తిరస్కరించకూడదు.కాబట్టి Ch.మల్లా రెడ్డిగారు దాఖలు చేసిన నామినేషన్ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం పరిశీలించబడినది పిదప తని నామినేషన్ ఆమోదించబడింది ని 043-మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి తెలిపారు.

# బిఆర్ఎస్ సంక్షేమ పథకాలే బిఆర్ఎస్ పార్టీని గెలిపిస్తాయి

### ముచ్చటగా మూడోసారి మల్లారెడ్డి గెలుపు తథ్యం
### అలియబాద్ లో 150 బైకులతో బారి బి ఆర్ ఎస్ ర్యాలీ
### అలియాబాద్ గ్రామ సర్పంచ్ గురక కుమార్

శామీర్ పేట (గరుడ వార్త) : కెసిఆర్ ప్రవేశపెట్టిన ఎన్నో సంక్షేమ పథకాలతో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో పరుగులు తీస్తున్న విషయాన్ని తెలంగాణ ప్రజలు గుర్తించారని, ఈసారి ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ గెలవడం తధ్యమని అలియాబాద్ గ్రామ సర్పంచ్



గురక కుమార్ ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం మొదలుకొని వివిధ వీధుల్లో బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇతర పార్టీలకు చెందిన పలువురు నాయకులు ప్రజలు టిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా గురక కుమార్ మాట్లాడుతూ... ముచ్చటగా మూడోసారి బి ఆర్ ఎస్ గెలుపు తధ్యమని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కోడూరి అశోక్, సగ్గ సీను, ఉపసర్పంచ్ ప్రభాకర్ రెడ్డి, వార్డు సభ్యులు లింగం, బి ఆర్ ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, బాలక్రిష్ణ, మధుసూదన్ రెడ్డి తాడెం స్వామి, మల్లేష్, లడ్డు తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ రాజకీయాలను దిగజార్చుతోంది

### నిప్పులు చెరిగిన ప్రియాంక గాంధీ

ఢిల్లీ: భారతీయ జనతా పార్టీ రాజకీయాలను నానాటికీ దిగజార్చుతోందని కాంగ్రెస్ సీనియర్ నేత ప్రియాంక గాంధీ విమర్శించారు. బీజేపీ తన ఎక్స్ హ్యాండిల్ లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఫోటోను మార్ఫింగ్ చేసి రావణుడిలా మార్చింది. దీంతో రెండు జాతీయ పార్టీల మధ్య మాటల యుద్ధం మొదలైంది. ప్రియాంక ఎక్స్ లో "ప్రధాని మోదీ, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా రాజకీయాలను దిగజార్చుతున్నారు. హింసాత్మక ఫోటోలతో గొడవలు సృష్టించాలని చూస్తున్నారు. మీరు నిజాయతీగా, విలువలతో కూడి ఉంటామని ప్రమాణం చేశారు. ఇదేనా మీ నిజాయతీ, విలువలు?" అని ప్రశ్నించారు. దీంతో కాంగ్రెస్, బీజేపీ నడుమ ఎక్స్ లో పోస్టర్ వార్ జరుగుతోంది. ప్రధాని మోదీని.. జుమ్లాబాయ్, అతిపెద్ద అబద్ధాల కోరుగా అభివర్ణిస్తూ కాంగ్రెస్ పార్టీ తొలుత ఎక్స్ లో వ్యంగ్య పోస్టర్లు పెడితే.. 24 గంటలు కూడా తిరక్కముందే రాహుల్‌ను రావణుడిగా అభివర్ణిస్తూ బీజేపీ కాంగ్రెస్ కు దీటుగా సమాధానమిచ్చింది.

# ఓటేసే ముందు.. ఆలోచించు నేస్తమా

నిజామాబాద్ : ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో నాయకుల ప్రచార హోరే కాదు, ఓటు విలువ చెప్పే ఇలాంటి చైతన్య ప్రచారమూ అదే స్థాయిలో కొనసాగుతోంది. సామాజిక కార్యకర్తలు, కాస్త సేవా, సామాజిక స్పృహ ఉన్న వారు ప్రలోభాలకు లొంగకూడదనే ప్రచారం చేస్తున్నారు. రాజ్యాంగం కల్పించిన అత్యంత విలువైన ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలి తప్పితే దుర్వినియోగం చేసుకుంటే తలెత్తే పరిణామాలపై విస్తృత ప్రచారం చేస్తున్నాయి. తాయిలాలకు ఆశపడితే ప్రగతిని మరిచిపోవాలన్న సంకేతమిస్తున్నారు.

పాలిచ్చే గేదె ధర రూ.లక్ష.. ఇంట్లో పెంచుకునే పెంపుడు కుక్క ఖరీదు రూ.20 వేలు.. మేకకు రూ.10 వేలు. కానీ ఓటరుకు రూ.500 లేదా రూ.1,000 అంటూ.. వాటికంటే అధ్వానమై.. మన ఓటు హక్కు అమ్ముకుందామా.. అంటూ ఓ మహిళ నిజాయతీగా ఓటేయాలని చెబుతున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది.

రెండు రకాలుగా ఎన్నికల వ్యయం

అభ్యర్థులు చేసే ఎన్నికల వ్యయం రెండు రకాలుగా ఉంటుంది. ఒకటి ఎన్నికల సంఘం నిర్దేశించింది. అయితే మరొకటి పోటీ ఆధారంగా అభ్యర్థులు చేసేది. ఒక సర్వేసంస్థ నిర్వహించిన అధ్యయనంలో ఒక్కో అభ్యర్థి కనీసంగా రూ.20 కోట్లకు మించి ఖర్చు చేయాల్సి ఉంటుందని తేలింది. వాస్తవానికి ఎన్నికల సంఘం ఒక్కో అభ్యర్థి రూ.40 లక్షల వరకు ఖర్చు చేయాలనే నిబంధన విధించింది. కానీ ఈ ఖర్చు నామినేషన్ల ప్రక్రియ వరకే సరిపోతుందనే వాదన ఉంది. దాదాపు నెల రోజుల కాలానికి అభ్యర్థులు కార్యకర్తలు, ప్రచార రథాల నిర్వహణ, సభలు, ర్యాలీలు, జెండాలు, ఇతరత్రా ఖర్చులతో పాటు మద్యం, విందు, ఇతర తాయిలాలు, నగదు పంపిణీ చేయడం వంటి ఖర్చులు చేస్తున్నారేది బహిరంగ రహస్యం. ఎన్నికల సంఘం ఎంత కట్టడి చేసినా ఈ ప్రలోభాలనేవి కొనసాగుతున్నాయి.

అయిదేళ్ల అధికారానికి వేసే ఓటుకు రూ.1,000 తీసుకుంటే రోజుకు రూ.0.54, అదే రూ.500 తీసుకుంటే రోజుకు రూ.0.27 చొప్పున లబ్ధి చేకూరుతుంది. కానీ అలా ఓటు అమ్ముకోవడం కారణంగా విలువైన లాభాలను కోల్పోతున్నామనే సందేశాన్ని గమనించాల్సిన అవసరముంది. ఇలాంటివన్నీ ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతూ ఓటరును చైతన్యం చేస్తున్నాయి.

ఓ వృద్ధ ఓటరు పోలింగ్ కేంద్రానికి వచ్చి ఏజెంటుకు ఒక పేరు చెప్పి ఆమె నా భార్య ఇక్కడికి వచ్చి ఓటేసి వెళ్లిందా అని అడుగుతాడు. ఇప్పటివరకు ఇక్కడే ఉండి వెళ్లిపోయారని బదులిచ్చి.. అంటే ఆమె మీతో కలిసి ఉండటం లేదా సార్? అని ఏజెంట్ ప్రశ్నిస్తాడు. కాదుబాబు.. ఆవిడ చనిపోయి 15 ఏళ్లు అవుతోంది. ఇదేం విచిత్రమో కానీ ప్రతిసారీ వచ్చి ఓటేసి వెళ్తుంది.. కొంచెం ముందొస్తే నా భార్యను కళ్లారా చూసుకునే వాడిని అని సమాధానమిస్తాడు ఆ పెద్దాయన. ఈ మాట ఆ పెద్దాయన నోటి నుంచి రాగానే పోలింగ్ సిబ్బంది అంతా కంగుతిని తలలు వంచుకుంటారు. ఈ లిఖితపూర్వక సెటైర్ సామాజిక మాధ్యమాల్లో ప్రస్తుతం చక్కర్లు కొడుతోంది.

నాయకులిచ్చే తాయిలాల విషయంలో ప్రజలు ఒకసారి ఆలోచించాలి. మన ఓటు ..రాజకీయ నాయకులకు అయిదేళ్ల వరకు అధికారాన్ని కట్టబెడుతుంది. ప్రజల తరపున చట్టసభల్లో ప్రాతినిధ్యం వహించి ప్రజల సామాజిక, ఆర్థిక, ఉపాధి, ప్రగతి అవసరాలు, పనులు చేసేందుకు కృషి చేయాలి. ఈ ప్రక్రియలో ఓటరు నిజాయతీగా వ్యవహరించకపోతే నాయకుల నుంచి మనమూ నిజాయతీ పాలనను ఆశించలేమన్న విషయాన్ని గ్రహించాలని పలువురు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

మద్యం, మాంసం, డబ్బు, బంగారం, చీరలు, సారెలు.. ఇలా మాకు ఏవీ వద్దు. ప్రగతి కావాలంటూ మరో లిఖిత సందేశం వాట్సాప్‌లో చక్కర్లు కొడుతోంది..

ఖానాపూర్ నియోజకవర్గం నుంచి ఎన్నికల బరిలో ఉన్న భాజపా, భారాస, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులు రమేష్ రాథోడ్, జాన్సన్ నాయక్, వెడ్మ బొజ్జులు నామినేషన్ సందర్భంగా అఫిడవిట్‌లను సమర్పించారు. తమ పేరిట ఉన్న ఆస్తులు, అప్పులు, కేసుల వివరాలను అందులో పొందుపర్చారు.

కారులేని రమేష్ రాథోడ్..కేసులు లేని జాన్సన్!

ఖానాపూర్ అభ్యర్థుల ఆస్తుల వివరాలివి..

రమేష్ రాథోడ్

పార్టీ : భాజపా

వయసు : 57

తనకు కారు లేదని పేర్కొన్నారు. నార్నూరు మండలం తాడిహత్నూర్‌లో 10 ఎకరాలు, ఉట్నూరు మండలం ఘన్‌పూర్‌లో 11 ఎకరాలు వ్యవసాయ భూమి ఉందని, వీటి విలువ రూ.25 లక్షలు ఉందని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్నంలో రూ.28 లక్షల విలువైన ఇంటి స్థలం, ఆదిలాబాద్ జిల్లాలోని సావర్‌గావ్‌లో రూ.15 లక్షల విలువైన ఇల్లు, ఉట్నూరులో రూ.18 లక్షల ఇల్లు ఉంది. బ్యాంకు ఖాతాలో రూ.10.27 లక్షలు జమ ఉండగా, చేతిలో రూ.2.29 లక్షలు నగదు, 16 తులాల బంగారం ఉన్నట్లు వెల్లడించారు. రూ.2,05,380 లక్షల అప్పులు ఉన్నాయి. ఖానాపూర్, కడెం, ఉట్నూరు, జన్నారం మండలాలలో నాలుగు క్రిమినల్, ఇతర కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు వివరించారు.

భూక్య జాన్సన్ నాయక్

పార్టీ : భారాస

వయసు : 47

తన పేరిట క్రిమినల్, ఇతర ఒక్క కేసు కూడా లేదని పేర్కొన్నారు. కరీంనగర్, సంగారెడ్డి, జగిత్యాల జిల్లాల్లో 31 ఎకరాల వ్యవసాయ భూమి ఉందని(వాటి విలువ రూ.1.75 కోట్లు) వెల్లడించారు. సికింద్రాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, నల్గొండ, కరీంనగర్‌లలో రూ.1.31 కోట్ల విలువైన వ్యవసాయేతర భూములున్నాయి. హైదరాబాద్ బంజారాహిల్స్, ఉప్పల్‌లలో ఇళ్లు (రూ.4.50 కోట్లు) ఉన్నాయని వివరించారు. ఫార్చునర్, జెడ్-ఎక్స్ఈవీ-ఎక్స్‌క్లూసీవ్, మహేంద్ర ఎక్స్‌యూవీ అనే మూడు వాహనాలున్నాయి. బ్యాంకు ఖాతాల్లో రూ.72 లక్షలు జమ ఉండగా, చేతిలో రూ.1.95 లక్షల నగదు, రూ.4.46 లక్షల బంగారు ఆభరణాలు ఉన్నట్లు వెల్లడించారు. రూ.56.30 లక్షల అప్పులు ఉన్నాయని పొందుపర్చారు.

వెడ్మ బొజ్జు

పార్టీ : కాంగ్రెస్

వయసు : 37 తన పేరిట ఆస్తులు లేవని, ఒక ఇన్నోవా వాహనం మాత్రమే ఉందని పేర్కొన్నారు. వ్యవసాయ భూమి, ఇల్లు లేదని వివరించారు. రూ.8.42 లక్షల అప్పులు ఉన్నాయని పేర్కొన్నారు. ఉట్నూరు, సిర్పూరు(యు), జైనూరు మండలాల పోలీస్ స్టేషన్లలో క్రిమినల్, ఇతర కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు వెల్లడించారు.

నేను నాదేశ ప్రజలకు కత్తి చేతికి ఇవ్వలేదు.. ఓటు హక్కు ఆయుధంగా ఇచ్చాను..పోరాడి రాజులవుతారో..అమ్ముకుని బానిసలవుతారో.. అదివారి చేతుల్లోనే ఉంది రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్

# అతివల క్రమశిక్షణ.. ఆర్థిక సాధికారత



పెద్దపల్లి : స్వయం సహాయక సంఘాల సభ్యుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం రుణాలు మంజూరు చేస్తోంది. వీటిని అతివలు వ్యాపారం, పిల్లల చదువు, వ్యవసాయం, ఇతర అవసరాలకు వినియోగిస్తున్నారు. సంఘాల సభ్యులతో అధికారులు తరచూ సమావేశాలు నిర్వహిస్తూ ప్రగతి బాటలో పయనించేలా ప్రోత్సహిస్తున్నారు. సంఘాలను మరింత పటిష్ఠం చేసేందుకు నెలవారీ గ్రేడింగ్ అమలు చేస్తున్నారు. సమావేశాలు, ఆర్థికాభివృద్ధి తదితర అంశాలే కొలమానంగా పాయింట్లు కేటాయిస్తున్నారు. వెనుకబడిన సంఘాలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రగతి సాధించేలా ప్రోత్సహిస్తున్నారు. గ్రేడింగ్ తర్వాత చాలా సంఘాలు మనుగడలోకి వచ్చాయి. పొదుపు క్రమశిక్షణగా మారింది.

తరచూ సమావేశాలతో సత్ఫలితాలు

జిల్లాలోని 13 గ్రామీణ మండలాల్లో 10 వేలకు పైగా స్వశక్తి సంఘాలున్నాయి. వీటిలో ఈ ఏడాదికి సంబంధించి 7,436 సంఘాలకు రూ.398.27 కోట్ల బ్యాంకు రుణాల లక్ష్యం విధించారు. నెలవారీగా లక్ష్యాలకు అనుగుణంగా సంఘాల సభ్యులు రుణాలు పొందుతున్నారు. గడిచిన మూడు నెలల్లో 10,936 సంఘాలకు సగటున 10 వేలకు పైగా గ్రేడింగ్ నిర్వహించారు. దాదాపు 75 శాతం సంఘాలు ఏ గ్రేడ్‌లో ఉండగా మిగిలిన వాటికి ఇతర గ్రేడ్‌లు కేటాయించారు. సీ, డీ కేటగిరీలోని సంఘాలపై ప్రత్యేక శ్రద్ధ సారిస్తున్నారు. తరచూ సమావేశాలు నిర్వహిస్తూ మనుగడలోకి తీసుకొస్తున్నారు. రుణాలు చెల్లించిన సభ్యుల అభిప్రాయాలు తీసుకుంటున్నారు.

ఏమిటీ గ్రేడింగ్..

స్వశక్తి సంఘంలో పది మంది సభ్యులుంటారు. ప్రతి నెలా పొదుపు, సమావేశాల నిర్వహణ తప్పనిసరిగా అమలు చేయాలి.

సంఘాల బలోపేతమే లక్ష్యంగా గ్రేడింగ్ నిర్వహిస్తూ లోపాలను సవరించుకుంటున్నారు. ప్రతి నెలా రెండు సార్లు సమావేశం నిర్వహిస్తుండగా సభ్యులందరూ తప్పకుండా హాజరు కావాల్సి ఉంటుంది.

పొదుపు నిర్వహణ, రుణ వాయిదాల చెల్లింపు, స్త్రీనిధి అప్పు చెల్లింపు, బ్యాంకుకు ఎంత చెల్లించాలనే అంశాలపై సుదీర్ఘంగా చర్చిస్తున్నారు. పిల్లల చదువులు, ఉద్యోగం, సంక్షేమ పథకాలు, సభ్యుల కుటుంబ జీవన స్థితిగతులను ప్రస్తావిస్తున్నారు.

గ్రేడింగ్ విధానం అమలులోకి రావడంతో అధికారుల పర్యవేక్షణ పెరిగింది. సమావేశాల చిత్రాలను క్షేత్ర స్థాయిలో సిబ్బంది వాట్సాప్‌లో ఉన్నతాధికారులకు పంపిస్తున్నారు.

సకాలంలో రుణాల చెల్లింపు

జిల్లాలోని అన్ని సంఘాలకు గ్రేడింగ్ అమలు చేస్తున్నాం. మహిళలతో సమావేశాలు నిర్వహిస్తూ చర్చిస్తున్నాం. అక్కడే దస్త్రాలు పరిశీలిస్తున్నాం. గ్రేడింగ్‌పై పర్యవేక్షిస్తున్నాం. గ్రేడ్‌ల కేటాయింపు తర్వాత మహిళల్లో క్రమశిక్షణ పెరిగింది. తీసుకున్న రుణాలను సభ్యులు సకాలంలో చెల్లిస్తున్నారు. తిరుపతి, సెర్ప్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్

# ప్రత్యేక బృందాలు.. పక్కాగా లెక్కలు



కొత్తగూడెం : ప్రజాస్వామ్యంలో ఎన్నికల నిర్వహణ అత్యంత కీలకమైన ప్రక్రియ. ఎన్నికల సంఘం నియమ, నిబంధనలకు అనుగుణంగా ప్రక్రియ జరిగినప్పుడే ప్రజాస్వామ్యం విజయవంతమవుతుంది. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు ఎలాగైనా గెలవాలనే లక్ష్యంతో ఓటర్లను ప్రలోభపెడితే ప్రజాస్వామ్య స్ఫూర్తి దెబ్బతింటుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని అభ్యర్థులు ఖర్చు చేసే ప్రతి రూపాయిని పక్కాగా లెక్కించడానికి ఎన్నికల సంఘం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. నిబంధనల ప్రకారం ఎమ్మెల్యే అభ్యర్థి గరిష్ఠంగా రూ.40 లక్షల వరకు ఖర్చు చేయడానికి అవకాశం ఉంటుంది. నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచి పోలింగ్ ముగిసే వరకు అభ్యర్థులు వివిధ రూపాల్లో చేసే ఖర్చును లెక్కించడానికి ఎన్నికల సంఘం వ్యయ పరిశీలన శాఖను ఏర్పాటు చేసింది. ఇందులో పనిచేసే వ్యయ పరిశీలకులను భారత ఎన్నికల సంఘమే నియమిస్తుంది. ఎన్నికల వ్యయ పరిశీలకుల ఆధ్వర్యంలో ఆయా నియోజకవర్గాల అసిస్టెంట్ వ్యయ పరిశీలకులు, వివిధ బృందాల అధికారులు పనిచేస్తారు.

ఫ్లయింగ్ స్క్వాడ్ టీం(ఎఫ్ఎస్‌టీ): ఈ బృందంలోని సభ్యులంతా ఎన్నికల నియమావళి ఉల్లంఘనలపై అందిన ఫిర్యాదులు, సమాచారాన్ని పరిశీలిస్తుంటారు. మద్యం, నగదు, వస్తువులతో ఓటర్లను ప్రలోభాలకు గురి చేయడంపై ఆరా తీస్తుంటారు. అభ్యర్థులు ప్రచార సమయంలో చేస్తున్న ఖర్చులు, ఇతరత్రా వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేస్తుంటారు. ర్యాలీలు, బహిరంగ సభ సమయాల్లో వీడియోలు తీస్తుంటారు.

స్టాటిస్టికల్ సర్వైలెన్స్ టీం(ఎస్ఎస్‌టీ)

ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన తనిఖీ కేంద్రాల్లో ఈ బృందంలోని సభ్యులు విధులు నిర్వర్తిస్తుంటారు. వాహన తనిఖీల సమయంలో ప్రతి అంశాన్ని వీడియో ద్వారా రికార్డు చేస్తుంటారు. నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తూ పట్టుబడ్డ నగదు, మద్యం, ఇతరత్రా వస్తువుల సమాచారాన్ని రిటర్నింగ్ అధికారికి తెలియజేస్తారు. రూ.50వేల కన్నా ఎక్కువ నగదు, రూ.10వేలకు పైగా ఎన్నికల సామగ్రి వాహనాల్లో లభ్యమైతే జప్తు చేస్తారు.

వీడియో సర్వైలెన్స్ టీం (వీఎస్‌టీ)

స్టాటిస్టికల్ సర్వైలెన్స్ బృందంలోని సభ్యుల మాదిరిగానే వీఎస్‌టీ సభ్యులు కూడా సభలు, సమావేశాలను చిత్రీకరిస్తారు. ఏ పార్టీ ఎప్పుడు, ఎక్కడ నిర్వహించిందనే అంశాలతో పాటు సమావేశాలు, ప్రచారానికి ఏర్పాటు చేసిన పోస్టర్లు, కటౌట్లు, బ్యానర్లు, నగదు, ఓటర్ల తరలింపునకు ఉపయోగించిన వాహనాలు, డ్రైవర్లు, ప్యాసింజర్లు, పార్కింగ్ చేసిన వాహనాలు, ఏర్పాటు చేసిన లైట్లు, కుర్చీలు, లౌడ్‌స్పీకర్లు ఇలా ప్రతి అంశాన్ని వీడియో తీస్తారు. ఎన్నికల వ్యయ సమయంలో వీటిని ఆధారంగా చూపించడానికి ఉపయోగిస్తారు.

వీడియో వ్యూయింగ్ టీం (వీవీటీ)

సర్వైలెన్స్ బృందాలు అందించిన వీడియో సీడీలను ఈ బృందం సభ్యులు తనిఖీ చేస్తారు. ఎన్నికల నియమావళి అమలు, ఉల్లంఘన, ప్రతిరోజూ చేపట్టే ప్రచారాలు, వ్యయాలు, అకౌంటింగ్ టీం ఖర్చుల వివరాలు, వ్యయాలు, అకౌంటింగ్ టీం అందించిన ఖర్చుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలిస్తారు.

అభ్యర్థుల ఖర్చులకు సంబంధించిన అన్ని వివరాలను అకౌంటింగ్ బృందాలు నమోదు చేస్తుంటాయి. ఈ బృందాలన్నీ వ్యయ పరిశీలకుల ఆధ్వర్యంలో పనిచేస్తాయి.

# 60 ఏండ్లలో ఎన్ని పార్టీలు వచ్చినా అభివృద్ధిలో వెనుకబాటు..

**బీఆర్ఎస్ హయాంలో పదేండ్లలోనే మాడల్ టౌన్‌గా మారిన సూర్యాపేట**

సూర్యాపేట : తాగునీటికి కటకట. అందనంత దూరంలో సర్కారు విద్యా, వైద్యం. మౌలిక వసతులు హీనం. ఇది 2014కు ముందు సూర్యాపేట నియోజకవర్గ పరిస్థితి. వరుసగా మూడుసార్లు గెలిచి సూర్యాపేటను ఆగం పట్టిచ్చింది కాంగ్రెస్ పార్టీ. 2009లో కాంగ్రెస్ సీనియర్ నేత రాంరెడ్డి దామోదర్‌రెడ్డి విజయం సాధించారు. ఐదేండ్ల పాటు ఎమ్మెల్యేగా ఉన్నా ఆయన సూర్యాపేట అభివృద్ధిని పట్టించుకున్న పాపాన పోలేదు. 2014లో కేసీఆర్ ప్రభుత్వం రావడం, గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలవడం, మంత్రిగా అవకాశం రావడంతో ఈ నియోజకవర్గానికి మంచి రోజులు వచ్చాయి. సూర్యాపేట జిల్లా కేంద్రం అయ్యింది. ఇంటిగ్రేటెడ్ కలెక్టర్, జిల్లా పోలీస్ కార్యాలయం, మెడికల్ కాలేజీ, ఐటీ హబ్‌లు చకచకా నిర్మించారు. సాగు, తాగునీటి కోసం అనేక నిధులు కేటాయించారు. ప్రజా సమస్యలన్నీ తీర్చారు. ఈ పదేండ్ల కాలంలో రూపురేఖలు మారాయి.సూర్యాపేట నియోజకవర్గ ప్రజలు అన్ని పార్టీలనూ ఆదరించారు. మొదట కమ్యూనిస్టులకు, ఆ తర్వాత టీడీపీ, కాంగ్రెస్ పార్టీలకు పట్టం కట్టారు. అన్ని పార్టీలకు సూర్యాపేటలో స్థానం దక్కింది కానీ ఇక్కడి అభివృద్ధికి మాత్రం ఏ పార్టీ అజెండాలోనూ చోటు దక్కలేదు. ఆ పార్టీల ఎమ్మెల్యేలు అరవై ఏండ్లు పాలించి అభివృద్ధిని దూరం చేశారు. ఈ నియోజకవర్గాన్ని ఆగం పట్టిచ్చిన ఘనత ప్రధానంగా కాంగ్రెస్ పార్టీది. అధికారంలో ఉండి కూడా అభివృద్ధి చేయలేని అసమర్థత దామోదర్‌రెడ్డిది. కాంగ్రెస్‌ను నమ్మి విసిగిపోయిన సూర్యాపేట ప్రజలు 2014లో మొదటిసారి బీఆర్ఎస్ అభ్యర్థి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డిని గెలిపించారు. ఈ గెలుపు అభివృద్ధికి మలుపయ్యింది. మంత్రిగా అవకాశం రావడం మరింత తోడ్పాటు అయ్యింది. పదేండ్లలోనే అబ్బురపడే రీతిలో సాధించిన ప్రగతికి సాక్షిగా సూర్యాపేట నిలుస్తున్నది.సూర్యాపేట మాడల్ టౌన్ జగదీశ్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి అయ్యాక సూర్యాపేటకు భారీగా నిధులు తీసుకొచ్చారు. పదేండ్ల కాలంలోనే నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలకు రూ.7,500 కోట్లు ఖర్చు చేయించారంటే అభివృద్ధి ఎంతగా జరిగిందో అర్థం చేసుకోవచ్చు. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సూర్యాపేట సమస్యలపై ఉన్న అవగాహనతో అదనంగా నిధులు కేటాయించారు. కేసీఆర్‌తో జగదీశ్‌రెడ్డికి ఉన్న సాన్నిహిత్యం కూడా ఇందుకు ఉపయోగపడింది. ప్రభుత్వం సూర్యాపేట కేంద్రంగా కొత్త జిల్లాను ఏర్పాటు చేసింది. దీంతో ఇక్కడి ప్రజలకు పాలన మరింత చేరువైంది. తొలి దఫాలోనే సూర్యాపేటలో కేసీఆర్ ప్రభుత్వం మెడికల్ కాలేజీని నిర్మించింది. మంత్రి జగదీశ్‌రెడ్డి కృషితో సూర్యాపేట పట్టణం మాడల్ టౌన్‌గా అభివృద్ధి చెందింది. గ్రామీణ ప్రాంతాల్లో కూడా అనేక అభివృద్ధి పనులు జరిగాయి.కేసీఆర్ హయాంలో ముఖ్యమైన అభివృద్ధి పనులుసూర్యాపేటలో ఇంటిగ్రేటెడ్ కలెక్టర్ కార్యాలయం, జిల్లా పోలీస్ కార్యాలయం, మెడికల్ కాలేజీ, ఐటీ హబ్ నిర్మాణం.

ఉదయ సముద్రం నుంచి మూసీ వరకు కాల్వ తవ్వించి కృష్ణా నీటిని తేవడంతో తాగునీటి సమస్యకు పరిష్కారం.

మూసీ ప్రాజెక్టు ఆధునీకరణ, 23 చెక్ డ్యాంల నిర్మాణం, 1,120 చెరువుల్లో మిషన్ కాకతీయ పనులు, లిఫ్ట్‌ల మరమ్మతులతో తీరిన సాగునీటి కొరత.

సూర్యాపేట పట్టణంలో రెండు మినీ ట్యాంక్‌బండ్‌ల అభివృద్ధి, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, 52 పార్కులు, ఓపెన్ జిమ్‌లు, సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మాణం.

పట్టణంలో రోడ్ల విస్తరణ, జంక్షన్ల అభివృద్ధి, సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు.

స్టేడియం, కళాభారతి నిర్మాణం.నర్సింగ్ కళాశాల, 600 పడకల దవాఖాన, మాతా శిశు కేంద్రం నిర్మాణం, ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటు.గ్రామాల నుంచి మండల కేంద్రాలు, మండల కేంద్రాల నుంచి జిల్లా కేంద్రాలకు రహదారుల నిర్మాణం.

మహాప్రస్థానం, అద్దె ఇంట్లో ఎవరైనా చనిపోతే కార్యక్రమాలు పూర్తయ్యే వరకు వారి కుటుంబం ఉండేందుకు వసతి భవన నిర్మాణం.

# కుల గణనకు మైనార్టీలకు లింకేంది?

హైదరాబాద్ : తొండ ముదిరి ఊసరవెల్లి అయినట్టుగా ఉన్నది కాంగ్రెస్ పార్టీ తీరు. తన చరిత్రను మొత్తం కులాల కుంపట్లు, మత ఘర్షణలు, అల్లర్లతో నింపేసుకొన్న ఆ పార్టీ, ఇప్పుడు మరో అడుగు ముం దుకేసి ఏకంగా బీసీ కులాలు, మైనార్టీల మధ్య తగువులు పెట్టేలా మైనార్టీ డిక్లరేషన్‌ను ప్రకటించింది. కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్‌పై ఇటు బీసీ వర్గాలు .. ఇటు మైనార్టీలు అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు. దేశాన్ని ఆరు దశాబ్దాలు పరిపాలించిన కాంగ్రెస్ విడుదల చేసిన మైనార్టీ డిక్లరేషన్‌తో ఇటు కులాలు, అటు మతాల మధ్య అంతరాలు సృష్టించే ప్రణాళిక రచించిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాము ప్రభుత్వం ఏర్పాటు చేసిన వెంటనే బీసీ, మైనార్టీల కుల గణన చేయిస్తామని హామీ ఇచ్చింది.

రెంటికీ లింకేంటి?బీసీ కుల గణన అనేది ఎప్పటి నుంచో ఉన్న డిమాండ్. దీనిపై బీఆర్ఎస్ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపింది. అయితే కాంగ్రెస్ ఇప్పుడు బీసీ కుల, మైనార్టీల గణనకు లింకు పెట్టి డిక్లరేషన్‌ను ప్రకటించింది. బీసీ కులాలకు, మైనార్టీలకు రిజర్వేషన్లు, ఇతరత్రా విషయాల్లోనూ అన్యాయం జరుగుతున్నదనేది నిజం. ఇరు వర్గాలకు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉన్నది. కానీ ఈ రెంటినీ కలపడం వెనుక మాత్రం అసంబద్ధ, అనంగీకార ఆలోచనలు ఉన్నట్టుగా కనపడుతున్నదని మేధావులు పేర్కొంటున్నారు. బీసీలకు న్యాయం జరగాలంటే బీసీ జన గణన నిర్వహించాలి. అదే సమయంలో మైనార్టీలకు సమానావకాశాలు కల్పించడం కోసం కూడా ఇలాంటి కసరత్తే జరగాలి. కానీ ఈ రెంటినీ కలిపి చేయడం కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టినట్టే అని ఆయా వర్గాలు అంటున్నాయి.

ప్రయోజనాలు మంటగలపడమే..

బీసీ కులాలకు, మైనార్టీ మతాల మధ్య లింక్ పెట్టి జరుపుతామంటున్న కుల, మత గణన ఎలా చెల్లుబాటు అవుతుందని మేధావులు ప్రశ్నిస్తున్నారు. మ తం ఆధారంగా మైనార్టీలను బీసీ కులా ల్లో కలపడం ఎలా సాధ్యమవుతుంది? కాంగ్రెస్ మైనార్టీ డిక్లరేషన్‌లో పేర్కొన్నట్టుగా చేస్తే ఇటు బీసీల ప్రయోజనం.. అటు మైనార్టీల ప్రయోజనాలు దెబ్బకొట్టినట్టే అవుతుందని ఆయా వర్గాల ప్రముఖులు చెప్తున్నారు. దీనివల్ల ముస్లింలు, క్రిస్టియన్లు, సిక్కు తదితర మతస్థులంతా



మైనార్టీలుగా రాజ్యాంగ హక్కులు అనుభవిస్తున్న మైనార్టీ క్యాటగిరీని కోల్పోతారని సామాజిక వేత్తలు అంటున్నారు. నిజానికి బీసీ కుల గణన చేపట్టి వారికి రిజర్వేషన్ల శాతాన్ని పెంచాల్సిన అవసరం ఉన్నదనే అభిప్రాయాలున్నాయి. అది చేయకుండా.. బీసీ కులగణనతో కలిపి మైనార్టీల గణనచేయడంతో బీసీల్లో అభద్రతా భావం మొదలవుతుంది. తమకు ఇప్పటికే ఉన్న బీసీ రిజర్వేషన్లకు కాంగ్రెస్ మంగళం పాడేలా కొత్త ఎత్తువేసినట్టుగా ఇప్పటికే అనుమానాలు మొదలయ్యా యి. బీసీ రిజర్వేషన్ల కోటా పెంచకుండా మైనార్టీలను దాంట్లో చేర్చితే, బీసీ వర్గాలకు అన్యాయం జరుగుతుంది. పోనీ మైనార్టీలను లెక్కిద్దామంటే.. వారు కూడా హక్కులను కోల్పోతారు. ఈ సమస్యకు పరిష్కారం బీసీ కోటా పెంచడమే. కానీ ఆ అంశం సుప్రీం కోర్టులో ఉన్నది. రాజ్యాంగ సవరణ తప్ప మార్గం లేదు. ఇంత తతంగం ఉన్నప్పుడు కాంగ్రెస్ కావాలనే బీసీ కులగణనతో పాటు.. మై నార్టీలను కలుపుతామంటూ ఎలా చెప్తుందని మేధావులు ప్రశ్నిస్తున్నారు.

రాజకీయ లబ్ధి కోసమే..

కాంగ్రెస్ చరిత్రలో ఇలాంటి సంఘటనలే కనపడుతాయి. వైఎస్ హయాంలో 4% మైనార్టీ రిజర్వేషన్ అని చెప్పి రాజకీయ పబ్బం గడుపుకున్నారు. ఆ తర్వాత మైనార్టీ రిజర్వేషన్లను ఎత్తేశారు. ఇప్పుడు కూడా కాంగ్రెస్ చేసిన మైనార్టీ డిక్లరేషన్‌లో చెప్పినట్టుగా బీసీ కులగణనతో పాటు మైనార్టీల గణన కూడా ఇలాంటిదే అని మేధావులు అంటున్నారు. సాధ్యంకాని అంశాన్ని చెప్తూ.. ఇటు బీసీ వర్గాల ను, అటు మైనార్టీ వర్గాలను అయోమయానికి గురిచేస్తూ.. రాజకీయ పబ్బం గ డుపుకోవాలనే దుర్బుద్ధితోనే కాంగ్రెస్ డిక్లరేషన్ తెచ్చిందనే మండిపడుతున్నారు.

# తెలంగాణకు నష్టం లేకుంటేనే నదుల అనుసంధానం

హైదరాబాద్ : గోదావరి జలాల్లో తెలంగాణకు ఉన్న 968 టీఎంసీల వాటాకు రక్షణ కల్పించాకే నదుల అనుసంధాన ప్రాజెక్టుపై ముందుకుసాగాలని తెలంగాణ సర్కారు తేల్చిచెప్పింది. తెలంగాణ సమర్పించిన అన్ని డీపీఆర్‌లకు వెంటనే ఆమోదం తెలపాలని పట్టుబట్టింది. గోదావరి-కావేరి నదుల అనుసంధానం ప్రాజెక్టుపై 5వ కన్సల్టెన్సీ సమావేశం శుక్రవారం జలసౌధలో కొనసాగింది. ఎన్‌డీడబ్ల్యూడీఏ టాస్క్‌ఫోర్స్ కమిటీ చైర్మన్ వెదిరె శ్రీరామ్ నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో లింక్ ప్రాజెక్ట్ అమలుకు రూపొందించిన ముసాయిదా ఎంవోఏపై రాష్ట్రాలతో చర్చించారు. ఈ సందర్భంగా తెలంగాణ సర్కారు వాదన వినిపిస్తూ.. రాష్ట్ర వాటాకు రక్షణ కల్పించడంతోపాటు అన్ని అవసరాలను నెరవేర్చాకే గోదావరి జలాల మళ్లింపునకు అంగీకరిస్తామని తేల్చిచెప్పింది.

నదుల అనుసంధాన ప్రాజెక్టుపై ఎన్‌డబ్ల్యూడీఏ చేప ట్టే అధ్యయనంలో తెలంగాణకు భాగస్వా మ్యం కల్పించాలని స్పష్టం చేసింది. గోదావరి నుంచి కావేరికి మళ్లించనున్న 166 టీఎంసీల నీటిలో తెలంగాణకు 45 టీఎంసీలను మాత్ర మే కేటాయించడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. గోదావరి నుంచి కృష్ణా బేసిన్‌కు నీటి మళ్లింపు వ్యవహారం ట్రిబ్యునల్-1 నిబంధనలకు లోబడి ఉంటుందని గుర్తుచేసింది. కృష్ణా బేసిన్‌లో ముఖ్యంగా తెలంగాణ పరిధిలో సాగు, తాగునీటి వసతులను కల్పించాల్సిన కరువు పీడిత, వెనుకబడిన ప్రాంతాలు చాలా ఉన్నాయని, 50 శాతం వాటా ఇవ్వాల్సిందేనని పట్టుబట్టింది. అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నందున ఎంవోఏపై చర్చించడం సముచితం కాదని, ఆ సమస్యలన్నీ తేలేవరకూ నదుల అనుసంధానానికి అంగీకరించబోమని తెలంగాణ తేల్చిచెప్పింది.

నిరుపయోగ జలాలనే మళ్లిస్తాం: శ్రీరామ్

ఇంటర్ రివర్ లింకింగ్ టాస్క్‌ఫోర్స్ కమిటీ చైర్మన్ వెదిరె శ్రీరామ్ మాట్లాడుతూ.. గోదావరిలో నిరుపయోగ జలాలను మాత్రమే కావేరికి మళ్లిస్తామని తెలిపారు. ఈ విషయంలో రాష్ట్రాలు ఎలాంటి అపోహాలకు పోవద్దని, జల వాటాలకూ ఇబ్బంది ఉండబోదని చెప్పారు.

# ఓఆర్ఆర్ చెంత అచ్చెరువొందేలా

హైదరాబాద్: ఓఆర్ఆర్ చెంతన అందమైన ఎకో పార్కు రూపుదిద్దుకుంటోంది. హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ) కమిషనర్ అర్వింద్‌కుమార్ ఎకో పార్కు తాజా చిత్రాలను ఎక్స్ ఖాతాలో శుక్రవారం పంచుకున్నారు. నగరవాసులకు ఆహ్లాదం పంచేందుకు హెచ్ఎండీఏ 85 ఎకరాల్లో దీనిని తీర్చిదిద్దుతున్న విషయం తెలిసిందే. గచ్చిబౌలి-శంషాబాద్ మార్గంలో హిమయత్‌సాగర్ జలాశయం పక్కనే ఉన్న స్థలంలో ఈ పార్కును ఏర్పాటు చేస్తున్నారు. ఓఆర్ఆర్‌కు ఒకవైపు 60 ఎకరాలు.. రెండోవైపు 25 ఎకరాల స్థలంలో దీన్ని అభివృద్ధి చేస్తున్నారు. ఇందులో భాగంగా రిసార్ట్, ఫుడ్‌కోర్టు, అడ్వెంచర్ జోన్‌లను ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భారీ అండర్‌గ్రౌండ్ అక్వేరియం, రకారకాల పక్షులు నివాసం ఉండేలా



ఏవియరీని అందుబాటులోకి తేనున్నారు. దాదాపు రూ.150 కోట్లు వరకు పీపీపీ భాగస్వామ్యంలో ఖర్చు చేస్తున్నారు. వచ్చే ఏడాది ఈ పార్కు పూర్తి స్థాయిలో అందుబాటులోకి రానుంది.

ఇవీ ప్రత్యేకతలు...: ల్యాండ్‌స్కేపింగ్

దేశంలోనే పెద్దదైన ఏవియరీ

వ్యూ పాయింట్స్: 2.5 కిలోమీటర్లతో కూడిన వాక్ ప్రాంతం

అడ్వెంచర్ జోన్ : ఆక్వా మెరైన్ పార్కు

ఓఆర్ఆర్ పై నుంచి ఒక వైపు నుంచి మరోవైపునకు రాకపోకలు సాగించేలా సస్పెన్షన్ వంతెన

ఇన్ఫినిటీపూల్

ఫుడ్‌కోర్టులు, రెస్టారెంట్లు

# సర్వే చేయించారు.. చెల్లింపులు మరిచారు

నిజామాబాద్ : విద్యా శాఖలోని ఓ అధికారి తీరుతో సర్వే పరీక్ష నిర్వహణ డబ్బులు వారం దాటినా చేతికి అందని పరిస్థితి నెలకొంది. ఈ నెల 3న జాతీయ సాధన సర్వే(న్యాస్)ను నిర్వహించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల అధ్యయనానికి జిల్లా వ్యాప్తంగా 547 మంది ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లతో సర్వే చేయించారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలల్లోని మూడు, ఆరు, తొమ్మిదో తరగతి విద్యార్థుల సామర్థ్యాలను నిర్ణీత ఫ్రొఫార్మాలో వివరాలను నమోదు చేశారు. ఇందుకోసం జిల్లా కేంద్రంలోని డైట్ ఛాత్రోపాధ్యాయులతో పాటు జైనథ్, నార్నూర్, గుడిహత్నూర్, బోథ్, బజార్‌హత్నూర్ మోడల్‌స్కూల్ విద్యార్థులు, ఉట్నూరు పూలాజీబాబా డీఎడ్ ఛాత్రోపాధ్యాయులు ఫీల్డు ఇన్వెస్టిగేటర్లుగా విధులు నిర్వహించారు. సొంత ఖర్చులతో వారు కేటాయించిన పాఠశాలలకు వెళ్లి సర్వేను పూర్తి చేశారు. ఒక్కొక్కరికి టీఏ కింద రూ.400, పరీక్ష నిర్వహణ కింద రూ.300 చెల్లించాల్సి ఉంది. జిల్లాకు రూ.4,66,400 నిధులు వచ్చి వారం దాటినా చెల్లించకపోవడం విమర్శలకు తావిస్తోంది. సర్వే నిర్వహణకు మొత్తం రూ.10 లక్షలు రావాల్సి ఉండగా.. సగం నిధులే వచ్చినట్లుగా అధికార వర్గాలు చెబుతున్నాయి. సర్వే పత్రాల ప్రింటింగ్ కోసం రూ.2.17 లక్షలు వెచ్చించాల్సి ఉన్నా.. అందులో సగం మేర పక్కదారి పట్టించే యత్నం చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇన్వెస్టిగేటర్ల నిధులూ మండల నోడల్ అధికారుల ఖాతాల్లో జమ చేస్తామంటూ పరీక్ష నిర్వహించిన విద్యార్థులకు చెల్లించాల్సిన డబ్బుల్లోనూ చేతివాటం ప్రదర్శించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. అందుకే పరీక్ష జరిగి వారం దాటినా డబ్బులు



చెల్లించకపోగా.. వరుసగా మూడు రోజులు సెలవులు రావడంతో ఇప్పుడే చెల్లింపులు జరిగే పరిస్థితి లేదని స్పష్టమవుతోంది. ఈ వ్యవహారంలో ఓ అధికారి కీలక భూమిక పోషిస్తున్నారని, ఇందుకు జిల్లా అధికారులు వంతపాడుతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. సదరు అధికారి పదవి కాలం ముగిసినా ఆయా కార్యక్రమాల నిర్వహణ బాధ్యతలు అప్పగించడం కూడా ఆయా నిధులు పక్కదారి పట్టించేందుకేనని విద్యాశాఖ వర్గాల్లో చర్చ జోరందుకుంది. గతంలో టీచర్ల శిక్షణలకు సంబంధించి ఎంఈవోలకు చెల్లించాల్సిన నిధులను కార్యాలయ ఉద్యోగి ఖాతాలోకి మళ్లించి ఏడాది తర్వాత వాటిని చెల్లించడంలోనూ సదరు అధికారి తీరుపై విమర్శలు వ్యక్తమయ్యాయి. న్యాస్ సర్వే బాధ్యతలు చూసిన అధికారిని చెల్లింపుల విషయమై వివరణ కోరగా... బ్యాంకు ఖాతాల వివరాల సేకరణ జాప్యం వల్లనే చెల్లింపులు చేయలేకపోయినట్లు తెలిపారు. త్వరలో ఫీల్డు ఇన్వెస్టిగేటర్లకు టీఏ, డీఏ చెల్లిస్తామని పేర్కొన్నారు. నిధుల పక్కదారి పట్టిస్తున్నారనే ప్రచారాన్ని కొట్టిపారేశారు.

# 'డొంక' తిరుగుడు మాటలొద్దు

కొత్తగూడెం : మూడు గ్రామాలకు చెందిన రైతులు నిత్యం రాకపోకలు కొనసాగించే మంగళగిరి డొంక రహదారి గురించి దశాబ్దాలుగా విన్నవిస్తున్నా ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదని, ఈసారైనా బాగుచేస్తామని దీనిపై హామీ పత్రం ఇచ్చిన వారికే ఓటు వేస్తామంటూ జూలూరుపాడు మండలం అన్నారుపాడు గ్రామానికి చెందిన రైతులు పేర్కొన్నారు. తమ సమస్యను వివరిస్తూ గ్రామానికి ఓటు అడిగేందుకు వచ్చే నాయకులకు కనువిప్పు కలిగించేలా, చిత్రాలతో కూడిన బ్యానర్‌ను గ్రామం కూడలిలో ఏర్పాటు చేశారు. ఎంతో మంది ఎమ్మెల్యేలు, ఎంపీలు మారుతున్నా సమస్యను పట్టించుకోలేదని, తాము వర్షాకాలం పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీ కావని, చేతికొచ్చిన పంటను ఇంటికి చేర్చుకోవాలన్నా, మార్కెట్‌కు తరలించాలంటే నరకయాతన పడాల్సి వస్తోందంటూ తమ వేదనను బ్యానర్‌పై రాసి పెట్టారు. అన్నారుపాడు, బచ్చలకోయగూడెం, పాపకొల్లు రైతులకు ఈ డొంక రహదారిని బాగు చేస్తే కష్టాలు తొలుగుతాయని, ఈసారి తమ ఓటు దీన్ని పరిష్కరించే వారికేనంటూవెళ్తున్న వారు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

# ఖర్చు ఎక్కువ కావద్దు

హైదరాబాద్ : అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థి ఖర్చు రూ.40 లక్షలకు మించొద్దనేది భారత ఎన్నికల సంఘం నిబంధన. ఆ పరిమితికి కట్టుబడి ఖర్చు చేయడం అభ్యర్థులకు తలనొప్పిగా మారింది. వ్యయ పరిశీలకులు నియోజకవర్గాల్లో జరిగే ప్రతి రాజకీయ కార్యక్రమాన్ని దగ్గరుండి పరిశీలిస్తుండటంతో తమ లెక్క ఎక్కడ పెరిగిపోతుందోనని ఆందోళనకు గురవుతున్నారు. ర్యాలీలు, సమావేశాలు, వాహనాల వినియోగం, సభలు నిర్వహించడంపై ఆచితూచి వ్యవహరిస్తున్నారు. తక్కువ చేసి చూపుతుంటారు..ప్రచారంలో నేతలు ఎన్ని వాహనాలు ఉపయోగిస్తున్నారు, వెంట ఎంతమంది అనుచరులున్నారు, వారు పంపిణీ చేసే కరపత్రాలు, స్టిక్కర్లు, కండువాలు, ఇతరత్రా వస్తువులను వ్యయ పరిశీలకులు అంచనాగా లెక్కిస్తుంటారు. నేతలు, వారి కాన్వాయ్‌లోని వాహనాల సంఖ్య, అవి ఎలాంటి వాహనాలనే వివరాలను నమోదు చేసుకుని.. వాటిని ఎన్నికల సంఘం నిర్దేశించిన రోజువారీ అద్దె మొత్తాన్ని అభ్యర్థుల ఎన్నికల ఖర్చులో జమ చేస్తారు. ఫంక్షన్‌హాళ్లలో సమావేశం నిర్వహిస్తే దాని అద్దెతోపాటు అక్కడికి వచ్చేవారు, వారికి వడ్డించిన భోజనాలు, టీ, కాఫీలు, నీళ్లు, బిర్యానీలు, ఇతరత్రా ఆహార పదార్థాలను వేర్వేరుగా అయ్యే ఖర్చు కూడా పద్దులో చేరుతుంది. ఈ నేపథ్యంలో వ్యయ పరిశీలకుల కళ్లుగప్పి ప్రచారం చేసేందుకు పలువురు అభ్యర్థులు ప్రయత్నిస్తుంటారు. అభ్యర్థులు కూడా రోజువారీ ఖర్చు వివరాలను ఎన్నికల సంఘానికి అందించాలి. చాలామంది వ్యయాన్ని తగ్గించి చూపుతుంటారు.

అనుమతి తప్పనిసరి

నామినేషన్ దాఖలైన రోజు నుంచి అభ్యర్థి ఖర్చును ఎన్నికల సంఘం లెక్కిస్తుంది. అప్పటివరకు వారి తరపున జరిగే ప్రచార ఖర్చు పార్టీ ఖాతాలో చేరుతుంది. అందువల్ల కొందరు అభ్యర్థులు చివరి రెండు, మూడు రోజుల్లో దాఖలు చేస్తుంటారు.

ర్యాలీలు, సమావేశాలు, ఇంటింటి ప్రచారం, కరపత్రాల పంపిణీ, హోర్డింగులు, బ్యానర్ల ఏర్పాటు, వాహనాల్లో ప్రచారం, కార్యకర్తలతో సమావేశాలు, ఇతరత్రాలకు ముందస్తు అనుమతి తప్పనిసరి. జిల్లా ఎన్నికల అధికారుల ఆధ్వర్యంలో ఏర్పాటైన సువిధ కేంద్రాల్లో తీసుకోవాలి. అనుమతుల జారీ ఆలస్యమవుతోంది. 48గంటల్లో ఇస్తామని అధికారులు చెబుతుండగా అంతకు మించి సమయం పడుతోందని నేతలంటున్నారు.ప్రచారవేళ వాహనాలు మరమ్మతులకు గురైతే వాటిని ఆపేస్తున్నాం. ఆ విషయం వ్యయ పరిశీలకులకు చెప్పినా వారు అంగీకరించట్లేదు. నిలిచిన వాహనాలకూ రోజువారీ అద్దె లెక్కిస్తున్నారని, అవి అభ్యర్థి ఖర్చును రెట్టింపు చేస్తున్నాయంటున్నారు.

# రాయబేరం.. తాయిలాల గాలం



తాండూరు : ప్రచారానికి కేవలం 17 రోజులు, ఓటింగ్‌కు 20 రోజుల గడువు మాత్రమే గడువుంది. అంటే సమయం చాలా తక్కువ. దీంతో ఓటర్ల మనసు గెలుచుకోవడానికి, తమ విజయావకాశాలను మెరుగుపర్చుకోవడానికి అభ్యర్థులు ఎవరికి వారే విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. వ్యూహాలు పన్నుతున్నారు.

ఏ చిన్న అవకాశం వచ్చినా..

జిల్లాలో వికారాబాద్, పరిగి, తాండూరు, కొడంగల్ నియోజక వర్గాలున్నాయి. మొత్తం 9.34 లక్షల ఓటర్లున్నారు. అందరినీ ప్రసన్నం చేసుకోవడానికి అభ్యర్థులు పెళ్లి, పండుగ, శుభ కార్యక్రమం ఇలా అందివచ్చిన ఏ చిన్న అవకాశాన్ని కూడా వదలడంలేదు. పగలంతా మంది మార్బలంతో గ్రామాల్లో అన్ని వర్గాలను కలుసుకుంటూ ప్రచారం చేస్తున్నారు. రాత్రి సమయంలో బలమైన నాయకులు, గ్రామ పెద్దలను కలుస్తూ మద్దతు కూడగడుతున్నారు.

2018 ఎన్నికల లెక్కలు తీస్తూ..

గత 2018 ఎన్నికల్లో ఏ పార్టీకి ఎన్ని ఓట్లు వచ్చాయన్న వివరాల ఆధారంగా ప్రస్తుతం ఎన్ని ఓట్లు పడతాయనేది ఎవరికి వారే లెక్కలు వేసుకుంటున్నారు. ఫలానా మండలంలో ఆధిక్యత తమదంటే తమదని ప్రచారం చేసుకుంటున్నారు.

వికారాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్, తెరాస అభ్యర్థులకు దీటుగా భాజపా అభ్యర్థి నవీన్‌కుమార్, బీఎస్పీ అభ్యర్థి క్రాంతికుమార్‌లు సైతం పోటీ ఇస్తుండటంతో కార్యకర్తలను చేజారిపోకుండా కాపాడుకోవడానికి ప్రధాన పార్టీల నాయకులు వ్యూహ రచన చేస్తున్నారు.

పరిగిలో భారాస, కాంగ్రెస్ అభ్యర్థులు నువ్వా నేనా అన్నట్లుగా ప్రచారం చేస్తూ ఓట్లు కొల్లగొట్టాలని చూస్తున్నారు.

ఈసారి కొడంగల్‌పైనే అందరి దృష్టి ఉంది. ఈ నేపథ్యంలో మంత్రి మహేందర్‌రెడ్డి స్వయంగా పావులు కదుపుతున్నారు.

తాండూరు నియోజకవర్గంలో ప్రధాన పార్టీల మధ్య పోటాపోటీ నెలకొంటోంది. గంపగుత్తగా ఓట్లను పొందేందుకు సంఘాలకు గాలం వేస్తున్నారు. వాటి ద్వారా ఏకంగా పదులు, వందల సంఖ్య ఓట్లను కొల్లగొట్టేందుకు రాయబేరాలు సాగిస్తున్నారు. పట్టణంతోపాటు శివారుల్లోని వేడుక వేదికల్లో ప్రధాన పార్టీల నేతలు సంఘాల ప్రతినిధులతో ప్రత్యేకంగా భేటీ అవుతున్నారు. డిమాండ్లు ఆరా తీసి నెరవేర్చేందుకు హామీ ఇస్తూ ఓట్లను అభ్యర్థిస్తున్నారు. యువజన సంఘాలు, పెయింటర్లు, మెకానిక్‌లు, ప్రైవేటు ఉపాధ్యాయులు, కుల సంఘాల భేటీకి నేతలు ప్రాధాన్యం ఇస్తున్నారు. రెండు వారాలుగా వేడుక వేదికలు రాత్రి 7 నుంచి 11 గంటల వరకు సందడిగా మారుతున్నాయి. ప్రధాన పార్టీల నేతలు ఐదారు వేడుక వేదికల్ని ఎన్నికలు ముగిసే వరకు అద్దెకు తీసుకున్నారు.

అర్ధరాత్రి దాటాకే మంతనాలు

జనబలం ఉండి ఓటర్లను ప్రభావితం చేసే నాయకులతో అర్ధరాత్రి దాటేదాకా మంతనాలు జరుపుతూ తమ వైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు. బలహీనంగా ఉన్న గ్రామాల్లో చోటామోటా నాయకులను, కుల సంఘాల ప్రతినిధులను మచ్చిక చేసుకోవడానికి ఖర్చుతో కూడుకున్న వారి కోరికలను తీర్చడానికి సిద్ధమవుతున్నారు.

గ్రామాల్లో మంచి పలుకుబడి ఉన్న ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు చివరి క్షణంలో పార్టీ ఫిరాయించకుండా చూసుకోవడానికి అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు.

తీజుంఆట పరికరాలు.. విరాళాలు

ప్రచారంలో ప్రధాన పార్టీలు ఎత్తుకు పైఎత్తులు వేస్తూ ముందుకెళు న్నాయి. ఓ దఫా గ్రామాల్లో ప్రచారం పూర్తి చేసుకున్న నేతలు ఓటర్ల మనసు గెలిచేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇందుకు గ్రామాల్లోని యువకులకు ఆట పరికరాలు, కుల సంఘాలకు వంట పాత్రలు, దేవాలయాల నిర్మాణాలకు విరాళాలు అందజేస్తున్నారు.

# ఎన్నికల వేళ.. మద్యం సీసాల గలగల

పెద్దపల్లి : ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ నేటితో ముగియనుండటంతో పార్టీల ప్రచారం పర్వం వేడెక్కనుంది. ఇందులో మద్యం పంపిణీ పాత్ర ప్రధానం కావడం తెలిసిందే. దీన్ని ఎక్కడికక్కడ అడ్డుకునేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇందులో భాగంగానే ఆబ్కారీ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. జిల్లాలో లభించే మద్యం నాణ్యత, అక్రమ నకిలీ మద్యం తరలింపు, నిల్వపై అధికారులకు ఫిర్యాదు చేయొచ్చు. ఇందుకోసం అధికారులు ప్రత్యేక యాప్, టోల్‌ఫ్రీ నంబరును అందుబాటులోకి తీసుకొచ్చారు.

కల్తీకి అవకాశం..ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే వాటిలో ముఖ్యమైనది మద్యం. ఈ ఎన్నికల్లో అభ్యర్థులు పెద్ద ఎత్తున మద్యం పంపిణీ చేసే అవకాశం ఉంది. గోవా, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో మద్యం తక్కువ ధరకు దొరుకుతుండటంతో అక్కడ కొనుగోలు చేసిన మద్యం కొందరు రాష్ట్రానికి తీసుకొచ్చే అవకాశం ఉంది. సరిహద్దుల్లోని చెక్ పోస్టుల వద్ద తనిఖీల్లో ఇతర రాష్ట్రాల మద్యం పట్టుబడుతోంది. ఇదేసమయంలో పోటీ చేసే అభ్యర్థులు పెద్ద మొత్తంలో మద్యం నిల్వ చేసేందుకు వెనకాడటం లేదు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలోని ప్రధాన పార్టీల అభ్యర్థులు మద్యం దుకాణాదారులకు రూ.కోట్ల విలువైన మద్యం సరఫరా కోసం ముందస్తుగా డబ్బులు చెల్లించినట్లు సమాచారం. డిపోల నుంచి మద్యం నేరుగా వారు సూచించిన చోటుకు చేరవేసేలా ఒప్పందం చేసుకున్నట్లు తెలిసింది. దీనికి తోడు ఈ నెలాఖరుతో మద్యం దుకాణాల టెండర్లు ముగియనున్నాయి. కొత్తగా దుకాణాలు దక్కని కొందరు లైసెన్సుదారులు ఈ ఎన్నికల్లో కల్తీ మద్యం పారించేందుకు అవకాశాలు పుష్కలంగా ఉన్నాయనే ప్రచారం జరుగుతోంది.

టోల్‌ఫ్రీ నంబరు..ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎక్కడపడితే అక్కడ మద్యం, నాటు సారా పట్టుబడుతోంది. ఈ నేపథ్యంలో అక్రమ మద్యం, నిల్వ, సరఫరా తదితర విషయాలపై ఎలాంటి సమచారం ఉన్నా టోల్‌ఫ్రీ నంబరు 1800 425 2523 లో నేరుగా ఫిర్యాదు చేసేందుకు అవకాశం ఉంది. ఇది హైదరాబాద్‌లోని ఆబ్కారీ శాఖ కార్యాలయం కేంద్రంగా పనిచేస్తుంది. మనం ఫోన్ చేయగానే అక్కడి అధికారులకు సమాచారం వెళుతుంది. దానికి అనుగుణంగా స్థానిక అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేస్తారు. వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా తీసుకున్న చర్యలను ఉన్నతాధికారులకు వివరించాల్సి ఉండటంతో అలక్ష్యానికి తావుండదు.

ప్రత్యేక కార్యాచరణతో..

బి.సంతోష్, జిల్లా ఆబ్కారీ శాఖ అధికారి, నల్గొండ



ఎన్నికల నియమావళి అమలు నేపథ్యంలో ప్రజల సౌలభ్యం కోసం ఆబ్కారీ శాఖ 'వెరిట్' యాప్, టోల్‌ఫ్రీ నంబరు వంటి ప్రత్యేక కార్యచరణ అమలు చేస్తోంది. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు పూర్తి చేసేందుకు, కల్తీ మద్యం, మద్యం సంబంధిత నేరాల అదుపుతో అవాంఛనీయ ఘటనలు నివారించేందుకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నాం.

'వెరిట్' పేరుతో ప్రత్యేక యాప్..

కల్తీ మద్యం నివారించేందుకు అధికారులు తనిఖీలు కొనసాగిస్తున్నారు. సాధారణ మద్యం దుకాణాల్లో, నిబంధనలకు విరుద్ధంగా కొనసాగే గొలుసు దుకాణాల్లో లభించే మద్యం నాణ్యతను తెలుసుకునేందుకుగాను 'వెరిట్' యాప్ అందుబాటులో ఉంది. ఆండ్రాయిడ్, ఐఫోన్లలో యాప్ డౌన్లోడ్ చేసుకొని, మన రాష్ట్రం ఎంచుకోవాలి. చరవాణి నంబరు ఆధారంగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. యాప్ ఆధారంగా మద్యం సీసాపై ఉన్న బార్‌కోడ్‌ను స్కాన్ చేస్తే అది ఎక్కడ తయారైంది, తయారీ కోడ్, తయారీ తేదీ, డిపో లొకేషన్, అమ్మకం జరిగిన ప్రాంతం, ధర.. తదితర వివరాలన్నీ తెలుసుకోవచ్చు. వివరాలు రాకపోయినా.. బార్‌కోడ్ లేకపోయినా ఆ సీసాను అనుమానించొచ్చు.

# రోడ్డుపై ధాన్యం.. ప్రాణాలకు ప్రమాదం

నిజామాబాద్ : జాతీయ, రాష్ట్ర, సర్వీసు రోడ్లపై కొంత మంది రైతులు తాము పండిస్తున్న వరి ధాన్యం ఆరబెట్టడం సర్వసాధారణం అయ్యింది. ఆరబెట్టిన ధాన్యం వల్ల ఏటా వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో ప్రయాణికుల కుటుంబాలు తీవ్ర నష్టానికి గురవుతున్నాయి. కొందరు ప్రాణాలు కోల్పోతే.. మరికొందరు శాశ్వత వైకల్యాన్ని పొంది మంచానికి పరిమితమవుతున్నారు. ఇకనైనా రైతులు మేలుకుని రోడ్లపై వరిధాన్యం ఆరబెట్టొద్దని సీపీ కల్మేశ్వర్ ఒక ప్రకటన ద్వారా కోరారు.

చట్టరీత్యా చర్యలు తప్పవు



ఆరబెట్టిన ధాన్యం కారణంగా ఎవరైనా మరణిస్తే సంబంధిత యజమానిపై ఐపీసీ 304 సెక్షన్ ప్రకారం జైలు శిక్ష, జరిమానా విధించే అవకాశం ఉంటుంది. : ప్రభుత్వ ఆదేశాలు పాటించకుండా వరి ధాన్యాన్ని జాతీయ, రాష్ట్ర, సర్వీసు రహదారులపై ఆరబెడితే ఐపీసీ 188 సెక్షన్ ప్రకారం యజమానికి ఆరు నెలల జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధించే ఆస్కారం ఉంటుంది.

ఐపీసీ 341, 337, 338 సెక్షన్లతో పాటు పీడీపీపీ యాక్టు సెక్షన్ 3 ప్రకారం శిక్షలు పడే అవకాశం ఉంటుంది. : మోపాల్ పోలీసు ఠాణా పరిధిలో ఈ నెల 3న కాస్బాగ్ తండా రోడ్డులో వరి ధాన్యం ఆరబెట్టడంతో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న మహిళ ప్రమాదానికి గురై మరణించారు. రోడ్డుపై ధాన్యం ఆరబెట్టిన యజమాని గణపతిపై సెక్షన్ 304 ప్రకారం పోలీసులు కేసు నమోదు చేశారు.

# బృహత్ పల్లె ప్రకృతివనంలో 26 వేల చెట్ల నరికివేత

నిజామాబాద్ : పచ్చదనంతో పాటు పర్యావరణ హితం కోసం ఏర్పాటు చేసిన ప్రకృతివనంపై కబ్జాదారుల కన్నుపడటంతో పచ్చని చెట్లు నేల పాలవుతున్నాయి. మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలం సోమన్‌పల్లిలోని బృహత్ పల్లె ప్రకృతి వనంలో గతనెలలో 1,495 పెరుగుతున్న చెట్లను నరికివేసిన గుర్తుతెలియని వ్యక్తులు తాజాగా మరో 26,248 చెట్లను నేలకూల్చారు. ఈనెల 6న 1600, 9న 24,648 చెట్లను యంత్రాలతో పూర్తిగా తొలగించారు. చెట్ల నరికివేత సమాచారాన్ని తెలుసుకున్న ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో అజ్మత్‌అలీ, కార్యదర్శి తిరుమల బృహత్ ప్రకృతివనాన్ని సందర్శించారు.



రెండుసార్లు మొత్తం 27,743 చెట్లు నరికివేసినట్లు అధికారులు గుర్తించారు. ప్రకృతివనంలో 1,257 చెట్లు మిగిలి ఉన్నట్లు ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెండేళ్ల క్రితం సర్వేనెంబరు 306లో 10 ఎకరాల్లో బృహత్ పల్లె ప్రకృతివనాన్ని ఏర్పాటు చేశారు. అందులోని అయిదెకరాల్లో సుమారు 30వేలకు పైగా వివిధరకాల మొక్కలు నాటారు. ప్రకృతివనం భూమిపై కన్నేసిన పలువురు వ్యక్తులే చెట్లను తొలగిస్తున్నట్లు సమాచారం.

# వయో వృద్ధులు 12 వేలకు పైనే

జగిత్యాల : జిల్లాలోని కోరుట్ల, జగిత్యాల, ధర్మపురి నియోజకవర్గ పరిధిలో 80 ఏళ్లు దాటిన ఓటర్లు 12,077 మంది ఉండగా ఇందులో వృద్ధ మహిళలు 4,396, పురుషులు 7,681 మంది ఓట ర్లుగా ఉన్నారు. ఇందులో కోరుట్ల నియోజకవర్గ పరిధిలో 80 ఏళ్లకు పైబడిన వారు 2,988 ఉండగా ఇందులో పురుషులు 983, స్త్రీలు 2,005 మంది ఉన్నారు. జగిత్యాల నియోజకవర్గంలో 4,810 మందికి గానూ పురుషులు 1,839 మంది, స్త్రీలు 2,971 మంది ఉన్నారు. అదేవిధంగా ధర్మపురి నియో జకవర్గంలో 4,279 మందికి గానూ పురుషులు 1,574 మంది, స్త్రీలు 2,705 మంది ఉన్నారు.

జిల్లాలో దివ్యాంగ ఓటర్లు ఇలా...జిల్లా వ్యాప్తంగా 32,342 మంది దివ్యాంగ ఓటర్లుండగా పురుషులు 15,531 మంది, స్త్రీలు 16,809 మంది, ఇతరులు 2 ఉన్నారు. జిల్లాలోని జగిత్యాల నియోజకవర్గంలో 9,764 మంది దివ్యాంగులకు గానూ పురుష లు 4,509 మంది, స్త్రీలు 5,255 మంది, ఇతరులు ఒక్కరు ఉన్నారు. కో రుట్ల నియోజకవర్గంలో 11,524 మంది దివ్యాంగులకు గానూ పురుషులు 5,133 మంది, స్త్రీలు 6,391 మంది ఉన్నారు. ధర్మపురి నియోజకవర్గంలో 11,054 మంది దివ్యాంగులకు గానూ పురుషులు 5,890 మంది, స్త్రీలు 5,163 మంది, ఇతరులు ఒక్కరు ఉన్నారు.

ఇంటి వద్ద ఓటు వేసే అవకాశం...శాసనసభ ఎన్నికల్లో 80 సంవత్సరాలు పైబడిన వృద్ధులు, 40 శాతం మించి అంగవైకల్యం కలిగిన దివ్యాంగులతో పాటు అత్యవసర సేవల సిబ్బందికి ఇంటి వద్ద ఓటు వేసేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. బీఎల్‌వోలు ఇళ్లకు వెళ్లి తపాలా ఓటు వేయడానికి ఇష్టపడే వారి వద్ద నుంచి స్వీకరించారు. ఒకసారి తపాలా ఓటుకు ఆర్వో ఆమోదం తెలిపితే సంబంధిత ఓటరు ఒక పోలింగ్ కేంద్రంలో నేరుగా ఓటు వేయడానికి వీలుండదు. కేటాయించిన రెండు తేదీలలో వారి ఇళ్లలోకి వెళ్లి ఓటు వేసేలా చూడనున్నారు. ఇందుకు ప్రత్యేకంగా వీడయో చిత్రీకరణతో పాటు ప్రత్యేక కవర్లతో ఓటర్ల సమక్షంలో సీల్ వేసి సంబంధిత ఎన్నికల అధికారులకు అందించనున్నారు. జిల్లా వ్యాప్తంగా 32,342 మంది దివ్యాంగ ఓటర్లుండగా పురుషులు 15,531 మంది, స్త్రీలు 16,809 మంది, ఇతరులు 2 ఉన్నారు. జిల్లాలోని జగిత్యాల నియోజకవర్గంలో 9,764 మంది దివ్యాంగులకు గానూ పురుషులు 4,509 మంది, స్త్రీలు 5,255 మంది, ఇతరులు ఒక్కరు ఉన్నారు. కోరుట్ల నియోజకవర్గంలో 11,524 మంది దివ్యాంగులకు గానూ పురుషులు 5,133 మంది, స్త్రీలు 6,391 మంది ఉన్నారు.

# మండుతున్న డంపింగ్‌యార్డు



కరీంనగర్ : నిత్యం టన్నుల కొద్దీ వస్తున్న చెత్తను ఎక్కడ వేయాలనే ప్రశ్న గత కొన్నేళ్లుగా వెంటాడుతుండగా.. ప్రత్యామ్నాయం లేక ఏకైక డంపింగ్‌యార్డులోనే తీసుకొచ్చి పడేస్తుండటం.. ఎండాకాలంలో మండుతుండటంతో ప్రజాప్రతినిధులకు, అధికారులకు సవాల్‌గా మారింది.. మంటలతోపాటు దట్టమైన పొగ వ్యాపిస్తుం డటంతో ఆ ప్రాంతవాసులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. రెండు నెలల్లో ఇలా జరగడం రెండోసారి. ప్రస్తుత పరిస్థితిపై కథనం.కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలోని బైపాసు రోడ్డులో డంపింగ్‌యార్డు గుట్టలుగా పేరుకుపోతుంది. ఇంటింటా సేకరిస్తున్న చెత్తను నిల్వ చేయాలంటే కత్తి మీద సాములాగా మారింది. ప్రతి రోజు సేకరిస్తున్న వ్యర్థాలను ట్రాక్టర్లు, స్వచ్ఛ ఆటోలు, వ్యాన్ల ద్వారా తీసుకొస్తున్నారు. అందులో స్థలం లేకపోగా పొక్లెయిన్ సాయంతో పేర్చుకుంటూ నింపేస్తున్నారు. వేసవి వచ్చిందంటే చాలు అందులో మంటలు అంటుకోవడం, పొగ వ్యాపించడం సాధారణమైంది. సమీప ప్రాంతవా సులు గాలి కాలుష్యంతోపాటు వాసన భరించలేక అవస్థలు పడుతున్నారు.

పారిశుద్ధ్య వాహనాలకు ఆటంకాలు

పొగ కమ్ముకోవడంతో చెత్త తీసుకొచ్చి డంపింగ్‌యార్డులో నిల్వ చేసేందుకు వస్తున్న పారిశుద్ధ్య వాహనాలు లోపలకు వెళ్లడం కష్టమవుతోంది. సోమవారం ఇలాగే చెత్త తీసుకొచ్చిన ట్రాక్టర్లు, వ్యాన్లు ఆ పొగలోనే వెళ్లి డంపింగ్ చేసుకొని వచ్చే వరకు డ్రైవర్లు, కార్మికులు నానావస్థ పడ్డారు.

ప్రత్యామ్నాయం అవసరం

నగరానికి ఉన్న ఏకైక డంపింగ్‌యార్డు చెత్తతో నిండి సవాల్‌గా మారగా, కొత్తగా చెత్త నిల్వ చేసేందుకు స్థలాలు లభించడం లేదు. ఉన్న దానినే భవిష్యత్తులో పార్కుగా ఉపయోగిస్తామని అంటుండగా, ప్రత్యామ్నాయం ఏమిటనే విషయం మాత్రం తెలపడం లేదు. ప్రాసెసింగ్ విధానంలో వ్యర్థాలను తగ్గిస్తామని పేర్కొంటుండగా, అదీ ఇప్పట్లో సాధ్యమేనా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మరో వైపు ఏటా మండుతున్న చెత్త నిల్వ కేంద్రంలో మంటలు రాకుండా ఉండాలంటే చెత్తను ఎప్పటికి తడిగా ఉంచాలని చెబుతున్నారు. జనవరి నుంచే డ్రిప్ విధానం అవలంబిస్తే తప్ప మరో ఉపాయం లేదని కార్మికులు అంటున్నారు.

ఈ ఏడాది రెండో సారి..

డంపింగ్‌యార్డులో ఈ ఏడాది రెండోసారి మంటలు వ్యాపించాయి. మార్చి నెలలో ఒకసారి, ఆదివారం సాయంత్రం నుంచి మళ్లీ అంటుకుంది. అగ్గిని ఆర్పేందుకు ఫైరింజన్, ట్యాంకర్లు, జెట్టింగ్ మిషన్ ద్వారా నీటిని చల్లుతున్నారు. ఓ వైపు ఆర్పుతుండగానే మరో వైపు నుంచి అంటుకోవడంతో ఇబ్బందికరంగా తయారైంది. అందుల్లోంచి గ్యాస్ రావడమే కారణమని అంటున్నారు. దట్టమైన పొగతో ఆ ప్రాంతవాసులు అవస్థలు పడుతున్నారు. ఈ పొగ ఒకటెండ్రు రోజుల్లో పోయేలా కనిపించడంలేదు. పరిసర ప్రాంతాలు మొత్తం పొగతో వ్యాపించి దుర్వాసన వస్తుందని అక్కడి ప్రాంతవాసులు చెబుతున్నారు.

నత్తనడకన బయోమైనింగ్

స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ ద్వారా గతేడాది జూన్‌లో ప్రారంభించిన బయోమైనింగ్ నత్తనడకన సాగుతుంది. ఏడాదిలోగా డంపింగ్‌యార్డు పూర్తిగా శుభ్రం చేసి ఇవ్వాల్సి ఉంది. మరో నెల అయితే గడువు ముగుస్తుండగా ఎక్కడి చెత్త అక్కడే గుట్టలుగా కనిపిస్తోంది. రోజుకు ఎంతమేర శుద్ధి చేస్తున్నారనే లెక్కలు లేవని, శుద్ధి చేసిన వ్యర్థాలు ఎక్కడికీ, దేనికోసం తరలిస్తున్నారనే వివరాలు నగరపాలికలో కనిపించడం లేదు. వాస్తవానికి ఈ విషయాలను యార్డులో బోర్డు ప్రదర్శించాల్సి ఉంటుంది. బయోమైనింగ్ ప్రక్రియ రోజు జరుగుతుందా అంటే తెలియని గందరగోళం నెలకొంది. అక్కడికి వెళ్లి పరిశీలించిన సందర్భాల్లో ఇప్పుడే నిలిపివేశామని, సాంకేతిక కారణాలు సాకుగా చూపుతుండటం గమనార్హం.

మంటలు ఆర్పేందుకు చర్యలు

ఎండాకాలంలో ఈ సమస్య వస్తుండగా మంటలు ఆర్పేందుకు నిరంతరం అప్రమత్తంగా ఉండి చర్యలు తీసుకుంటున్నారు. బయోమైనింగ్ వేగవంతంగా చేపట్టేందుకు మరో మిషన్ బిగించాలని ఆదేశించాం. రోజుకు 2 వేల మెట్రిక్ టన్నులు శుద్ధి చేయాలి. వచ్చే ఎండాకాలం నాటికి మొత్తం శుభ్రం చేసి, అక్కడ డంపింగ్‌యార్డు లేకుండా చేస్తాం.వై.సునీల్‌రావు, మేయర్, కరీంనగర్ క్రమంగా వ్యాపిస్తున్న పొగ

# లారీల కొరతతో నిలిచిన సేకరణ

మెట్‌పల్లి : అదనపు తూకం వేసి పంపిస్తున్నప్పటికీ కేంద్రాలకు లారీలు రాకపోవడంతో కొనుగోలు కేంద్రాల్లో సేకరణ నిలిచిపోయింది. తరచూ మిల్లర్లు కొర్రీలు పెట్టడంతో రైతులు శుద్ధి చేయకుండా 42.50 కిలోల చొప్పున పంపిస్తేనే తీసుకుంటామని పేర్కొనడంతో మిల్లుకు పంపిస్తున్నారు. నాలుగు రోజులుగా మండల ంలోని సహకార సంఘ పరిధిలోని ఆరు కేంద్రాల్లోనే 15వేల తూకం వేసిన సంచుల నిల్వలున్నాయి. ఇందులో ఒక్క భీంరెడ్డిగూడెం కేంద్రంలోనే 6200 సంచులు నిలవ ఉండగా, మ్యాడారం తండాలో 2700, లక్ష్మీదేవిపల్లెలో 2500, సారంగాపూర్‌లో 800, పోతారంలో 1450, బట్టపల్లిలో 870 సంచుల వరకు పేరుకుపోయాయి. తూకం వేసిన సంచులు కేంద్రాలలో ఉండడంతో నిర్వాహకులు సేకరణ నిలిపివేయాల్సి వచ్చింది. అంతేకాకుండా వ్యవసాయాధికారులు సూచించిన రకాన్ని రైతులు సాగు చేస్తే ప్రస్తుతం మిల్లర్లు గ్రేడ్-1 కింద తీసుకోవడంలేదు. దీనివల్ల ప్రతి రైతు క్వింటాలుకు రూ.20 చొప్పున నష్టపోవాల్సి వస్తోంది. సారంగాపూర్ సహకార సంఘ పరిధిలో ఏటా లక్ష క్వింటాళ్ల ధాన్యం సేకరణ నిర్వహిస్తుండగా, ఇప్పటి వరకు కేవలం 34వేల క్వింటాళ్లు మాత్రమే సేకరించారు.

బస్తాపై మూడు కిలోల కోత

మల్యాల: అకాల వర్షాల కారణంగా తీవ్రంగా నష్టపోయిన అన్నదాతపై



రైసుమిల్లర్లు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ధాన్యంలో కోత విధిస్తుండటంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మల్యాల అడ్డరోడ్డు వద్దగల సింగిల్విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో నిన్నటి వరకు 40 కిలోల ధాన్యం బస్తాపై అదనంగా కిలో ధాన్యం కోతవిధించిన మిల్లర్లు సోమవారం నుంచి ధాన్యం బస్తాకు 3 కిలోలు కోత విధిస్తున్నట్లు పేర్కొనడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. దాదాపు నెల రోజులు కొనుగోలు కేంద్రాల్లో పడిగాపులు పడి ధాన్యం విక్రయించిన తర్వాత బస్తాపై అదనంగా 3 కిలోలు కోత విధిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉంది. ఈ విషయమై మల్యాల సింగిల్విండో సీఈవో గోవర్ధన్‌ను సంప్రదించగా తనకు సమాచారం లేదన్నారు. ధాన్యం బస్తాపై అదనంగా 3 కిలోలు కోత విధిస్తున్న విషయమై సంబంధిత రైసుమిల్లు యజమానులతో మాట్లాడతానని వివరించారు.

# ఆరేళ్లుగా ఎదురుచూపులే..!

నల్గొండ : ప్రాజెక్టు పనులు పట్టాలెక్కి ఏళ్లు దాటుతున్నా ముంపు బాధితులకు పరిహారం ఇంతవరకూ అందలేదు. డిండి నుంచి వచ్చే జలాలను, శ్రీశైలం మిగులు జలాలను నక్కలగండి వద్దకు చేర్చి 3.5 లక్షల ఎకరాలకు సాగు నీరు, కొన్ని గ్రామాలకు తాగునీరు అందించే ఉద్దేశంతో 2016లో నల్గొండ జిల్లా చందంపేట మండలం నక్కలగండి తండా సమీపంలో రూ.440 కోట్ల వ్యయంతో ప్రాజెక్టు పనులు చేపట్టారు. మూడేళ్లలో పూర్తి కావాల్సిన ప్రాజెక్టు పనులు నిధుల కొరత కారణంగా ఆరేళ్లయినా పూర్తి కాలేదు. నక్కలగండి ప్రాజెక్ట్, బ్యాలెన్సింగ్ నిర్మాణంలో నక్కలగండి తండా ముంపునకు గురవుతోంది. ముంపు వాసులకు అందాల్సిన పునరావాసం, ఆర్అండ్ఆర్ ప్యాకేజ్ సకాలంలో అందక ఆ తండా వాసులు పట్టణాల బాట పట్టారు. అయిదేళ్ల క్రితం నక్కలగండి తండాలో వివిధ అంశాలపై సర్వేలు పూర్తి చేసి 95 కుటుంబాలను అర్హులుగా గుర్తించారు. ఏడాది క్రితం పరిహారం అందజేస్తున్నట్లు వారి వద్ద నుంచి అనేక పత్రాలు సేకరించిన అధికారులు ప్రస్తుతం అటువైపు దృష్టి సారించడం లేదని ముంపువా సులు ఆరోపిస్తున్నారు. సంక్షేమ పథకాలన్నింటినీ ఆపేసి ప్రభుత్వం తమపై వివక్ష చూపిస్తోందని విచారం వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు చేసిన ధర్నాలు, వినతులు ఫలితంగా ఏడాది క్రితం చింతపల్లి మండలం సమీపంలో ఉన్న ప్రభుత్వ భూమిని పునరావాసం కోసం ఒక్కొక్కరికీ ఇస్తానన్న 240 గజాల ఇంటిస్థలం పేపర్లకే పరిమితమయ్యాయి.

నెలాఖరు వరకు జమ చేస్తాం..- చక్రపాణి, డీఈ, నీటిపారుదలశాఖ

ఈ నెలాఖరు లోపు ముంపు బాధితులకు ప్యాకేజీని వారి బ్యాంకు ఖాతాల్లో జమచేస్తాం. పునరావాస ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్యాకేజీ పూరైన వెంటనే పునరావాసం కల్పిస్తాం.

# ఖాళీ స్థలాలు.. అసౌకర్యాల నిలయాలు

సూర్యాపేట : పురపాలికల్లోని ఖాళీ స్థలాలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నీరు నిలవడం, పిచ్చిమొక్కలు పెరగడంతో దుర్వాసన, దోమలతో చుట్టుపక్కల నివాస గృహాలవారు ఇక్కట్లు పడుతున్నారు. భవిష్యత్తు అవసరాలకు జిల్లాలో చాలా మంది స్థలాలను కొనుగోలు చేశారు. వాటి నిర్వహణ విషయంలో కనీస చర్యలు తీసుకోవడం లేదు. దీంతో స్థలాలు మురుగు కూపాలుగా మారుతున్నాయి. జిల్లాలోని సూర్యాపేట, తిరుమలగిరి, నేరేడుచర్ల, కోదాడ, హుజూర్‌నగర్‌లో స్థిరాసి వ్యాపారం జోరుగా సాగుతోంది. కొందరు నిబంధనలు పాటిచకుండా ఇష్టారీతిన ప్లాట్లు ఏర్పాటు చేస్తూ విక్రయాలు చేస్తున్నారు. గతంలో ఉన్న కాలనీలతోపాటు కొత్తగా ఏర్పడిన వాటిలో ఓపెన్ ప్లాట్లు పెద్ద సమస్యగా మారాయి. జిల్లాలోని ఐదు పురపాలికల్లో 48 ప్రాంతాల్లో ఈ సమస్య నెలకొంది.

కొరవడిన పర్యవేక్షణప్లాట్ల యజమానులు అందులో మురుగు, వర్షం నీరు, పిచ్చిమొక్కలు పెరగకుండా తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. అలాంటివేమీ పట్టించుకోకుండా వదిలేస్తున్నారు. చెత్త, డ్రైనేజీ నీళ్లు అందులోచేరి మురుగు కూపాలుగా మారుతున్నాయి. సంబంధిత కొనుగోలుదారులకు మున్సిపల్ అధికారులు అడపాదడపా నోటీసులు జారీ చేయడమే తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదు. కొందరు స్పందించి రక్షణ చర్యలు తీసుకుంటుండగా, మరికొందరు పట్టనట్లు ఉంటున్నారు. కొందరి వివరాలు తెలియక వారికి నోటీసులు జారీ చేయలేకపోతున్నామం టూ పురపాలిక సంఘం చేతులు దులుపుకుంటోంది. ఖాళీ స్థలం పన్ను (వీఎల్‌టీ)ని యజమానులు చెల్లించాల్సి ఉంటుంది. దస్తావేజు విలువలో 0.5శాతం కట్టాలి. అంటే రూ.లక్ష విలువచేసే దానికి రూ.500 చెల్లించాలి. ఈ విషయంలోనూ వెనుకడుగు వేస్తున్నారు.

యజమానులపై చర్యలు తీసుకుంటాం-రామాంజులరెడ్డి, మున్సిపల్ కమిషనర్, సూర్యాపేట

# మాతా శిశు మరణాల కలవరం



కరీంనగర్ : కరీంనగర్ మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో 20 రోజులలో ముగ్గురు చిన్నారులు, బాలింత మృతి చెందారు. వరుస ఘటనలు అటు వైద్యులు, ఇటు కుటుంబ సభ్యుల్లో కలవరపెడు తున్నాయి. వైద్యుల నిర్లక్ష్యంతోనే ప్రాణాలు కోల్పోతున్నారని బాధితులు ఆరోపిస్తుండగా.. తమ నిర్లక్ష్యం ఏమి లేదని వారంటున్నారు. ఒక ఘటనలో మాత్రం వైద్యుడిపై చర్యలు తీసుకున్నారు. కారణాలు ఏమైనా వరుస ఘటనలతో అప్రమత్తం కావలసిన అవసరముంది.

నాణ్యమైన సేవలందాలనేది ప్రభుత్వ ధ్యేయం

ప్రభుత్వం గర్భిణులకు నాణ్యమైన సేవలు అందించాలనే ధ్యేయంతో మాతా శిశు ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. వైద్య సిబ్బందినీ అందుబాటులో ఉంచింది. ఈ ఆసుపత్రిలో రోజుకు 20 నుంచి 30 వరకు ప్రసవాలు జరుగుతుంటాయి. ప్రసవం తర్వాత కేసీఆర్ కిట్టుతోపాటు నగదు బహుమతి అందజేస్తోంది. అయితే శస్త్రచికిత్సలు చేస్తున్నారని తెలిసి.. ప్రభుత్వం సాధారణ ప్రసవాలు చేయాలని ఆదేశిం చింది. వైద్య సిబ్బందికి అవగాహన కల్పించింది. తప్పనిసరి అయితేనే శస్త్రచికిత్స చేయాలని సూచించింది. ఈ నిర్ణయాన్ని క్షేత్రస్థాయి సిబ్బంది పాటిస్తున్నారు.

వైద్య సిబ్బంది ఏమంటున్నారంటే

కొంతమంది పరిస్థితి విషమంగా ఉన్నప్పుడు ఆసుపత్రికి వస్తుంటారని, తాము తల్లీ బిడ్డ పరిస్థితిని అంచనా వేసే లోపు ప్రాణాలు కోల్పోతుం టారని చెప్పారు. ప్రజల ప్రాణాలు కాపాడడమే తమ ముందున్న కర్తవ్యమని, సేవలో ఎలాంటి నిర్లక్ష్యం చూపమని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మొదట సాధారణ ప్రసవం చేసేందుకు ప్రయత్నం చేస్తామని, సాధ్యం కాకపోతే శస్త్రచికిత్స నిర్వహిస్తామన్నారు. రోజుకు ఎంతోమందికి ప్రసవాలు చేస్తుంటామని, కొన్నిసార్లు పరిస్థితులు అనుకూలించక అలాంటి ఘటనలు జరుగుతుంటాయన్నారు. బాధితులు ఆరోపిస్తున్నట్లుగా నిర్లక్ష్యం ప్రదర్శించమన్నారు.

బాధితుల వాదన..

ప్రసవం కోసం తీసుకొచ్చిన తర్వాత వైద్య సిబ్బంది పలుసార్లు పరీక్షలు చేస్తున్నారు. ఆ సమయంలోనే వారికి బిడ్డ, తల్లి ఆరోగ్యంపై అవగాహన వస్తుంది. కొంతమంది తీవ్ర ఇబ్బంది పడుతున్నా.. సాధారణ ప్రసవం కోసం వేచి చూడమని అంటున్నారని వాపోయారు. అవసరాన్నిబట్టి శస్త్రచికిత్స చేస్తే వారి ప్రాణాలు దక్కేవి కదా అని బాధితులు పేర్కొంటున్నారు. కొందరు సిబ్బంది తీరుతోనే ఇబ్బందులు వస్తున్నాయని అంటున్నారు.

ప్రాణాలు కాపాడడం మా బాధ్యత

గతంలో జరిగిన ఘటనలు అన్నింటిల్లో వైద్యుల నిర్లక్ష్యం లేదు. ఒక ఘటనలో మాత్రం సమయానికి అందుబాటులో లేని పిల్లల వైద్యుడిపై పరిపాలనాధికారి చర్యలు తీసుకున్నారు. రోజు రాత్రి, పగలు అని కాకుండా 20కి పైగా ప్రసవాలు చేస్తుంటాం. ప్రజల ప్రాణాలు కాపాడడం మా బాధ్యత. కొన్ని ప్రతికూల పరిస్థితుల్లో అలాంటివి జరుగుతుంటాయి.

డాక్టర్ నవీన, ఆర్.ఎం

ఏప్రిల్ 24న

మంచిర్యాలకు చెందిన శిరీషను కరీంనగర్‌లోని మాతా శిశు ఆరోగ్య కేంద్రానికి తీసుకొచ్చారు. ఆమెకు వైద్యులు ప్రసవం చేశారు. పుట్టిన పసికందు రెండ్రోజులు బాగానే ఉంది. ఆ తర్వాత జ్వరం రాగా పిల్లల వైద్యుడి వద్దకు వెళ్లగా, ఆయన అందుబాటులో లేరు. ఆ తర్వాత శిశువు మరణించాడు. సమయానికి వైద్యం అందక మృతి చెందాడని కుటుంబ సభ్యుల ఆందోళన చేశారు.

మే 2 :చొప్పదండి మండలం భూపాలపట్నంకు చెందిన శ్వేతకు పుట్టిన బాబు కొద్ది గంటలలోనే కన్నుమూశాడు. ఆ కుటుంబం ఇప్పటికీ జీర్ణించుకోలేక పోతుంది.

12నకరీంనగర్‌కు చెందిన నీషా తస్రీన్(26) ఆసుపత్రికి రాగా బిడ్డకు జన్మనిచ్చిన కొద్ది సమయంలోనే ప్రాణాలు విడిచింది. ఈ సంఘటనతో కుటుంబమంతా రోదించింది. 15నహర్షిత అనే మహిళ ప్రసవంలోనే బాబు మృతి చెందడం ఆ కుటుంబాన్ని కన్నీటిపర్యంతం చేసింది.

# పరికరాలు కరవు.. అవస్థలు తీరవు!

ధర్మపురి: ధర్మపురి ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్షలకు కావాల్సిన పరికరాలు ఏమాత్రం అందుబాటులో లేవనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ కారణంగా సేవలు అంతంత మాత్రంగానే కొనసాగుతున్నాయి. గతఏడాది 30 పడకల ఈ ఆసుపత్రిని వైద్య విధాన పరిషత్‌లోకి మార్చారు. మొత్తం ఎనిమిది మంది వైద్యులను జిల్లా కేంద్రం నుంచి డిప్యుటేషన్‌పై ఇక్కడికి కేటాయించారు. ప్రస్తుతం ఆసుపత్రిలో ప్రతిరోజు 125 మందితో ఓపీ నమోదవుతోంది. ఇప్పుడిప్పుడే ప్రభుత్వ ఆసుపత్రిపై ప్రజల్లో నమ్మకం కలుగుతున్నా రోగుల పరీక్షలకు కావాల్సిన పరికరాలేవీ అందుబాటులోకి రాలేదు. రోగులకు ఎక్స్‌రే, ఇతర పరీక్షలకు స్కానింగ్ సదుపాయం అందుబా టులో లేదు. వార్డు సిబ్బందిని సైతం నియమించాల్సి ఉంది. రక్తపరీక్షలు చేసి జగిత్యాల టీహబ్‌కు పంపిస్తున్నారు. ఫలితాల కోసం రెండురోజుల పాటు ఎదురు చూడాల్సి వస్తోందని స్థానికులు వాపోతు న్నారు. ఆసుపత్రిలో ప్లేట్‌లెట్ కౌంటింగ్ మిషన్‌ను ఏర్పాటు చేసినా, నిర్వహణ లేక అది మూలనపడింది.

డయాలసిస్‌పై అవగాహన ఏదీ?

ధర్మపురిలోని ఆసుపత్రిలో డయాలసిస్ సేవలను ఫిబ్రవరి నెల నుంచి ప్రారంభించారు. కేవలం ఏడుగురు మాత్రమే ఈ సేవలను వినియోగిం చుకుంటున్నారు. ధర్మపురితోపాటు చుట్టుపక్కల మండలాల్లో ఆయా



సేవలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాల్సి ఉండగా దానిని చేపట్టడం లేదు. ఈ కారణంగా తక్కువ సంఖ్యలో రోగులు తమ పేర్లు నమోదు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇటీవల డయాలసిస్ కేంద్రంలో జనరేటర్‌ను ఏర్పాటు చేశారు. రోగులు కరీంనగర్‌కు వెళ్లకుండా ఇక్కడే సేవలు పొందే వీలుంది. దీనిపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

ప్రతిపాదనలు పంపించాం

ధర్మపురిలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పరికరాల ఏర్పాటునకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరవగానే ఏర్పాటు చేస్తాం. డయాలసిస్ సేవలపై స్థానికులకు అవగాహన కల్పించాం. విద్యుత్తు అంతరాయం ఏర్పడినా సేవలకు ఇబ్బంది లేకుండా జనరేటర్‌ను ఏర్పాటు చేశాం. డయాలసిస్ సేవలను పొందేందుకు చాలామంది దరఖాస్తు చేసుకున్నా నిబంధనల ప్రకారం ఏడుగురు మాత్రమే అర్హులుండటంతో వారికి సేవలందిస్తున్నాం.నవీన్, ఆసుపత్రి సూపరిం టెండెంట్, ధర్మపురి

# బూడిద రవాణాకు ఎన్టీపీసీ టెండరు

గోదావరిఖని : రామగుండం ఎన్టీపీసీ భారీ ఎత్తున బూడిద రవాణాకు టెండర్లు ఆహ్వానించింది. రెండు నెలల క్రితమే 1.70 లక్షల మెట్రిక్ టన్నుల బూడిద రవాణాకు టెండర్లు ఖరారు చేసింది. 40 లక్షల మెట్రిక్ టన్నుల రవాణాకు టెండర్లు ఆహ్వానించగా మొత్తం 1.70 లక్షల మెట్రిక్ టన్నులకు మాత్రమే బిడ్‌లు దాఖలు చేశారు. ప్రస్తుతం మిగిలిపోయిన 38,28,500 మెట్రిక్ టన్నుల బూడిద రవాణాకు ఆసక్తి ఉన్న వారి నుంచి బిడ్స్ ఆహ్వానిస్తుంది. దీనికి సంబంధించిన టెండరు దాఖలు షెడ్యూలును విడుదల చేసింది. రెండు నెలల క్రితం కేటాయించిన బూడిద రవాణా టెండరులో మెట్రిక్ టన్నుకు రూ.395 చొప్పున ఖరారు చేయగా తాజాగా రూ.69గా నిర్ణయిస్తూ షెడ్యూలు విడుదల చేసింది. కొత్తగా ఆహ్వానించిన టెండరు లో ధర తక్కువకే బూడిద రవాణాకు బిడ్స్ ఆహ్వానించిన ఎన్టీపీసీ సంస్థ ఎంఎస్‌టీసీ ద్వారా టెండరు దాఖలు చేయాలని సూచించింది. కుందనపల్లి పాండు నుంచి రవాణా చేసుకోవడానికి ఏడాది కాలానికి ఆహ్వానించిన టెండర్లలో గతంలో ఎక్కువ ధరకు కోడ్ చేసిన ఎన్టీపీసీ ఈసారి తక్కువ ధరతో ఆహ్వానించడంతో ఎక్కువ మంది పాల్గొనే అవకాశం ఉంది. రెండు నెలల వ్యవధిలోనే భారీ తేడాతో టెండర్లు ఆహ్వానించడంపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కాగా సకాలంలో రవాణా చేయాల్సిన బూడిద లక్ష్యాన్ని పూర్తి చేయని గుత్తేదార్ల విషయంలో యాజమాన్యం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఇటుక ధరలు తగ్గేనా?బూడిద ధర పెరగడంతో సిమెంటు ఇటుక బట్టీల యజమానులు 40 శాతం ధర పెంచారు. దీనివల్ల వినియోగదా రులపై భారం పెరిగింది. ప్రస్తుతం ఎన్టీపీసీ యాజమాన్యం సైతం బూడిద రవాణా చేసుకోవడానికి




ధర తగ్గించడంతో పెంచిన ఇటు ధరలు సైతం తగ్గించాలని వినియోగదారులు కోరుతున్నారు. కేవలం రూ.69కే మెట్రిక్ టన్ను బూడిద రవాణా చేసుకోవడానికి ఎన్టీపీసీ యాజమాన్యం అవకాశం కల్పించింది. దీంతో ఇటుక ధరలు తగ్గుతాయని వినియోగదారులు భావిస్తున్నారు.

# ఆమని.. ఆర్థిక శక్తి

భువనగిరి : 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా స్వయం సహాయ సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా రూ.515 కోట్ల రాయితీ రుణాలుగా అందించేందుకు గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు ప్రణాళికను సిద్ధం చేశారు. మహిళలు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. కిరాణం, జనరల్ స్టోర్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ, దుస్తుల విక్రయ కేంద్రం, వ్యవసాయం, పాడి పశువులు, మేకల పెంపకం తదితర జీవనోపాధికి అవసరమైన యూనిట్లు నెలకొల్పేందుకు మహిళలు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. సంబంధిత గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు ప్రోత్సహించడంతో పాటు తీసుకున్న రుణాలు ఏవిధంగా పెట్టుబడికి వియోగించుకోవాలో అవగాహన కల్పిస్తున్నారు. బ్యాంకు రుణాల సద్వినియోగంపై అధికారులు చైతన్యం తీసుకురావడంతో నెలవారీ వాయిదాలు సక్రమంగా చెల్లిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ క్రమంలోనే ఈ ఆర్థిక సంవత్సరం మహిళా సంఘాలకు లక్ష్యాలను అధికారులు ఖరారు చేశారు. స్వయం ఉపాధిరుణాలు పొందడంతో పాటు రుణాలు సకాలంలో తిరిగి చెల్లించేలా ఏపీఎం, సీసీ స్థాయి అధికారులు మహిళా సంఘాల సభ్యులు పలు దఫాలుగా స్థానిక వెలుగు కార్యాలయంలో అవగాహన కల్పిస్తున్నారు.

బ్యాంకులు సైతం సుముఖంఏటా బ్యాంకు లింకేజీ రుణాలు, స్త్రీనిధి రుణాలు నిర్దేశించిన లక్ష్యం మేరకు అందిస్తున్నందున మహిళల్లో ఆర్థిక భరోసా ఏర్పడుతోంది. కిస్తులు సకాలంలో చెల్లిస్తుండటంతో బ్యాంకు అధికారులు సైతం మహిళా సంఘాల సభ్యులకు రుణాలు అందించేందుకు సుముఖత వ్యక్తం చేస్తున్నారు.

# కాంగ్రెస్ అనుకూల తుపాను రాబోతోంది!



భోపాల్: మధ్యప్రదేశ్‌లో ఎన్నికల ప్రచారానికి ఇంకా రెండు రోజులే మిగిలి ఉండటంతో రాజకీయ పార్టీలు జోరును పెంచాయి. అధికార, విపక్ష పార్టీల అగ్రనేతలు వరుస పర్యటనలతో ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మంగళవారం విదిశలో నిర్వహించిన ప్రచార ర్యాలీలో పాల్గొని భాజపా పాలనపై విమర్శలు గుప్పించారు. 2020లో కమల్‌నాథ్ సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని భాజపా కూల్చి వేసిన అంశాన్ని ప్రస్తావించారు. ఈసారి మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ అనుకూల తుపాను రాబోతోందని.. తమ పార్టీ 145 నుంచి 150 సీట్లు గెలుచుకోవడం ఖాయమని రాహుల్ విశ్వాసం వ్యక్తంచేశారు. ఐదేళ్ల క్రితం ఎన్నికైన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని భాజపా నేతలు ప్రధాని మోదీ, శివరాజ్‌సింగ్ చౌహాన్, అమిత్ షా ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడం ద్వారా ప్రభుత్వ పతనానికి కారణమయ్యారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న 15 మాసాల్లోనే 27లక్షల మంది రైతులకు వ్యవసాయ రుణాలను మాఫీ చేసిందని రాహుల్ అన్నారు. కానీ, తమ ప్రభుత్వాన్ని కూల్చివేసి అధికారం చేపట్టిన భాజపా మాత్రం కార్మికులు, రైతులు, చిన్న వ్యాపారులు, నిరుద్యోగులను మోసం చేసిందని విరుచుకుపడ్డారు. కర్ణాటక, ఛత్తీస్‌గఢ్‌లలో కాంగ్రెస్ పార్టీ ద్వేషంతో కాకుండా ప్రేమతో భాజపాను ఓడించిందన్నారు. కర్ణాటకలో భాజపా 40శాతం కమీషన్‌తో ప్రభుత్వాన్ని నడిపిందని దుయ్యబట్టారు. ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఐదేళ్లలో పేదల జేబుల నుంచి భాజపా లాక్కున్న డబ్బును తిరిగి ఇవ్వాలని కర్ణాటక సీఎంకు తాను చెప్పానన్నారు. సంపన్నులకు భాజపా ఇచ్చిన డబ్బును తిరిగి పేదలకు ఇచ్చేయాలని చెప్పినట్లు తెలిపారు. ఇతర రాష్ట్రాల్లో ఎల్పీజీ సిలిండర్ రూ.1200 నుంచి రూ.1400లుగా ఉంటే కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలైన కర్ణాటక, ఛత్తీస్‌గఢ్‌లలో మాత్రం రూ.500లకే ఇస్తున్నట్లు చెప్పారు. కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేస్తోందన్నారు. రైతుల రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తోందని రాహుల్ చెప్పారు. మొత్తం 230 సీట్లు కలిగిన మధ్యప్రదేశ్ అసెంబ్లీకి నవంబర్ 17న పోలింగ్ జరగనున్న విషయం తెలిసిందే.

# మన పిల్లలు జాతీయ స్థాయిలో రాణించేలా చర్యలు

## బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన సీఎం వైయస్ జగన్ మోహన్ రెడ్డి



గుంటూరు: పిల్లలకు ఇచ్చే గొప్ప ఆస్తి చదువేనని.. అందుకే ప్రపంచస్థాయి విద్యకు ఆంధ్రప్రదేశ్‌లో పెద్ద పీట వేస్తున్నామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. నేడు బాలల దినోత్సవం సందర్భంగా ఎక్స్ ద్వారా బాలబాలికలకు శుభాకాంక్షలు తెలియజేసిన ఆయన.. దేశ తొలి ప్రధాని జవహార్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా ఘన నివాళులూ అర్పించారు. “మనం మన పిల్లలకు ఇచ్చే గొప్ప ఆస్తి చదువు. ఆ దిశగా అడుగులు వేస్తూ, ప్రపంచస్థాయి విద్యకు పెద్దపీట వేస్తూ.. ఇంగ్లీష్ మీడియం బోధనను తీసుకువచ్చాం. మన పిల్లలు జాతీయ స్థాయిలో రాణించేలా ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడలకు ప్రాధాన్యత పెంచాం. అంగన్‌వాడీల నుంచి కాలేజీల వరకు ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చాం” అని సందేశంలో సీఎం జగన? తెలియజేశారు. దేశ తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా ఆయనకి ఘన నివాళులు అర్పిస్తున్నట్లు తెలిపిన సీఎం జగన్.. రాష్ట్రంలోని బాలబాలికలందరికీ బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

# రామ్ ఇన్ఫో, ఐప్యాక్‌తో ఓటర్ల సమాచారం సేకరిస్తున్నారు: నిమ్మగడ్డ



గుంటూరు: బూత్ స్థాయిలో కీలకంగా వ్యవహరించే విపక్ష నేతలను కేసులతో బెదిరించే యత్నాలు జరుగుతున్నాయని విశ్రాంత ఐఏఎస్ అధికారి, సిటిజన్స్ ఫర్ డెమొక్రసీ (సీఎఫ్‌డీ) ప్రధాన కార్యదర్శి నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ అన్నారు. ఓటర్ల వ్యక్తిగత సమాచారాన్ని కొందరు సేకరిస్తున్నారని ఆరోపించారు. గుంటూరులో ఏర్పాటు చేసిన ఓటర్ల సహాయ కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. “ఐప్యాక్, రామ్ ఇన్ఫో వంటి సంస్థలు ఓటర్ల సమాచారం సేకరిస్తున్నాయి. రామ్ ఇన్ఫో సంస్థ గతంలో వాణిజ్య పన్నుల విభాగంలో సేవలు అందించింది. ఆ తర్వాత సంస్థ యాజమాన్యం చేతులు మారింది. అప్పటి నుంచి దాని పనితీరుపై ఆరోపణలు వస్తున్నాయి. సామాజికంగా ప్రభావితం చేయగలవారిని ఐప్యాక్, రామ్ ఇన్ఫో వంటి సంస్థలు గుర్తిస్తున్నాయి. ప్రభావితం చేసేవాళ్లను సామ, దాన, భేద, దండోపాయాలతో లొంగదీసుకుంటున్నారు. ఇటీవల ఎఫ్ఐఆర్‌లు అత్యధికంగా నమోదవుతున్నాయి. ఎన్ఆర్ఐలను బెదిరింపు అస్త్రంగా వాడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఎఫ్ఐఆర్‌ల నమోదుపై ఓ కమిటీ వేయాలని సీఎఫ్‌డీ భావిస్తోంది. విశ్రాంత పోలీసు అధికారులతో ఎఫ్ఐఆర్‌ల నమోదుపై పరిశీలన చేయించే ఆలోచన ఉంది. కమిటీ విచారణలో తేలిన వాస్తవాలను హెచ్చార్సీ ముందు ఉంచుతాం. బూత్ స్థాయిలో కీలకంగా వ్యవహరించే విపక్షాల నాయకులను కేసులతో బెదిరించే యత్నాలు జరుగుతున్నాయని తెలుస్తోంది. అక్రమంగా కేసులు బనాయించే హక్కు పోలీసులకు లేదు. అలా చేస్తే ప్రజల హక్కులను హరించడమే అవుతుంది. రాష్ట్ర పోలీసులు విచక్షణతో వ్యవహరిస్తారని నమ్ముతున్నాం. అక్రమ కేసుల నమోదు మా దృష్టికి వస్తే ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తాం. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోవాలని సీఎఫ్‌డీ కోరుతోంది. విపక్షాలపై ఎక్కువ కేసులు పెడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. విశ్రాంత జడ్జిలతో కమిటీ వేసి అక్రమ కేసులపై అధ్యయనం చేయాలి. ఓటు హక్కు నమోదు చేయించుకోవడానికి నాకే మూడేళ్లు పట్టింది. స్థానికంగా నివాసం ఉండటం లేదనే కారణంతో ఓటు హక్కు కష్టమవుతోంది. పాత ఓటును సరెండర్ చేసి కొత్త ఓటును సులభంగా పొందవచ్చు. ఎన్నారైలు కూడా ఆధార్ కార్డు తీసుకుంటే ఓటు పొందవచ్చు. ఫామ్ 7 ద్వారా గరిష్ఠంగా ఐదుగురిపై ఫిర్యాదు చేయవచ్చు. తప్పుడు సమాచారం, దుర్బుద్ధితో ఫామ్ 7 దరఖాస్తు చేస్తే చట్టరీత్యా శిక్షార్హులవుతారు”అని నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ అన్నారు.

# నియామక పరీక్షల్లో అలాంటి దుస్తులపై నిషేధం



బెంగళూరు: నియామక పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు కర్ణాటక ఎగ్జామినేషన్ అథారిటీ డ్రెస్ కోడ్ విధించింది. తలను పూర్తిగా కప్పేలా టోపీలు లేదా దుస్తులు ధరించిన వారిని పరీక్షా కేంద్రంలోకి అనుమతించబోమని స్పష్టం చేసింది.

పరీక్షల్లో మోసాలు, కాపీయింగ్‌ను నివారించే చర్యల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు డ్రెస్‌కోడ్ కు సంబంధించి తాజాగా ప్రకటన విడుదల చేసింది. ప్రవేశ పరీక్షలు రాసే అభ్యర్థులు.. తల, ముఖం, చెవులు, నోటిని కప్పేలా ఉండే టోపీలు, ఇతర దుస్తులు ధరించడంపై నిషేధం విధిస్తున్నట్లు కేఈఏ వెల్లడించింది. దీంతో పాటు లోహపు ఆభరణాలను కూడా అనుమతించబోమని తెలిపింది. అయితే, పెళ్లయిన మహిళలు మంగళసూత్రం, మెట్టెలు ధరించి పరీక్ష రాసేందుకు అనుమతినిస్తున్నట్లు తెలిపింది. గతంలో వీటిపైనా కేఈఏ నిషేధం విధించగా.. కొన్ని సంఘాల నుంచి వ్యతిరేకత ఎదురైంది. దీంతో తాజా ఉత్తర్వుల్లో ఆ నిబంధనను సడలించారు. నవంబరు 18, 19 తేదీల్లో రాష్ట్రంలో పలు బోర్డులు, కార్పొరేషన్ల ప్రవేశ పరీక్షలు జరగనున్న నేపథ్యంలో ఈ డ్రెస్‌కోడ్‌ను ప్రకటించారు.

కాగా.. కర్ణాటకలో ‘హిజాబ్’పై పెద్ద ఎత్తున ఆందోళనలు జరిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా డ్రెస్ కోడ్ మరోసారి రాష్ట్రంలో చర్చకు తెరలేపింది. తాజా నిబంధనల్లో ‘హిజాబ్’ను నేరుగా ప్రస్తావించనప్పటికీ.. తలను కప్పి ఉంచే దుస్తులపై నిషేధం ఉండటంతో దీన్ని ధరించేందుకు కూడా అనుమతి ఉండబోదని తెలుస్తోంది. కాగా.. అక్టోబరులో జరిగిన కొన్ని నియామక పరీక్షల్లో హిజాబ్‌ను అధికారులు అనుమతించారు.

# అమరావతి ఏకైక రాజధానిగా టీడీపీ జనసేన మ్యానిఫెస్టో...!

అమరావతి : ఏపీకి ఏకైక రాజధానిగా అమరావతినే ఉంచుతామని ప్రజలకు హామీ ఇస్తూ టీడీపీ జనసేన ఉమ్మడి మ్యానిఫెస్టోని త్వరలో రిలీజ్ చేయబోతున్నారని పేర్కొంటున్నారు. తెలుగుదేశం జనసేన ఉమ్మడి మ్యానిఫెస్టో మీద గత కొద్ది కాలంగా కసరత్తు జరుగుతోంది. దీని కోసం యనమల నాయకత్వంలో టీడీపీ ముగ్గురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేసింది. అందులో అశోక్ బాబు, పట్టాభి ఉన్నారు. అలాగే జనసేన నుంచి ముత్తా శశిధర్ వరప్రసాద్, శరత్ హాజరయ్యారు. మొత్తం రెండు పార్టీల నుంచి ఆరుగురు సభ్యులు హాజరైన ఈ ఉమ్మడి సమావేశంలో అనేక అంశాలను చర్చించారు. సుదీర్ఘ చర్చల అనంతరం టీడీపీ జనసేన మేనిఫెస్టో కమిటీ 11 అంశాలకు ఆమోదముద్ర వేసింది. త్వరలోనే ఉమ్మడి మినీ మేనిఫెస్టో విడుదల చేయాలని నిర్ణయించారు. ఇక ఈ మ్యానిఫెస్టో కరపత్రాలలో చంద్రబాబు, పవన్ ఫోటోలను ఉంచుతారని అంటున్నారు. ఇదిలా ఉంటే అమరావతి ఏకైక రాజధాని అంటూ టీడీపీ జనసేన జనంలోకి వెళ్లాలని డిసైడ్ అవుతున్నాయి. మరి మూడు రాజధానులతో వైసీపీ ఎటూ జనంలోకి వెళ్తుంది. మరి 2024 ఎన్నికల్లో ప్రజలకు అజెండా సంక్షేమ పథకాలు అవుతాయా లేక ఏపీకి రాజధాని అవుతుందా అన్నది ఇపుడు చర్చకు వస్తున్న విషయం. ఏపీని సంపన్న రాష్ట్రంగా మార్చాలి అంటే అమరావతినే ఏకైక రాజధానిగా ఉంచాలని ఈ రెండు పార్టీలు అంటున్నాయి. తాము అధికారంలోకి వస్తే అదే చేస్తామని చెప్పబోతున్నాయి. మరి ఉత్తరాంధ్రా, రాయలసీమ ప్రజల మనోగతం కూడా అలాగే ఉంటుందని ఈ రెండు పార్టీలు నమ్ముతున్నాయా అన్నదే చర్చగా ఉంది. ఇదిలా ఉంటే మూడు రాజధానులు వైసీపీ చెప్పినా ఆచరణలో అది ఒక్క అడుగూ ముందుకు పడలేదు కాబట్టి ఆయా ప్రాంతాలలోని ప్రజానీకం కూడా ఒక రకమైన వైరాగ్యంలో ఉన్నాయని అంటున్నారు. అదే విధంగా ఏపీకి రాజధాని లేదు అన్న విమర్శలు కూడా ఏపీ ప్రజానీకం మీద ప్రభావం చూపిస్తాయని విపక్షాలు నమ్ముతున్నాయి. అదే తమకు అడ్వాంటేజ్ గా మారుతుందని ఊహించే ఉమ్మడి మ్యానిఫెస్టోలో దాన్ని ఉంచుతున్నారని అంటున్నారు. ఇక ఉచితంగా ఉచిత ఇసుక ద్వారా పేదలకు ఇళ్లు నిర్మించడంతో పాటు భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించడం, జనసేన సౌభాగ్యపదం ద్వారా నిరుద్యోగ యువతను పారిశ్రామిక వేత్తలుగా తయారు చేసి ఎక్కడికక్కడ ఉద్యోగాలు కల్పించడం, వ్యవసాయాన్ని లాభసాటిగా తీసుకెళ్లడం ద్వారా రైతులు, కౌలు రైతుల ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చడం, మన ఆంధ్రప్రదేశ్-మన ఉద్యోగాలు అనే ఆరు ప్రతిపాదనల్ని ఉమ్మడి మేనిఫెస్టో కమిటీలో పొందుపరుస్తున్నట్లుగా చెబుతున్నారు. మరి వీటి మీద వైసీపీ ఎలా రియాక్ట్ అవుతుందో చూడాల్సి ఉంది.

# బాబు కీర్తన టీడీపీ ఓట్ల కోసమేనా కేటీయార్...?



అమరావతి : టీడీపీ ఓట్లు ఇపుడు తెలంగాణాలో ఇంపార్టెంట్ గా మారిపోయాయి. రెండు ఎన్నికల నుంచి టీడీపీ ఓట్లను తమ వైపు టర్న్ చేసుకుని బీయారెస్ సులువుగా అధికారంలోకి వస్తోంది. నిజంగా చూస్తే 2014లో 16 శాతం పైగా ఓట్లు వచ్చిన టీడీపీ 2018 నాటికి 3 శాతానికి పడిపోయింది. ఈ ఓట్లు అన్నీ కూడా బీయారెస్ కే ఎక్కువ కన్వర్ట్ అయ్యాయని లెక్కలు చెబుతున్నాయి. ఇదిలా ఉంటే 2023 ఎన్నికల్లో టీడీపీ పోటీ నుంచి తప్పుకుంది. ఆ పార్టీ ఎవరికి మద్దతు ఇస్తుంది అన్నది బాహాటంగా ప్రకటించలేదు. అయితే కాంగ్రెస్ కే టీడీపీ మద్దతు అని ప్రచారం అయితే సాగుతోంది. మరో వైపు పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి తనకు చంద్రబాబు అంటే ఇష్టమని చెప్పేసుకున్నారు. టీడీపీ తన పుట్టిల్లు అని అంటున్నారు. ఇపుడు బీయారెస్ వంతుగా ఉంది. అందుకే కేటీయార్ బాబుని బాగా పొగుడుతున్నారని కామెంట్స్ వస్తున్నాయి. చంద్రబాబు మీద ఓటుకు నోటు కేసుని తాము మళ్లీ తిరగతోడలేదంటే అది కేసీయార్ ఔదార్యం అని ఒక చానల్ కి ఇచ్చిన ఇంటర్వ్యూలో అంటున్నారు. అలాగే బాబుని స్కిల్ స్కాం కేసులో అరెస్ట్ చేసి జైలులో పెట్టిన ఘటన బాధాకరం అంటున్నారు. తాము హైదరాబాద్ లో బాబు మద్దతుదారుల ఆందోళనలు చేయవద్దు అని చెప్పలేదని ధర్నా చౌక్ లో చేయమని మాత్రమే సూచించామని కేటీయార్ సర్దుబాటు చేసుకుంటున్నారు. తన మాటలు నొప్పించి ఉంటాయని అర్థం మాత్రం ఇదే అంటున్నారు. ఇక చంద్రబాబు అరెస్ట్ తరువాత లోకేష్ ఎంతలా తల్లడిల్లింది తాను అర్థం చేసుకోగలను అని కూడా కేటీయార్ చెప్పుకొస్తున్నారు తాను లోకేష్ రెగ్యులర్ గా మాట్లాడుకుంటామని కూడా చెబుతున్నారు. ఇవన్నీ పక్కన పెడితే చంద్రబాబు పొలిటికల్ గా ఇప్పటికీ పూర్తి ఫిట్ నెస్ తో ఉన్నారని సర్టిఫికేట్ ఇవ్వడం విశేషం. బాబు మరో పది నుంచి పదిహేనేళ్ళ పాటు రాజకీయాలు చేయగలరు అని కూడా కేటీయార్ అంటున్నారు. ప్రధాని మోడీతో ముడి పెట్టి ఆయన కంటే బాబు వయసులో చిన్న వారు అని అంటున్నారు బాబును పొగిడే ఉత్సాహంలో ఇక్కడే కేటీయార్ తప్పులో కాలేశారని అంటున్నారు. చంద్రబాబు మోడీ కంటే అయిదు నెలలు పెద్ద. చంద్రబాబు 1950 ఏప్రిల్ 20న పుట్టారు అని వికీ పీడియా రికార్డు చెబుతోంది. అలాగే నరేంద్ర మోడీ 1950 సెప్టెంబర్ 17న పుట్టారని అదే వికీ పీడియా రికార్డులో ఉంది. బాబు వయసు గురించి అందరికీ తెలుసు. ఆయనకు 73 ఏళ్ళు నిండాయి. మోడీకి 73 ఇటీవలే నిండాయి. మరి కేటీయార్ మాత్రం బాబు మోడీ కంటే చిన్నవారని చెప్పడం మీద చర్చ సాగుతోంది. బాబుని ఆకాశానికి ఎత్తేస్తే టీడీపీ ఓట్లు పడతాయని భావిస్తున్నారని ఇది వ్యూహంలో భాగమే అని అంటున్నారు. అయితే ఈసారి టీడీపీ ఓట్లు ఎవరికి పడతాయన్నది నవంబర్ 30న జరిగే పోలింగులో తేలుతుంది అని అంటున్నారు. అయితే రాజకీయాల్లో వ్యూహాలు ఎత్తులు అలా సాగుతూ ఉంటాయి. కేటీయార్ వ్యూహాలు అలాగే ఉన్నాయని అంటున్నారు. మరి టీడీపీ అధినేత చంద్రబాబు విషయంలో కేటీయార్ ఇంతలా కితాబులు ఇస్తూంటే తమ్ముళ్ళ మనసు కరుగుతుందా లేదా అన్నది తెలియాలంటే వెయిట్ అండ్ సీ.

# దొంగ ఓట్ల వెనుక కథ, స్క్రీన్‌ప్లే మొత్తం తాడేపల్లి ప్యాలెస్‌దే: తెదేపా నేత విజయ్‌కుమార్



మంగళగిరి: వాలంటీర్లను ఎన్నికల విధుల నుంచి తొలగించాలని తెదేపా అధికార ప్రతినిధి నీలాయపాలెం విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. రామ్ ఇన్ఫోకు చెందిన ‘ఫీల్డ్ ఆపరేటింగ్ ఏజెన్సీ’ పేరుతో దొంగ ఓట్లను చేర్చే కార్యక్రమం జరుగుతోందని ఆయన ఆరోపించారు. మంగళగిరిలోని తెదేపా కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో విజయ్‌కుమార్ మాట్లాడారు. దొంగ ఓట్ల వెనుక కథ, స్క్రీన్‌ప్లే మొత్తం తాడేపల్లి ప్యాలెస్‌దేనని విమర్శించారు. “ఫాం-7 వినియోగం పూర్తిగా ఎన్నికల కమిషనర్ పర్యవేక్షణలో ఉంచాలి. ప్రభుత్వా డేటా అసలు ఎలా బయటకెళ్తోంది? ప్రభుత్వ సిస్టమ్‌లోకి ప్రైవేటు వ్యక్తులు ఎలా వచ్చారు?వాలంటీర్లలో 90శాతం వైకాపా క్యాడరేనని మంత్రులే చెప్పారు. వాలంటీర్లను ఎన్నికల విధుల నుంచి పూర్తిగా తొలగించాలి. వైకాపా ప్రభుత్వానికి అనుకూలంగా వాలంటీర్లు చేస్తున్న ప్రచారాన్ని నివారించాలి. వాలంటీర్ల మానిటరింగ్‌కు ‘ఫీల్డ్ ఆపరేషన్ ఏజెన్సీ’ని పెట్టారు. వైకాపా సహాయంతో ‘రామ్ ఇన్ఫో’ ఫీల్డ్ ఆపరేటింగ్ ఏజెన్సీ వాలంటీర్ల ద్వారా డేటాను సేకరిస్తోంది. ఆ డేటా మొత్తం ఐప్యాక్‌కు చేరుతోంది” అని విజయ్‌కుమార్ ఆరోపించారు.

# పాక్‌కు మళ్లీ షాక్.. ఈసారి జైషే చీఫ్ అనుచరుడి కాల్చివేత



ఇస్లామాబాద్: పాకిస్థాన్‌లో వరుసగా ఉగ్రవాదులు హతమవుతున్నారు. తాజాగా జైషే మహ్మద్ అధినేత మౌలానా మసూద్ అజార్ సన్నిహిత అనుచరుడు రహీమ్ ఉల్లా తారిఖ్‌ను గుర్తుతెలియని వ్యక్తులు కాల్చి చంపారు. కరాచీలో మతపరమైన కార్యక్రమానికి హాజరయ్యేందుకు వెళ్తుండగా.. తారిఖ్‌ను ఆగంతుకులు మట్టుబెట్టారు. తమ దేశంలో వరుసగా జరుగుతున్న పెంపుడు ఉగ్రవాదుల హత్యలు పాక్‌ను కలవరపెడుతున్నాయి. జైషే ముఠా సభ్యుల మధ్య అంతర్గత పోరు కారణంగానే తారిఖ్ హత్య జరిగినట్లు తెలుస్తోంది. స్థానిక ఉగ్రవాదులు ఈ దాడికి పాల్పడి ఉంటారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కరాచీలో అతిపెద్ద మురికివాడగా పేరున్న ఓరంగి టౌన్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. దుండగులు అతి సమీపం నుంచి తారిఖ్‌పై పలుమార్లు కాల్పులు జరిపారని, ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన అతడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడని పాక్ మీడియా కథనాలు వెల్లడించాయి. భారత్‌లో మోస్ట్ వాంటెడ్‌గా ఉన్న జైషే మహ్మద్ చీఫ్ మసూద్ అజార్‌కు తారిఖ్ అత్యంత సన్నిహితుడు. పాక్‌లో టాప్ ఉగ్రవాది హతమవడం ఈ నెలలో ఇది మూడో ఘటన కావడం గమనార్హం. గతవారం మరో ఉగ్ర సంస్థ లష్కరే తోయిబా కమాండర్ అక్రమ్ ఘాజీని కొందరు గుర్తుతెలియని వ్యక్తులు కాల్చి చంపారు. అంతకుముందు ఈ నెల ఆరంభంలో లష్కరేకు చెందిన మరో ఉగ్రవాది ఖ్వాజా షాహిద్ నియంత్రణ రేఖ సమీపంలోని పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో హతమయ్యాడు. తాజాగా తారిఖ్ హత్య చోటుచేసుకోవడంతో పాక్ మరోసారి ఉలిక్కిపడింది. ఈ ఘటనను పాక్ పోలీసులు ఖండించారు. ఇది ‘లక్షిత హత్య’ అని పేర్కొన్నారు. గత కొన్ని రోజులుగా పాకిస్థాన్‌లో ఉగ్రవాదులు ఇలా గుర్తుతెలియని వ్యక్తుల చేతుల్లో హత్యకు గురవుతున్నారు. దీంతో వారికి కంటిమీద కునుకు లేకుండా పోయింది. భయంతో చాలా మంది ముష్కరులు రహస్య ప్రదేశాల్లో దాక్కున్నట్లు సమాచారం.

# దీపావళికి అనసూయ పాయసం రుచులు

యాంకర్ కం నటి అనసూయ భరద్వాజ్ ఈ దీపావళిని ఎలా సెలబ్రేట్ చేసుకున్నారు? అభిమానులు సోషల మీడియాల్లో తరచి చూస్తున్న అంశమిది. దీనికి సమాధానం అనసూయ ఇన్ స్టాలో ఉంది. తన దీపావళి వేడుకల నుండి భర్త, పిల్లలతో కలిసి ఉన్న ఫోటోలను అనసూయ భరద్వాజ్ షేర్ చేసుకున్నారు. అనసూయ భరద్వాజ్ తన కుటుంబం, భర్త పిల్లలతో కలిసి దీపావళి జరుపుకున్నారు. సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటోల్లో అనసూయ సాంప్రదాయ పింక్ కలర్ ఎంబ్రాయిడరీ చీరలో కనిపించింది. దీపావళి సందర్భంగా దేవుళ్లను ప్రార్థించిన అనంతరం రుచికరమైన పాయసం, ఇతర ఆహారాన్ని కుటుంబానికి వడ్డిస్తూ కనిపించింది. ఆమె ఒక ఫోటోలో కొన్ని దీపావళి వంటకాలను రుచి చూస్తూ సిసలైన గృహిణిలా కనిపించింది. తన భర్త సుశాంక్ భరద్వాజ్ - ఇద్దరు కుమారులతో ఉన్న ఫోటో అందరి మనసులను దోచుకుంది. అనసూయ కుటుంబం దీపావళి ఆచారాల తర్వాత క్రాకర్లు పేలుస్తూ కనిపించింది. పండగ సమయాన్ని ఆస్వాధిస్తూ కనిపించారు. అనసూయ అందమైన పచ్చ ఆకుపచ్చ పట్టు చీరలో కనిపించింది. ఈ పోస్ట్‌కి అనసూయ ఇలా



క్యాప్షన్ ఇచ్చింది, “దీపావళి శుభాకాంక్షలు. దీపావళి శుభాకాంక్షలు. దీపావళి శుభాకాంక్షలు. మా నుండి మీ వరకు చదీపావళి2023”.. అని రాసారు. ఈ ఫోటోలపై అభిమానులు ప్రశంసలు కురిపించారు. దీపావళి శుభాకాంక్షలు, అనసూయ గారూ అని ఒక అభిమాని స్పందించగా, ఈ కాంతి పండుగ ఆనందం, శ్రేయస్సు సమృద్ధిని తీసుకురావాలి. అందమ్కైన కుటుంబం అని మరొకరు రాసారు. తెలుగు చిత్ర పరిశ్రమలో అంచెలంచెలుగా ఎదిగిన మేటి ప్రతిభావని అనసూయ. ఆరంభం యాంకర్ గా రాణించి, నటనలోకి అడుగుపెట్టారు. తనకు విపరీతమైన అభిమానుల ఫాలోయింగ్ ఉంది. సోషల్ మీడియాల్లో లక్షలాది ఫ్యాన్స్ తన అప్ డేట్స్ కోసం వేచి చూస్తారు. తన అత్యుత్తమ నటన హోస్టింగ్ నైపుణ్యాలతో పాటు అనసూయ తన అద్భుతమైన ఫ్యాషన్ ఎంపికలతోను పాపులరైంది. కెరీర్ మ్యాటర్ కి వస్తే... అనసూయ ఇప్పుడు పూర్తి సమయం నటనకు కేటాయించారు. 2023లో వరుస సినిమాల్లో నటించారు. మైఖేల్, రంగమార్తాండ, విమానం, పెద్ద కాపు 1, ప్రేమ విమానం వంటి అనేక సినిమాల్లో నటించగా అవి విడుదలయ్యాయి. చివరిగా - ప్రేమ విమానంలో కనిపించింది. ఈ చిత్రానికి సంతోష్ కట దర్శకత్వం వహించారు. దేవాన్ష్ నామా, అనిరుధ్ నామా, సంగీత్ శోబన్, సాన్వే మేఘన, అనసూయ భరద్వాజ్, వెన్నెల కిషోర్ ప్రధాన పాత్రలలో నటించారు. ఈ చిత్రం జీ5లో స్ట్రీమింగ్ అవుతోంది. పుష్ప: ది రూల్‌లో కూడా ఒక ముఖ్యమైన పాత్రలో కనిపించనుంది.

# యంగ్ డైరెక్టర్ తో వామికా గబ్బి..జీవితానికిది చాలు!

ఇండస్ట్రీకొచ్చిన ప్రతీ హీరోయిన్ కి ఓ డ్రీమ్ రోల్ అంటూ ఒకటుంటుంది. ఫలానా పాత్రలో నటించాలని పరిశ్రమకి రాక ముందునుంచే కలలు కంటుంటారు. అందుకు కొంత మంది నటీమణుల్ని స్ఫూర్తిగా తీసుకుంటారు. అయితే డ్రీమ్ రోల్ రావడం అన్నది అంత సులభంగా జరిగే పనికాదు. అలాంటి పాత్రలు అందుపుచ్చుకోవడానికి చాలా సమయం పడుతుంది. అందుకు ట్యాలెంట్ తో పాటు టైమ్...లుక్ అన్నీ కలిసి రావాలి. అలాగైతేనే సాధ్యమవుతుంది. తాజాగా యువ నాయిక వామిక గబ్బీ ఆ కోటాకి చెందిన భామగా చెప్పుకుంటుంది. 'జూబిలి'..'గ్రహన్' లాంటి వెబ్ సిరీస్ లతో వామిక ప్రేక్షకుల్ని మెప్పించిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ భామ యువ సంచలనం అట్లీ సినిమాలో అవకాశం దక్కించుకుంది.



ఇప్పుడీ అవకాశాన్ని తన డ్రీమ్ రోల్ గా ప్రచారం చేసుకుంటోంది. అట్లీ బ్రాండ్ తో అమ్మడు తనని తాను వ్యక్తిగతంగా ప్రమోట్ చేసుకుంటుంది. అట్లీ లాంటి స్టార్ డైరెక్టర్ తో పనిచేయడం కన్నా నాలాంటి వాళ్లకు అంతకు మించిన డ్రీమ్ రోల్ ఎక్కడ దొరుకుతుందని సంతోషం వ్యక్తం చేసింది. అలాగని అట్లీ ఈ సినిమాకి దర్శకుడు కాదండోయ్. ఆయన కేవలం నిర్మాత మాత్రమే. ఈ సినిమాకి దర్శకత్వం వహించేది కలీస్. ఆయన చెప్పిన కథ నచ్చడంతో అట్లీ చిత్రాన్ని నిర్మించడానికి ముందుకొచ్చారు. ఈ సందర్భంగా వామికా గబ్బీ ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. 'అట్లీ గొప్ప దర్శకుడు.. యాక్షన్.. ఎమోషన్ కలిపి అద్భుతాలు చేయగల గ్రేట్ మేకర్. అలాంటి వ్యక్తితో కలిసి పనిచేయడం ఎంతో సంతోషంగా ఉంది. పైగా ఇందులో నేనెంతో ఇష్టపడే పాత్ర కూడా దక్కింది. ఇది పెద్ద కమర్శియల్ చిత్రం. ఇలాంటి ఓ సినిమా నా జీవితంలో ఉంటుందని ఊహించలేదు. నేను అనుకోకుండా నా దగ్గరకు ఊహించని ప్రాజెక్ట్ వచ్చినప్పుడు దాన్ని నేను డ్రీమ్ రోల్ గానే భావిస్తాను. ఓ పాత్రలో నటించే అవకాశం కల్పించారు అంటే ఆ పాత్రకు మనం సూటవుతున్నామని..న్యాయం చేస్తామనే నమ్మకంతోనే ఛాన్స్ ఇస్తారు. అట్లీ అండ్ కోకి నాపై ఆ నమ్మకం ఉంచినందుకు ధన్యవాదాలు' అని అంది.





# ర్యాపర్‌తో ప్రేమలో మృణాల్ ఠాకూర్?



అతడు పాపులర్ ర్యాపర్. తనదైన గానంతో ఉర్రూతలూగిస్తాడు. బాలీవుడ్ లో చార్ట్ బస్టర్ పాటలు పాడాడు. ప్రపంచవ్యాప్తంగా అతడికి భారీ ఫాలోయింగ్ ఉంది. ఇప్పుడు అతడితో సీతారామం బ్యూటీ మృణాళ్ ఠాకూర్ ప్రేమలో ఉందంటూ ప్రచారం సాగుతోంది. ఆ ఇద్దరి మధ్యా సాన్నిహిత్యానికి సంబంధించిన ఓ వీడియో ఇలాంటి సందేహాలకు తావిచ్చింది. ఈ వీడియోని అభిమానులు వైరల్ గా షేర్ చేస్తూ ముచ్చటైన జంట! అంటూ కామెంట్లు చేస్తున్నారు. ఇంతకీ ఆ ర్యాపర్ ఎవరు? అంటే.. అందరికీ సుపరిచితుడే అయిన పాపులర్ గాయకుడు ర్యాపర్ బాద్ షా. మృణాల్ ఠాకూర్, బాద్షా జోడీ డేటింగ్ చేస్తోందంటూ ఒకటే ముంబై మీడియా ప్రచారం సాగించేస్తోంది. అందుకు కారణం లేకపోలేదు. మృణాల్ -ర్యాపర్ బాద్షా శిల్పా శెట్టి దీపావళి పార్టీ నుండి మిడ్ నైట్ లో తిరిగి వెళుతూ ఇద్దరూ చేయి చేయి కలిపి సన్నిహితంగా కనిపించారు. రెడ్డిట్‌లో ఇప్పుడు పిచ్చిగా వైరల్ అవుతున్న ఈ వీడియో ఎన్నో సందేహాలకు తావిచ్చింది. ఆసక్తికరంగా మృణాల్ తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో ఈ పార్టీ నుండి బాద్షా- శిల్పాశెట్టితో కలిసి ఉన్న ఒక ఫోటోను షేర్ చేసింది. ఇద్దరు ఇష్టమైనవారు అని వ్యాఖ్యానించింది. ర్యాపర్ బాద్ షా కూడా తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో మృణాల్ కథనాన్ని రీపోస్ట్ చేశాడు. మృణాల్ ఆలివ్ గ్రీన్ ఎథ్నిక్ దుస్తుల్లో ఎంతో అందంగా కనిపించగా, బాద్షా పూర్తిగా బ్లాక్ కలర్ సంప్రదాయ దుస్తుల్లో స్మార్ట్ గా కనిపించాడు. వారు చేతులు పట్టుకున్న వైరల్ వీడియోపై స్పందిస్తూ, ఒక నెటిజన్ ఇలా వ్యాఖ్యానించాడు. జంటగా కలిసి ఉంటారని ఊహించలేదు... వావ్... నిజంగా వావ్.. అని వ్యాఖ్యానించగా,చాలా తేడా కేసులాగా కనిపిస్తోంది. వారికి శుభాకాంక్షలు.. ఇద్దరూ చాలా ప్రతిభావంతులు అని రాసారు. నిజానికి ఈ సంవత్సరం ప్రారంభంలో బాద్షా తన చిరకాల ప్రేయసి కం నటి ఇషా రిఖీని వివాహం చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నాడని పుకార్లు వచ్చాయి. ఉత్తర భారతదేశంలో గురుద్వారా సాంప్రదాయ వివాహం జరుగుతందని కూడా కథనాలొచ్చాయి. ఇషా రిఖి పంజాబీ నటి. ఆమె 2013లో జట్ బాయ్స్ పుట్ జట్టన్ దే చిత్రంతో నటనా రంగ ప్రవేశం చేసింది. ఈ చిత్రంలో సిప్పీ గిల్, ఓం పూరి తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు. ఈ నటి 2018లో నవాబ్జాదేతో బాలీవుడ్‌లోకి అడుగుపెట్టింది. ఇందులో వరుణ్ ధావన్, రాఘవ్ జుయల్, పునీత్ పాఠక్ కూడా నటించారు. బాద్‌షా, రిఖీలు ఏడాది కాలంగా డేటింగ్‌లో ఉన్న సంగతి తెలిసిందే. వారు తమ పరస్పర స్నేహితులలో ఒకరి ద్వారా పార్టీలో కలుసుకున్నారు. అనంతరం ప్రేమలో పడ్డారు. అయితే ఇప్పుడు రిఖీ స్థానంలో మృణాల్ పేరు వినిపించడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఆ ఇద్దరూ చేయి చేయి కలిపి నడిచినంత మాత్రాన ప్రేమలో ఉన్నారని చెప్పగలరా? అంతకుమించి ఇంకేదైనా ఉంటే దానికి ప్రూఫ్ లు కావాలి. అప్పటివరకూ ఇవన్నీ గాసిప్స్ మాత్రమే!!

# ఇంకోసారి ఆ డుంకితో పోల్చకండి బాబు





యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ ప్రస్తుతం సలార్ మూవీతో ప్రేక్షకుల ముందుకి రావడానికి సిద్ధం అవుతున్నాడు. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా డిసెంబర్ 22న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్స్ లోకి రానుంది. భారీ బడ్జెట్ తో పాన్ ఇండియా ప్రాజెక్ట్ గా సిద్ధమవుతోన్న ఈ మూవీపై భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి. అయితే సలార్ కి పోటీగా అదే రోజు షారుఖ్ ఖాన్ డుంకీ మూవీ కూడా రిలీజ్ కాబోతోంది. ఈ ఏడాది రెండు వరుస హిట్స్ తో మంచి జోరు మీద ఉన్న షారుఖ్ ఖాన్ ఓ వైపు ఆదిపురుష్ లాంటి డిజాస్టర్ తర్వాత ప్రభాస్ నుంచి వస్తోన్న సలార్ మరోవైపు పోటీ పడుతున్నాయి. కామన్ గా ఎవరైనా షారుఖ్ ఖాన్ డుంకీ మూవీ రిలీజ్ కోసం ఎక్కువ మంది ఆసక్తి చూపించే అవకాశం ఉందని భావిస్తారు. అయితే సరైన సక్సెస్ లేకపోయిన డార్లింగ్ ప్రభాస్ మీద ఆడియన్స్ ఎక్స్ పెక్టేషన్స్ మాత్రం తారాస్థాయిలో ఉన్నాయని చెప్పాలి. అప్ కమింగ్ రిలీజ్ కాబోయే సినిమాలలో బుక్ మై షో మోస్ట్ ఇంటరెస్ట్ చిత్రాల జాబితాలో సలార్ టాప్ లో ఉంది. ఈ సినిమా కోసం 3 లక్షల 62 వేల 8 వందల మది ప్రత్యేకంగా ఆసక్తి చూపిస్తున్నారు. రిలీజ్ కోసం వెయిట్ చేస్తున్నట్లు తమ ఇంట్రెస్ట్ తెలియజేశారు. దీని తర్వాత స్థానంలో డుంకీ పట్ల కేవలం 76 వేల 7వందల మది మాత్రమే ఇంటరెస్టింగ్ చూపించారు. తరువాత యానిమల్ సినిమాపై 39 వేల 8 వందల మది ఆసక్తి చూపించడం విశేషం. ఈ మూడు చిత్రాలు డిసెంబర్ నెలలోనే రిలీజ్ కాబోతున్నాయి. ప్రేక్షకుల ఆసక్తి అత్యధికంగా సలార్ సినిమాపైనే ఉందని బుక్ మై షో ఇంట్రెస్ట్ ల ద్వారా స్పష్టం అయ్యింది. సలార్ కి పోటీగా డుంకీ మూవీ రిలీజ్ చేస్తే థియేటర్స్ ఇష్యూ కచ్చితంగా ఉంటుంది. అందుకే షారుఖ్ ఖాన్ అండ్ కో రిలీజ్ డేట్ వాయిదా వేసుకోవాలని ప్రయత్నం చేస్తున్నారంట. ప్రస్తుతానికి అయితే డుంకీ రిలీజ్ డేట్ విషయంలో ఎలాంటి మార్పు ఉండదని ప్రకటనలు అయితే ఇస్తున్నారు. కాని సలార్ మానియా ముందు డుంకీ నిలబడే అవకాశం లేదని బిటౌన్ లో కూడా సినీ విశ్లేషకులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే రాజ్ కుమార్ హిరాణీ పునరాలోచనలో పడ్డారని టాక్ వినిపిస్తోంది.

# 18 ఏళ్ల తర్వాత మిల్కీ బ్యూటీ హిట్...!

మిల్కీ బ్యూటీ తమన్నా 2005 సంవత్సరంలో సినీ రంగ ప్రవేశం చేసింది. హిందీ సినిమాతో ఎంట్రీ ఇచ్చిన ఏడాదిలోనే తెలుగు సినిమా లో కూడా నటించింది. ఆ రెండు సినిమాలు నిరాశ పరిచాయి. అయినా తమిళ్ లో ఆఫర్ దక్కింది. అక్కడ కూడా తమన్నాకి పెద్దగా కలిసి రాలేదు. కానీ 2007 లో హ్యాపీడేస్ సినిమా లో నటించి వెనక్కి తిరిగి చూసుకోకుండా హీరోయిన్ గా చేసింది.. ఇంకా చేస్తూనే ఉంది. ఈ 18 ఏళ్లలో హిందీ, తెలుగు, తమిళ్, కన్నడం మరియు



మరాఠీ భాషల్లో నటించింది. కానీ సౌత్ లో మలయాళ సినిమాలో మాత్రం ఈమె నటించలేదు. కెరీర్ ముగింపు దశకు వచ్చింది..మలయాళ సినిమాలో తమన్నా ఇంకా నటించలేదు. దాంతో చాలా మంది ఆమె ఫిల్మోగ్రఫీ లో మలయాళ సినిమాలు ఉండవని భావించారు. కానీ ఎట్టకేలకు మలయాళ సినిమా లో తమన్నా నటించింది. దిలీప్ ప్రధాన పాత్రలో నటించిన మలయాళ చిత్రం 'బాంద్రా' లో తమన్నా హీరోయిన్ గా నటించింది. పెద్దగా అంచనాలు లేకుండా ఈ సినిమా మొన్న శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అనూహ్యంగా ఈ సినిమాకు మలయాళీ ప్రేక్షకుల నుంచి పాజిటివ్ టాక్ వచ్చింది. భారీ ఓపెనింగ్స్ కూడా ఈ సినిమాకు నమోదు అయినట్లు అక్కడి బాక్సాఫీస్ వర్గాల ద్వారా సమాచారం అందుతోంది. సినీ రంగ ప్రవేశం చేసిన 18 ఏళ్ల తర్వాత మిల్కీ బ్యూటీ తమన్నా మలయాళ సినీ ఇండస్ట్రీ లో నటించింది. నటించిన ఒక్కగానొక్క సినిమా కూడా మంచి విజయాన్ని సొంతం చేసుకోవడంతో ఆమె కి మరియు ఆమె ఫ్యాన్స్ ఆనందానికి అవధులు లేవని చెప్పాలి. మిల్కీ బ్యూటీ తమన్నా హిందీతో పాటు అన్ని భాష ల్లో కూడా విజయాలను సొంతం చేసుకున్న ఘనత సాధించినట్లు అయిందని ఆమె అభిమానులు మాట్లాడుకుంటున్నారు. హీరోయిన్ గా తెలుగు మరియు హిందీ భాషల్లో బిజీగా లేని సమయంలో మలయాళంలో హిట్ పడటంతో అక్కడ ఓ అయిదు సంవత్సరాల పాటు తమన్నా కుమ్మేయడం ఖాయం అనిపిస్తుంది.

# ఈమె వయసు నిజంగా 51 అంటే నమ్ముతారా?

సౌత్ సినిమాలతో ఇండస్ట్రీలో అడుగు పెట్టి చాలా తక్కువ సమయంలోనే స్టార్ హీరోయిన్ గా గుర్తింపు దక్కించుకున్న ముద్దుగుమ్మ టబు. సౌత్ నుండి నార్త్ కి వెళ్లి అక్కడ దాదాపు అందరు స్టార్ హీరోలతో సినిమాలు చేసి అరుదైన రికార్డ్ ని సొంతం చేసుకుంది. మూడు దశాబ్దాలుగా టబు సినిమాల్లో సందడి చేస్తూనే ఉంది. ఇప్పటి వరకు పెళ్లి చేసుకోలేదు, సినిమాలను కంటిన్యూ చేస్తూనే ఉంది.



హీరోయిన్ గా టబు ఇండస్ట్రీ లో అడుగు పెట్టి దాదాపుగా మూడు దశాబ్దాలు అవుతున్నా కూడా ఇంకా కూడా హీరోయిన్ పాత్రల్లో నటిస్తుంది అంటే కారణం ఈ అందం అనడంలో ఎలాంటి సందేహం లేదు. తాజాగా టబు తన అందంతో మరోసారి అందరికి షాక్ ఇచ్చింది. పాతికేళ్ల పడుచు అమ్మాయి మాదిరిగా టైట్ జీన్స్ ధరించి, సింపుల్ టాప్ లో స్కిన్ షో చేయకుండానే చూపు తిప్పుకోనివ్వడం లేదు. ఈ ఫోటోని చూసిన ఎవరైనా ఈమె వయసు 51 అంటే నిజమా అంటూ నోరు వెళ్లబెట్టడం ఖాయం. ఈ రేంజ్ లో అందంగా ఉన్న టబు మరో పదేళ్లు అయినా కూడా మూడు పదుల వయసు ముద్దుగుమ్మ అన్నట్లుగానే అనిపిస్తుంది అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. అయిదు పదుల వయసు లోనే పాతికేళ్ల పరువాలతో కనిపించే ముద్దుగుమ్మలు చాలా తక్కువ మంది ఉంటారు. అందుకే టబు అరుదైన పీస్ అంటూ ఆమె అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు.




తొర్రూరు: స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్లయినా దేశంలో రావాల్సిన ప్రజాస్వామ్య పరిణతి ఇంకా రాలేదని భారాస అధినేత, సీఎం కేసీఆర్ అన్నారు. పార్టీల చరిత్ర, నడవడిక చూసి ఓటేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. భారాస పుట్టిందే తెలంగాణ కోసమని చెప్పారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా జనగామ జిల్లా పాలకుర్తి నియోజకవర్గం తొర్రూరులో నిర్వహించిన భారాస ప్రజా ఆశీర్వాద సభలో ఆయన మాట్లాడారు. "ఎన్నికలు అనగానే ఎందరో వస్తున్నారు.. ఏవేవో మాట్లాడుతున్నారు. ఓటు వేసే ముందు ప్రజలు అన్నీ ఆలోచించి వేయాలి. నిజానిజాలు గమనించి ఓటు వేయాలని కోరుతున్నా. పదేళ్ల ముందు పాలకుర్తి ఎలా ఉంది.. ఇప్పుడెలా ఉందో ప్రజలు ఆలోచించాలి. గతంలో ఇక్కడి నుంచి వేల మంది వలసపోయేవారు. ఇప్పుడు ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడికి వస్తున్నారు.

పాలకుర్తి నియోజకవర్గంలో లక్షా 30వేల ఎకరాలకు సాగునీరిచ్చాం"అని కేసీఆర్ అన్నారు. రైతుబంధు దుబారా అని కాంగ్రెస్ నేతలు అంటున్నారని కేసీఆర్ మండిపడ్డారు. 24 గంటల విద్యుత్ వద్దని.. 3 గంటలు చాలని పీసీసీ అధ్యక్షుడే చెబుతున్నారని.. నాయకుల గోల్‌మాల్ మాటలు విని ఆగం కావొద్దని ప్రజలను ఆయన కోరారు. దేశాన్ని 50 ఏళ్ల పాటు పాలించిన కాంగ్రెస్‌తో మన బతుకులు మారాయా? అని కేసీఆర్ ప్రశ్నించారు.

**తెలంగాణ ఆత్మగౌరవం మరోసారి నిలబెట్టాలి..** కాంగ్రెస్ పార్టీ ఏనాడూ ధైర్యంగా పని చేసి అన్ని వర్గాల ప్రజలను ఆదుకునే పని చేయలేదని కేసీఆర్ విమర్శించారు. నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని హాలియాలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ మాట్లాడారు. "భారాస అధికారంలోకి రాగానే ఏది ఏమైనా కరెంటు సమస్య పరిష్కరించాలని స్థిరమైన నిర్ణయం తీసుకున్నాం. సమస్యను పరిష్కరించి చూపించాం. గిరిజన రిజర్వేషన్లు 10 శాతానికి పెంచుకున్నాం. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వమైనా దళితులను ఆదుకుందా? కాంగ్రెస్ పాలనలో తాగు, సాగు నీరు, కరెంటు సంగతి మీకు తెలుసు. ప్రజాస్వామ్యంలో ప్రజలకు ఉండే ఒకే ఒక హక్కు.. ఓటు. ఇది ఎలాపడితే అలా వేసేది కాదు. ఎన్నికలు అనగానే ఎందరో వస్తుంటారు.. ఏవేవో మాట్లాడుతుంటారు. నియోజకవర్గం బాగుపడాలని ప్రతి ఒక్కరూ కోరుకోవాలి. ఆ దిశగా ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి. మంది మాటలు విని ఆగం అయితే ఐదేళ్లపాటు కష్టాల పాలవుతాం. అందుకే ఓటు వేసే ముందు అన్ని ఆలోచించి వేయాలి. అభివృద్ధిలో రాష్ట్రం ముందుకు వెళ్లాలి... వెనక్కి పోవద్దు. తెలంగాణ ఆత్మగౌరవం మరోసారి నిలబెట్టాలని కోరుతున్నా. జానారెడ్డి సీఎం అవుతానని కలలు కంటున్నారు. గతంలో జనారెడ్డికి మీరు ఓటుతో బుద్ధి చెప్పారు. నాగార్జునసాగర్‌లో భగత్‌ను 70వేల ఓట్ల మెజారిటీతో గెలిపించాలి" అని కేసీఆర్ పిలుపునిచ్చారు.




## మధ్యప్రదేశ్ పోరు.. కేంద్రమంత్రి కుమారుడి 'వీడియో'లపై రచ్చ!

మధ్యప్రదేశ్‌లో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు సమయం దగ్గరపడుతోన్న వేళ అధికార భాజపాకు ఊహించని పరిణామాలు ఎదురవుతున్నాయి. కేంద్రమంత్రి నరేంద్రసింగ్ తోమర్ కుమారుడు కొందరు వ్యాపారవేత్తలతో రూ.కోట్ల వ్యవహారం గురించి మాట్లాడుతున్నట్లు వీడియోలు వైరల్ అవుతుండటం రాష్ట్రంలో హాట్ టాపిక్‌గా మారింది. దీంతో భాజపాపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తుతుండగా.. అటు అధికార పార్టీ కూడా అవి ఫేక్ వీడియోలు అంటూ తిప్పికొడుతోంది. మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ దిమనీ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేస్తున్నారు. ఈ క్రమంలో ఆయన కుమారుడు దేవేంద్ర సింగ్ తోమర్.. కొంతమంది మధ్యవర్తులతో రూ.కోట్ల వ్యవహారం మాట్లాడుతున్న వీడియో ఇటీవల సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. దీనిపై చర్చ జరుగుతుండగానే ఇటువంటిదే మరో వీడియో బయటకు రావడం కలకలం రేపింది. ఇదే విషయాన్ని కీలకాంశంగా పేర్కొంటున్న కాంగ్రెస్.. భాజపాపై ఆరోపణలు గుప్పిస్తోంది. గతంలో కర్ణాటకలో మాదిరిగానే ఇక్కడ కూడా భాజపా ప్రభుత్వం 50శాతం కమీషన్ ప్రభుత్వంగా మారిందని కాంగ్రెస్ అధికార ప్రతినిధి రాగినీ నాయక్ విమర్శించారు. ఒకవేళ అది తప్పుడు వీడియో అయితే వాటిని ఎవరు రూపొందించి వైరల్ చేశారనే విషయంపై స్పష్టత ఇవ్వాలని డిమాండు చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇదే విషయాన్ని ప్రస్తావించిన రాహుల్ గాంధీ.. భాజపా నేత బహిరంగంగా లంచం డిమాండు చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పుడు తోమర్ కుమారుడిపై మోదీ ప్రభుత్వం ఈడీ, సీబీఐ, ఐటీలను పంపుతుందా? అని ప్రశ్నించారు. ఈ వివాదంపై కేంద్రమంత్రి తోమర్ గ్వాలియర్‌లో మాట్లాడుతూ..'బూటకపు చర్చలతో సమయాన్ని వృథా చేయకూడదు' అంటూ బదులిచ్చారు. అది ఫేక్ వీడియో అని.. దానిపై పోలీసులకు ఫిర్యాదు చేశామని కేంద్ర మంత్రి కుమారుడు దేవేంద్ర సింగ్ కూడా పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలను అటు భాజపా కూడా తోసిపుచ్చింది. 'ఆ వీడియోపై ఫిర్యాదు చేశాం. దర్యాప్తు జరుగుతోంది. ఇటువంటి వ్యూహాలతో ఎన్నికలు గెలవలేరు. కాంగ్రెస్ పార్టీనే అవినీతిలో కూరుకుపోయింది. కాంగ్రెస్ అధికారంలో ఉన్న 15నెలల కాలంలో రూ.281 కోట్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు' అని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు వీడీ శర్మ తిప్పికొట్టారు. ఇదిలాఉంటే, మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా 230 స్థానాలకు నవంబర్ 17న ఒకేరోజు పోలింగ్ జరగనుంది. ఇందుకోసం పార్టీల ప్రచారం ముగింపు దశకు చేరుకుంది. బుధవారం సాయంత్రం ఎన్నికల ప్రచారానికి తెరపడనున్న నేపథ్యంలో ప్రధాన పార్టీలు ఓటర్లను ఆకర్షించడంలో నిమగ్నమయ్యాయి.




హైదరాబాద్: రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయని తెలంగాణ మంత్రి కేటీఆర్ అన్నారు. తాజ్ డెక్కన్‌లో నిర్వహించిన తెలంగాణ బిల్డర్స్ ఫెడరేషన్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడారు. పెట్టుబడులు వస్తున్నందునే నగరంలో సంపద పెరుగుతోందన్నారు. ఈ పదేళ్లలో తెలంగాణ ప్రజల జీవన ప్రమాణాలు పెరిగాయని చెప్పారు. తలసరి ఆదాయంలో దేశంలోనే మన రాష్ట్రం నంబర్‌వన్‌గా నిలిచిందన్నారు. "ప్రాధాన్యతా క్రమంలో సమస్యలన్నీ పరిష్కరిస్తున్నాం. కొత్త రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారించాం. తాగు, సాగునీరు, విద్యుత్ సమస్యలు పరిష్కరించుకున్నాం. ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్య సరికొత్త హైదరాబాద్ తయారవుతోంది. నగరానికి రాకపోకలు చాలా సులువుగా జరగాలి. త్వరలో ప్రతిరోజూ తాగునీరు ఇచ్చేలా చూస్తాం. రెండేళ్లు కరోనా ఉన్నా ఐటీరంగంలో విశేష వృద్ధి సాధించాం. ఐటీ ఉద్యోగాల కల్పనలో రెండేళ్లుగా బెంగళూరును అధిగమిస్తూ వస్తున్నాం. రాష్ట్రంలో అభివృద్ధి, ప్రగతి ఇలాగే కొనసాగాలి. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 6 గ్యారంటీలు అమలువుతాయో లేదో చెప్పలేం కానీ 6 నెలలకో సీఎం మారడం మాత్రం గ్యారంటీ. రాష్ట్రాభివృద్ధికి స్టేబుల్ గవర్నమెంట్.. ఏబుల్ లీడర్‌షిప్ అవసరం. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే పదవుల కోసం నిత్యం కొట్లాటలే. సంపద సృష్టిస్తేనే కదా దాన్ని పేదప్రజలకు పంచగలం. సంపద సృష్టించాలంటే రాష్ట్రంలో శాంతిభద్రతలు బాగుండాలి. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అక్కడ పరిస్థితి దారుణంగా తయారైంది" అని కేటీఆర్ విమర్శించారు.




## నామినేషన్ల పరిశీలన పూర్తి.. జాతీయ పార్టీలకు ఝలక్!

హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో మరో ఘట్టం ముగిసింది. మంగళవారం నామినేషన్ల పరిశీలన పూర్తయింది. ఈ పరిశీలనలో మొత్తం 606 నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. నాగార్జున సాగర్‌లో జానారెడ్డి, హుజూరాబాద్‌లో ఈటల జమున నామినేషన్లు తిరస్కరణకు గురైనట్లు తెలుస్తోంది.

ఇక స్క్రూటినీ తర్వాత బరిలో 2,898 మంది అభ్యర్థులు నిలిచారు. అత్యధికంగా గజ్వేల్‌లో 114 మంది.. కామారెడ్డిలో 68 నామినేషన్లు వేశారు. ఈ రెండు నియోజకవర్గాల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ పోటీ చేస్తున్నారు. గజ్వేల్ ఈటల రాజేందర్, కామారెడ్డిలో పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి పోటీ చేస్తున్నారు. అత్యల్పంగా నారాయణపేటలో ఏడుగురు అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఇక బుధవారం నామినేషన్ల ఉపసంహరణకు చివరి రోజు కానుంది. మరికొంత మంది రేపు ఉపసంహరణ చేసుకొనే అవకాశం ఉంది. ఇక రాష్ట్ర వ్యాప్తంగా బీఎస్పీ అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరణకు గురైనట్లు సమాచారం. తప్పులు సరిచేయడానికి అవకాశం ఉన్నా ఆర్వోలు రిజెక్ట్ చేశారని బీఎస్పీ ఆరోపిస్తోంది. ఇక బీఆర్ఎస్ అభ్యర్థుల నామినేషన్లో కూడా తప్పులు ఉన్నాయని కాంగ్రెస్ ఫిర్యాదు చేసింది. ఖమ్మంలో పువ్వాడ అజయ్ నామినేషన్‌లో తప్పులున్నాయని కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు ఫిర్యాదు చేశారు. కానీ ఆర్వో పట్టించుకోవట్లేదని.. దీనిపై కోర్టుకు వెళ్తామని తుమ్మల పేర్కొన్నారు.

## ఖమ్మం జిల్లాలో 10 కి 10 స్థానాలు గెలుస్తాం



ఖమ్మం: ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ పార్టీ 10కి 10 స్థానాలు గెలుస్తుందని మాజీ కేంద్ర మంత్రి రేణుకా చౌదరి అన్నారు. మంగళవారం నాడు గాంధీభవన్‌లో ఆమె మీడియాతో మాట్లాడుతూ.. "రాష్ట్ర వ్యాప్తంగా వస్తున్న కాంగ్రెస్ సునామిలో కేసీఆర్ పార్టీ కొట్టుకుపోవడం ఖాయం. మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఓటమి భయంతో మా కార్యకర్తలపై దాడులు చేస్తున్నారు. మా ఖమ్మం కార్పొరేటర్ రాఫీనా బేగం పైన బైండోవర్ కేసులు వేశారు. మజ్లిస్, బీఆర్ఎస్ పార్టీలు కలిసి ఇబ్బందులు పెడుతున్నారు. చట్టానికి విరుద్ధంగా పోలీసులు వ్యవహరిస్తున్నారు. కాంగ్రెస్ కార్యకర్తలను ఇబ్బంది పెడితే ఖబర్దార్. నువ్వు ఓడిపోయిన తక్షణం అక్కడి నుంచి పారిపోతావ్. కాంగ్రెస్ పార్టీలో గెలిచి పార్టీ మారిన పువ్వాడ అజయ్ లాంటి వారిని దగ్గరకు తీసుకోవడం వల్లే కేసీఆర్ ఈ ఎన్నికల్లో ఓడిపోబోతున్నాడు. పువ్వాడ అజయ్ పాముకు పాలు పోస్తే కాటు వేసే రకం. పువ్వాడ అజయ్ కాంగ్రెస్ కార్యకర్తలను ఎంత ఇబ్బంది పెడితే అంత బలంగా ముందుకు వస్తారు. బీజేపీ, బీఆర్ఎస్, మజ్లిస్ పార్టీలు ఒకటే. ఈ పార్టీలు మతతత్వ రాజకీయాలు చేస్తున్నారు. ఖమ్మం జిల్లాలో ప్రచారం చేస్తా.కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి దాడులు చేస్తున్నాయి. మీరు దాడులు చేస్తారని మేము పైసలు ఇంట్లో పెట్టుకొని కూర్చుంటామా. బీఆర్ఎస్‌లో ఎంతమంది కోవర్టులు ఉన్నారో మాకు తెలుసు. మాకు కోవర్టులు ఉన్నారు. వారికి కూడా కోవర్టులు ఉన్నారు" అని రేణుకా చౌదరి అన్నారు.

## ఎన్నికల ముందు బీజేపీకి మరో ఎదురుదెబ్బ.. కీలక నేత ఔట్!





మెదక్: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సింగాయిపల్లి గోపి ఆ పార్టీకి రాజీనామా చేశారు. నర్సాపూర్‌లో బీజేపీ అసమ్మతి నేతలు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా గోపి మీడియాతో మాట్లాడారు. కులాల పేరుతో ఈటల రాజేందర్ రాజకీయం చేయడం సరికాదని హితవు పలికారు. గత 6 నెలల్లో బీజేపీలో సమీకరణాలు మారాయన్నారు. కొత్త వాళ్లు పార్టీలోకి వచ్చిన తర్వాత పార్టీ కలుషితమైందని ఆరోపించారు. కుట్ర పూరితంగానే బండి సంజయ్‌ను పార్టీలో నుంచి తప్పించడం జరిగిందని వ్యాఖ్యానించారు. పార్టీ కోసం కష్టపడే వారికి బీజేపీలో ప్రాధాన్యత లేదని వాపోయారు. భారతీయ జనతా పార్టీకి రాజీనామా చేయవలసిన పరిస్థితి వస్తాదని అనుకోలేదని ఆవేదన చెందారు. ఇప్పుడు బీజేపీలో తమకు గౌరవం లేదని వెల్లడించారు.

తెలంగాణలో ఎమ్మెల్యే సీట్లు అమ్ముడుపోతున్నాయని బీజేపీ అధిష్టానం గుర్తించాలని కోరారు. ఇక బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కార్యకర్తల ఫోన్ ఎత్తే పరిస్థితుల్లో లేరని గోపి విమర్శించారు.

## మందికి పుట్టిన పిల్లలను తమ పిల్లలుగా చెప్పుకునే రకం గంగుల

కరీంనగర్ : బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలది భూకబ్జాలు, అవినీతి లొల్లి అని బీజేపీ ఎంపీ బండి సంజయ్ అన్నారు. ఇసుక కుప్పలు కన్పిస్తే బీఆర్ఎస్ నేతలు డబ్బులు వసూలు చేస్తున్నారని... ఖాళీ జాగాలు కన్పిస్తే కబ్జాలు చేస్తున్నారన్నారు.

యువతను మంత్రి గంగుల కమలాకర్ గంజాయి మత్తులో ముంచుతున్నారన్నారు. బీఆర్ఎస్ నేతలు గల్లీలో తిరుగుతుంటే జనమే నిలదీస్తున్నారన్నారు. ఓట్ల కోసం ఓటుకు రూ.10 వేలు పంచేందుకు సిద్ధమయ్యాడని బండి సంజయ్ పేర్కొన్నారు. లక్ష సెల్ ఫోన్లు పంచేందుకు గంగుల కమలాకర్ సిద్ధమయ్యాడని పేర్కొన్నారు. గంగుల ఓటమి ఖాయమని కేసీఆర్‌కు ఎప్పుడో తెలుసన్నారు. అందుకే ఒవైసీ వద్ద మోకరిల్లి పచ్చజెండా పట్టుకున్నాడన్నారు. భూకబ్జాలు తప్ప కాంగ్రెస్ చేసిందేమిటని బండి సంజయ్ ప్రశ్నించారు. మందికి పుట్టిన



పిల్లలను తమ పిల్లలుగా చెప్పుకునే రకం గంగుల అని విమర్శించారు. గంగుల కమలాకర్ మళ్లీ గెలిస్తే జీతాలు, ఫించన్లు రావన్నారు. మా అత్త చనిపోయిందని ఇంటికొస్తే కేసీఆర్, గంగుల కుట్ర చేసి తనను జైలుకు పంపారని బండి సంజయ్ తెలిపారు.

## అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే బీఆర్ఎస్‌ను గెలిపిస్తాయి :మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



హైదరాబాద్ : బీఆర్ఎస్ పార్టీని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే గెలిపిస్తాయని సనత్‌నగర్ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మంగళవారం బేగంపేటలోని దేవిడి, తబేలా, వికార్ నగర్, భగవంతపూర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గడిచిన 50 సంవత్సరాల్లో జరగని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో జరిగాయన్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ పని చేశారని పేర్కొన్నారు. ఇన్నేండ్లు దేశాన్ని పాలించిన కాంగ్రెస్ పార్టీ అభివృద్ధిని గాలికి వదిలేసిందని మండిపడ్డారు. ప్రజలు ఇప్పుడు జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగాలని కోరుకుంటున్నారు. ముచ్చటగా మూడోసారి ముఖ్యమంత్రిగా కేసీఆర్ నాయకత్వంలో BRS ప్రభుత్వం ఏర్పాటవుతుందని స్పష్టం చేశారు.

## 'యథా రాజా తథా ప్రజా' అన్నట్టుగా బీఆర్ఎస్ నేతల తీరు.. తుమ్మల ఫైర్

ఖమ్మం: 'యథా రాజా తథా ప్రజా' అన్నట్టు అధికార పార్టీ నేతలు బెదిరించి భూ కబ్జాలు చేస్తున్నారని కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా 6 వ డివిజన్ హవేలీలో తుమ్మల రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా తుమ్మలకు కాంగ్రెస్ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. అనంతరం తుమ్మల మాట్లాడుతూ... కార్పొరేటర్లు బరితెగించి దందాలు చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ నాయకులను బెదిరించే వారిని మహిళలే చెప్పుతో కొడతారని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు నింపుతామన్నారు.

తెలంగాణ కల సాకారం చేసిన సోనియమ్మ, రాహుల్ గాంధీ రుణం తీర్చుకోవాలని అన్నారు. దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన గాంధీ కుటుంబం కోసం మద్దతుగా ఉండాలని కోరారు. దేశంలో మత సామరస్యం మంట కలిసేలా కొన్ని శక్తులు ప్రయత్నం చేస్తున్నారన్నారు. దేశంలో విద్వేషం లేకుండా భారత్ జోడో యాత్రతో రాహుల్ గాంధీ ఐక్యం చేశారని తెలిపారు. మహిళల వికాసం కోసం సోనియా గాంధీ మహాలక్ష్మీ పథకం రూప కల్పన చేశారన్నారు. రైతుల కోసం, కౌలు రైతుల కోసం రైతు భరోసా పథకం కాంగ్రెస్ పాలనలోనే అని చెప్పుకొచ్చారు. ఏ దేశంలో పుట్టినా సోనియా గాంధీ సాటి మహిళల కష్టాలు తెలుసన్నారు. కర్ణాటకలో మాదిరి తెలంగాణలో ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేస్తారని తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

## ఎందరో బలిదానాన్ని ఒకే ఒక్క కుటుంబం స్వార్థం కోసం వాడుకుంటోంది

ఖమ్మం : తిరుమలాయపాలెంలో ఎన్నికల ప్రచారంలో పాలేరు కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఈ ప్రచారంలో భాగంగా పొంగులేటి మాట్లాడుతూ.. ఎంతో మంది కవులు, కళాకారులు, ఉద్యమకారులు, విద్యార్థులు బలిదానం ఫలితంగా వచ్చిన తెలంగాణ రాష్ట్రం కేవలం ఒకే ఒక్క కుటుంబం స్వార్థం కోసం వాడుకుంటోందని పేర్కొన్నారు. 2014కు ముందు కేసీఆర్ ఆర్థిక పరిస్థితి ఏంటి?.. గడిచిన తొమ్మిదిన్నర సంవత్సరాల్లో ఆర్థిక పరిస్థితి ఏంటనేది ప్రజలు ఆలోచించాలని పొంగులేటి పేర్కొన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ఇంద్రలోకాన్ని చూపిస్తూ తెలంగాణ యాసలో ప్రజలను మభ్య పెడుతుంటాడన్నారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌ను కాదని రెండు సార్లు కేసీఆర్‌కు అధికారం అప్పగిస్తే ధనిక రాష్ట్రంగా ఉన్న రాష్ట్రాన్ని ఐదున్నర లక్షల కోట్ల అప్పుల పాలు చేశాడన్నారు.



కాళేశ్వరం పేరుతో ఐదున్నర లక్షల కోట్లలో ప్రజల సొమ్ము కేసీఆర్ దొంగిలించాడని పొంగులేటి తెలిపారు. అలాంటి కేసీఆర్ ను మరోసారి ముఖ్యమంత్రిని చేద్దామా? అని ప్రశ్నించారు. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. ఇందిరమ్మ రాజ్యం వస్తేనే మన కష్టాలు తీరుతాయని పొంగులేటి తెలిపారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com